2

# జయ్‌విజయ యిన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్

(పూర్వపు జయభారత్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.)

ప్రకటన.

పరస్పర లాభపద్ధతిలో తీసుకొనబడిన భీమాపట్టాలు, మిక్కిలి లాభకరమైన షరతులతో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన శాస్త్రీయప్రణాళికలోనికి మార్చుకోదగిన ఏర్పాట్లు చేయబడినవి.

ఈ అవకాశము నుపయోగించుకొన నుత్సాహపడు ప్రస్తుత పట్టాదారులు ప్రధాన కార్యాలయమునుంచి వాని వివరములను తెలుసుకొనవచ్చును.

ఈ క్రొత్త ప్రణాళికను అమలులోనికి తీసుకొనివచ్చుటకు నెల 1 కి రు 35 ల నుండి రు 450 ల వరకు జీతముపై పనిచేయుగల ఏజెంట్లు కావలయును. వివరములకు వెంటనే వ్రాయుడు.

**4-105 ఆర్మీనియన్ వీధి, మదరాసు.**

# ఆంధ్రభూమి

సాలు చందా
రూ. 3—0—0.

రిజిష్టర్డు



ట్రేడ్ మార్కు.

## అఖిల సుఖరోగ చికిత్స

ఈ ఔషధరాజము కేవలము మూలికా సంయోగముచే తయారుచేయబడినది. యిందు రస, విష, పాషాణ, గంధకాదు లేవియు చేర్చబడలేదు. 20 దినములు మా 'అఖిల సుఖరోగ చికిత్స' యిచ్ఛాపత్యముతో వాడిన యెడల ఎంతకాలము నుంచి జీర్ణించియున్న స్త్రీజాతిసెగలుగాని, ఎట్టి కఠినపు స్థితియందున్న సవాసంబంధమైన వ్యాధులుగాని నిస్సందేహముగా నివారణ కాగలవని వేనవేలు వాడి ఆరోగ్యమును బడసిన రోగులే నిదర్శనములు. వ్యాధి వివరములు తెలుపుచూ ఆర్డరు పంపినయెడల ఒకటిన్ను పోష్టుఖర్చులతో సహా రూ. 4 6 0 లకు వి.పి.గా పంపబడును.

డాక్టరు. బి. యస్. రావు అండ్ కో.

గోపాలపురం. (వయా) కొత్తపేట, తూర్పుగోదావరిజిల్లా.

# నిజాము రాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మా కార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొననగును.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేరు పెంటయ్య గారు, 4121 మూసాఖాన్ వీధి, శికిందరాబాదు

# ట్రావెలింగు యేజెంటు

శ్రీయుత నేతి కామేశ్వరశాస్త్రిగారిని ఆంధ్రభూమికి ట్రావెలింగు యేజెంటుగ నియమించినారము. కావున ఆంధ్రభూమి అభిమానులు వారికి చందాలనిచ్చి తగుమైన రసీదు పొందనగునని తెలియజేయుచున్నాము

యిట్లు ఆంధ్రభూమి మేనేజరు.




# ఆశ్చర్య కుష్ఠరోగ నిర్మూలిని

(రిజిష్టర్డు.)

గుణములేదని ఋజువుచేయువారికి రు. 1000 లు బహుమానము 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యేస్థితిలో యెంతకాలము నుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. మృత్యుముఖమునుండి అనేక వేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులు మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్నిభాషలలోను దొరకు మా కేట్లాగులకు యీ దిగువ యడ్రసుకు వ్రాయుడు.

యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

లక్ష్మీ అండ్ కంపెనీ (రిజిష్టర్డు)
కుష్ఠు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,
అల్లిపురం మెయిన్ రోడ్డు, వాల్తేరు ఆర్. యస్ పోష్టు.

**కామశాస్త్రము** ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులలో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లరి వ్రాతలు కావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాబట్టి దీని గొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒకరూపాయి.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

## పునర్నవాది

## తైలము.

వాత్స్యాయనమహర్షిచే వ్రాయబడిన కామశాస్త్రమందలి యోగము ననుసరించి చేయబడిన సుగంధకరణ తైలము.

దీనిని శరీరమునకు అభ్యంజనము చేసికొనినచో త్రిదోషహరమై; చర్మవ్యాధులను అంటకుండ జేయును.

4 ఔన్సుల సీసా రు. 1-0-0.

## భృంగామలక

## తైలము.

దీనిగుణము ప్రఖ్యాతిబడసియే యున్నది

6 ఔన్సుల సీసా రు. 1-0-0.

వలయువారు క్రింది చిరునామాకు వ్రాసికొనుడు.

సురూప్ కంపెనీ వేపేరి మద్రాసు.

లేక

నున్న బాలక్రిష్ణారావు గారు,

న్యూస్‌బోయ్ అండ్ కో, కాకినాడ.

## ది సౌత్ ఇండియా కోఅపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమునకంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకార సంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకనే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఅపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# విషయసూచిక


౧. పలుకరింత ... ౬౨౯
—వఝల వేంకటేశ్వరకవి, బి.ఏ.

౨. పనిమనిషి ... ౬౩౦
—కొడవటిగంటి కుటుంబరావు.

౩. ఆవేదన ... ౬౩౨
—కొండూరు వీరరాఘవాచార్యులు.

౪. 'అప్పన్నయిల్లు' ... ౬౩౩
—కాళూరి వెంకటరామారావు.

౫. రుచిదేవి ... ౬౩౯
—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు, బి.ఏ

౬. కలహం ... ౬౪౪
—భోగరాజు వీర్రాజు.

౭. నిస్పృహ ... ౬౪౯
—గుమ్మలూరు సత్యనారాయణ, బి.ఎస్.సి.ఎజి

౮. అతని ఊహలు ... ౬౫౦
—మొదలి సీతారామస్వామి, బి, ఏ.

౯. క్రీడావస్తువులు ... ౬౫౨
—చిట్టూరి సత్యనారాయణ

౧౦. సింధునదీప్రాంతములందలి ప్రాచీననాగరికత - తత్కారకులు ... ౬౫౩
—రాంపల్లి విశ్వేశ్వరరావు బి. ఏ (ఆనర్సు)

౧౧ కోడలిపిల్లా! ... ౬౬౧
—బొడ్డు బాపిరాజు

౧౨. భూలోకనరకాలు ... ౬౬౩
—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, బి.ఏ.బి.ఇడి.

౧౩. నిజరాగము ... ౬౬౬
—కవికొండల వెంకటరావు బి. ఏ; బి. ఎల్.

౧౪. నూతు 'కాఫీహోటలు' ... ౬౬౮
—తల్లాప్రగడ ప్రకాశరాయుడు ఎం. ఏ.

౧౫. విరక్తుడు ... ౬౭౫
—గోదావరి సత్యనారాయణ, బి. ఏ.

౧౬. గ్రంథాలయనిర్మాణము: నిర్వహణము... ౬౭౬
—మారేమండ రామారావు ఎం.ఏ.బి.ఇడి.

౧౭. రాధిక ... ౬౭౯
—పురాణం కుమారరాఘవశాస్త్రి బి. ఏ.

౧౮. రహస్యవేదన ... ౬౮౩
—పెమ్మరాజు రాజగోపాలము బి. ఏ.

౧౯. ఆంధ్రము : హిందీ ... ౬౮౪
—'కాశ్యపి'

౨౦. ఓ. పరమేశ్వరా! ... ౬౮౭
—ములుమూడి ఆదిశేషాద్రిరెడ్డి

౨౧ జిజ్ఞాస: మీమాంస ... ౬౮౮

౨౨. స్త్రీలకర్తవ్యము ... ౬౮౯

౨౩. మణిమాల ... ౬౯౦

౨౪. ఇన్నూన్యువిషయములు ... ౬౯౩

౨౫ సంపాదకీయసమాలోచన ... ౬౯౫

౨౬. ఆంధ్రుని డైరి ... ౬౯౬

౨౭. పోటీపరిమానము. ... ౭౦౦



నొప్పుల నివారించుటలో సాటిలేనిది. బుడ్డి వెల 0 5-0

## హనుమాన్ పెయిన్ బాం



పలుతావులయందు పలువురిచే వాడబడి తృప్తికరముగా పనిచేసినట్లు యోగ్యతాపత్రములను పడసినది. అన్నివిధములైన నొప్పులను, కత్తిగాట్లను బెణుకు నొప్పులను, వరిబీజములను వాపులను, జలుబులను, బిగురు దెబ్బలను, తిమ్మురులను నమ్మకమైన మందు. ఎంత తలనొప్పియైన 2 3 నిమిషములలో గారంటీగా పోవును.

హెడ్ ఆఫీసు: హనమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజెంట్లు: పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటర్, శ్రీరామకృష్ణ ట్రేడింగుకంపెని, నర్సారావుపేట.

కె నాగభూషణరావుగారు, తాడేపల్లిగూడెం, వెస్టుగోదావరిజిల్లా.

వి. బుచ్చిఅబ్బాయి అండు సన్సు, చికాకోలు, గంజాం జిల్లా.

ఏజెంట్లు లేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.

ఆంధ్రభూమి ప్రకటనలు

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :—బెజవాడ. స్థాపితము 1919.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ చిట్టకవి వీరరాఘవయ్యపంతులు గారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యియ్యబడును.

ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరము నగు సేవయే ఆదర్శము.

జననభీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

ఆంధ్రప్రావిడెంటు కంపెనీ,

గాంధినగర్, బెజవాడ.




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీగ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0 4 0 ధరకే దొరకును.

## గంధర్వకళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు ఆయ్యూని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

పౌను రు. 3—0—0

గంధర్వ ఫార్మసీ, రాజమండ్రి.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిబొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కొరింతవ్యగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కుపిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హెయిరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్‌స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు

భారతవైద్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

## బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.

# గమనింపుడు

మా మ్యాన్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు.

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా?

## నిజముగ జరిగిన సంగతి

వైద్య పరీక్ష లేదు. స్త్రీ పురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్థాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు.


## ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి: 22, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు:—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4 ట్యూటికారిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్టస్.



# Tri-Colour Process Blocks




M
C
A**ppaswamy Chetty** & Co.

PROCESS ENGRAVERS

64 Savarimuthu St Mannady MADRAS



# రామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన

**తాత కృష్ణమూర్తి, బి ఏ;యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు(ఎం ఏ;పి. హెచ్. డి.) గారి పీఠిక కలది. క్రౌన్ సైజు, వెల 12 అణాలు. స్త్రీలకు పోస్టుఖర్చులు ఉచితము.

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

**తాత కృష్ణమూర్తి, భద్రాచలం.**

# ది స్టార్ ఆఫ్ ఇండియా
# యిండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు
# కంపెనీ, లిమిటెడ్

8, తంబుచెట్టివీధి, మదరాసు.

## ౧౯౩౩ అభివృద్ధిదశ

| | | |
|---|---|---|
| నూతన వ్యాపారము | రూ | 17 లక్షలు. |
| చెల్లిచిన క్లెయిములు | ,, | 2 లక్షలు. |
| సంవత్సరాదాయము | ,, | 2½ లక్షలు. |

"కంపెనీ నిర్వహణ చాకచక్యమునకు కంపెనీవారిని ప్రశంసింపక తప్పదు. ప్రస్తుతపు పాలసీదారులు, రాబోవు పాలసీదారులు కంపెనీ పరిస్థితులకు గర్వించవలసిన అవకాశము కలదు" అని ఆక్చ్యువరీ కె. బి. మాధవగారు ప్రశంసించి యున్నారు.

ధారాళమైన కమీషను వేతనముపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

యమ్. యస్. ఆర్. ఎ. గుప్త, మేనేజింగు ఏజంటు.

# రత్నపురుష

శుక్లనష్టమును నూటికి నుదుర్చు తియ్యని మందు,

మేహరోగుల పాలిటి వరప్రసాదము.

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కండపుష్టి నొంది బలారోగ్యములను పొందుదురు.


డబ్బీ రూ. 3-0-0

# చరకనిలయము
## ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.


"ఆంధ్రభూమి"



ఇంద్రుడు : అహల్య



అలమేలుమంగతాయారు గుడి, కోనేరు ; తిరుపతి.



# పలుకరింత

౧

తలఁపు మొగ్గలకు వికాసములు కలుగని
చిన్నప్రాయానఁ గ్రొంగ్రొత్త చెలిమివలనఁ
బ్రియునిరాక నెఱిఁగియు నాకృతినిఁ గానఁ
బఱుపకయె దాఁచుకొన్న నీ పలుకరింత.

౨

మగఁడు మగఁడన్న పెద్దలమాటబరువొ
కేలుఁగేల్ పెండ్లిఁ గలిపిన లీల బలమొ,
మొదటిబిడియమ్ము నాదవించు మొలకగాఁగఁ
దొలఁగి దవ్వులఁ జన్న నీ పలుకరింత.

౩

ఎడఁదలోపలఁ దమకమ్ముఁ గడిఁది సిగ్గుఁ
బెనఁగొనఁగ మెల్లగాఁ దల్లివెనుక డాఁగి
దూరముననుండి యించుక తొంగిచూచి
వదనము మఱల్చుకొను నీదు పలుకరింత.

౪

పరిణతమ్మైన తొల్లిటి పరిచయమున
నందమొందిన వయసు క్రొత్తందనమున
బెళుకుఁజూపులఁ జిఱునవ్వు మొలకరుచుల
వెలుఁగఁజేసిన యట్టి నీ పలుకరింత.

౫

చెలిమి బంధమ్ము బిసియమ్ముఁ గలియువేళఁ
గనులతోఁ బెదవులతో మొగమ్ముతోఁ గ
రములతో వేణితోడ నీరవముగాఁగ
వలపు లొలికించినట్టి నీ పలుకరింత.

౬

చుంబన మొసంగు నెడ నెమ్మొగంబుఁ ద్రిప్పి
కౌఁగిలియిడంగ మేను ప్రక్కకు మఱల్చి
చేయునది యెఱుఁగక కన్నుదోయి మూసి
చెలువులంగుల్కినట్టి నీ పలుకరింత.

౭

పెదవిఁ బెదవినిఁ గీలించి హృదయమునకు
హృదయము నొసంగి ప్రేమకుఁ బ్రేమ నొసఁగి
మాటలో మాటఁ గలిపి నిర్మలమనోజ్ఞ
గళమునం దెల్పినట్టి నీ పలుకరింత.

౮

ఆ పలుకరింత లెల్ల నా యాత్మలోన
దాఁచుకొన్నాఁడ నేఁ, గాని యోచెలియరో,
నయనయుగళికి నేల కానఁబడ వింత?
పలుకరించిన నేఁడేల పలుకవింత?

—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి.ఏ.

# పనిమనిషి

ఆశ్చర్యమేమిటంటే నరిసింహం, మనిషి కెన్ని కష్టాలు రావచ్చునో, అన్నికష్టా లనుభవిస్తున్నప్పుడు, ఆదర్శప్రాయురాలైన భార్యగా ప్రవర్తించిన శకుంతల, కాలపరివర్తనలో మనః పరివర్తనపొంది, సమీపస్థుల కసహ్యా కారణమైంది.

నరిసింహం ఆశ్చర్యపడ్డాడు. అప్పటిదా, ఇప్పటిదా తనభార్య సహజస్వరూపం? అతని కంతుపట్టలేదు.

ఇది తప్పక డబ్బుతోవచ్చిన మార్పు! ఒకరికి నయం చేసేవిషం మరొకర్ని చంపుతుంది! ఒకరికి ప్రాణమిచ్చే డబ్బు మరొకరి జీవాలు లాగేస్తుందా?

డబ్బు నిజంగా విషతుల్యమా?

గాంధీ ఉపవాసదీక్షనుగురించి అన్నముక్క జ్ఞాపకం వచ్చిం దతనికి. డబ్బుకూడా ఒకవిధమైన శక్తి. సమర్థుడిచేతులో అది ఎంతపనైనా చేస్తుంది, అసమర్థుడిమీద, చేతకానిచేతలడి మాదిరిగా బెడిసికొడుతుంది. దుష్ప్రయోగ ఫలితం!

అయినా తను డబ్బు సంపాదిస్తుంటే తన భార్య అడావుడి పడవలసిన అగత్యంకూడా ఆట్టేలేదు,కాని--

నిజానికి, పాపం, శకుంతల తన కష్టాల్లో పాలుతీసుకున్న మనిషి. ఒక్క రవ్వయినా సణగకుండా! తన సుఖం ఎందుకు పంచుకోరాదు?

శకుంతలను నిర్బంధించ వద్దనుకున్నాడు నరిసింహం.

విజయలక్ష్మిని వరించేనుకున్న వాళ్ళయొక్క కథ అనేకంగా వింటున్నాం. కాని వాళ్ళప్రకృతి వివరంగా ఎక్కడా చెప్పబడటంలేదు. ఆ కారణంచేత ఎవరో లక్షలు, కోట్లు సంపాదించా రనుకోవటమే కాని అవి మరొకళ్ళు సంపాదించాలంటే ఎట్లాఉండాలో స్పష్టంగా తెలుసుకోలేకుండా ఉన్నాం. నరిసింహం సంసారపక్షంగా విజయం పొందిన వాడికింద లెక్క. కాబట్టి అతని ప్రకృతినిగురించి తెలుసుకోవటం కొంతవరకు ఏ కొద్దిమందికైనా ఉపకారంగా ఉండకపోదు.

అనేక విషయాల్లో అతను నాజూకులేని మనిషి, ఈ వివిధకళల్లో అతనికి చెప్పుకోతగ్గ అభిరుచిలేదు. అనేకమంది అతనికి డబ్బుసంపాదనే పని అనుకునే వాళ్ళు. అతనికి దేన్నిగురించీ ఎవ్వరితోనూ అభిప్రాయభేదంలేదు. అందరితోనూ మాట్లాడేవాడు, ఎవరితోనూ వాదించేవాడు కాడు, పోట్లాడేవాడు కాడు, ప్రాసుకు తిరిగేవాడు కాడు,అతిగానైనా మాట్లాడేవాడు కాడు. ఇంకొకళ్ళకాలం అతను వ్యర్థంచెయ్యటానికీ, తనకాలం ఇతరులు వ్యర్థంచెయ్యటానికీ కూడా తనకు విరామం లేదని స్పష్టంగా సూచించేవాడు. అతని కింకో విచిత్రమైన గుణంఉంది. అతనికి ఏపనిచేస్తే డబ్బులభిస్తే ఆ పనిలో అభిరుచి కలిగించుకునేవాడు. అతను ప్లీడరు వృత్తిలో ప్రవేశించేటప్పుడు కాఫీహోటళ్ళ మాదిరిగా, చుట్టలు బీడీల మాదిరిగా అవసరమైన ప్లీడర్లు ఊళ్ళో నలుగురైదుగురి కన్న లేరని గమనించి జూనియర్లకు ఫైలులేదని చూస్తూనే ఆవృత్తిలో దిగాడు; ఆ వృత్తిని చూస్తే తనకు గౌరవంలేదని మాటవరసకైనా ఎవరితోనూ అన్నపాపాన పోలేదు.

అతనికి ఆలోచనను గురించి ఆలోచించే దురభ్యాసం లేదు. అటువంటి అలవాటు కవులకూ కల్పనాకథలూ రాసేవాళ్ళకు కావాలి కాని డబ్బు సంపాదించేవాడి కక్కర్లేదు.

అతనిలో మెచ్చుకోవలసిం దేమిటంటే, బాలెన్స్-తూకం. అతను గడిచిన పదిసంవత్సరాల్లోనూ తూకం తప్పి—తలవంచుకోవలసిన పనిచేసి ఎరగడు. ఎంత ఉద్రేకమూ మొహాన ఒక్కరవ్వయినా కనపడనిచ్చేవాడు కాడు.

అతనిచేత డబ్బు ఖర్చుపెట్టించదలచిన వాళ్ళు అతన్ని ఏవిధంగానూ సమీపించలేక సంఘాని కంత అనవసరమైన మనిషి లేడన్నారు; అతనికి డబ్బిచ్చిపొయ్యే వాళ్ళు ‘ఆ మహారాజున్నాడు కాబట్టే బతికిపోతు

న్నాం' అన్నారు—అతన్ని సమీపించలేకపోయినప్పటికీ! పార్టీలచేత అంతమాట అనిపించుకున్న జానియరుకు ముందు ముందు చాలా లాభం ఉంది.

పాతికేళ్ళపైగా, నరిసింహం తండ్రిగారి కాలంలో వచ్చారు, నరిసింహంగారి ఆవరణలో చిన్న గుడిసె వేసుకుని ఒక శూద్రకుటుంబం ఉంది—రంగమ్మా, ఇద్దరు పిల్లలూ. రంగమ్మ పెద్దకొడుకు పొరుగూళ్ళో ఒక డాక్టరుగారి దగ్గిర నెల కెనిమిదిరూపాయలు తెచ్చుకుంటున్నాడు. వాడప్పుడప్పుడూ వస్తుండేవాడు. నరిసింహం తండ్రిగారు ఒంగోలు తాలూకా కరువు సమయంలో పారిపోయివచ్చిన ఈకుటుంబాన్ని చేరదీసి వాళ్ళకు కాస్త స్థలమూ కొంపా యిచ్చి, రంగమ్మ మొగుడికి కొంత డబ్బిచ్చి బతుకుతూ ఉండమన్నాడు. రంగమ్మ ఇంటివారికి అడ్డమైన చాకిరీచేసి ఒక్కపైసా అయినా తీసుకోక ఋణం తీర్చుకుంది చాతయినట్టుగా! కాని కొత్త ఋణానుబంధం ఏర్పడ్డది. నరిసింహం తల్లి అతని నెలల్లో పోయింది. నరిసింహానికి రంగమ్మే తల్లయింది—పొయ్యటానికీ పెట్టటానికీ తప్ప. పొయ్యటమూ పెట్టటమూ మాత్రమే మాతృత్వం అనుకునే వాళ్ళకు నరిసింహాన్ని పెంచినవాళ్ళు పాఠంనేర్పారు. నరిసింహం దుర్దినాల్లో అంతా జారారు. మొగుడుపోయి, దేముడంటి యజమాని, నరిసింహం తండ్రిపోయి, అక్కడక్కడా పాచిపనిచేసుకు బతుకుతున్న రంగమ్మ అప్పుడప్పుడూ నరిసింహానికి పావలాకూ అర్ధకూ సహాయపడ్డది!

శకుంతలకు అతిశయం ఎప్పుడొచ్చిందో ఎట్లా వచ్చిందో ఎవరూ గమనించలేదు. ఆవిడకు పనిమనుష్యులంటేనే అనుమానం. రంగమ్మ తమచేత నియోగింపబడ్డ పనిమనిషి కాదని శకుంతల ఎరుగును. కాని తన భర్తవల్ల ఏదోరూపంగా ప్రతినెలా అయిదారు రూపాయలు ముట్టజెప్పించుకుంటూన్న నాటినించీ (టెక్నికల్‌గా!) రంగమ్మ పనిమనిషి అయిపోయిందని శకుంతల తన్నుతాను నమ్మించుకుంది. తనకొడుకు, నెలలవాడు, రంగమ్మ చేతుల్లో ఉంటే నల్లబడుతున్నట్టుగా ఉండేవాడు; కల్మషం వాడిలో రంగమ్మ చేతులయొక్క స్పర్శవల్ల ప్రవేశిస్తున్నట్టుండేది శకుంతల మనస్సుకు. ప్రతిరోజూ రంగమ్మచేత ఎత్తుకోబడే వాడూ ఎన్నడూ రంగమ్మస్పర్శ ఎరగనివాడూ ఒకటిగానే ఉంటారా? పదేళ్ళలో పెద్దమార్పుండదా? ఇటువంటి వాటిల్లో మడి కొంత తప్పకుండా ఉండే ఉండాలి! కొంతకొంతమందిరాసే కథలలో జరిగినట్టు ఈ క్షుద్ర వెధవ తన చేతులలోనించి దానిదగ్గిరికి అట్లా పరిగెత్తటమేమిటి? మళ్ళీ దానిదగ్గిర్నించి తనదగ్గిరికి రమ్మంటే స్పష్టంగా ఉఁహూఁ అని తల ఊపటమేమిటి? తన పిల్లవాణ్ణి గురించి అన్నీ రంగమ్మకు కావాలి! అన్నీ తను చెయ్యాలి తను చెందాలి—రంగమ్మ! ఇంకేం, రంగమ్మకు మనమడులేని లోపమే తీర్చిపారాయె! మనమణ్ణి ఇంతకన్న ఎక్కువ చేసుకునేదేముంది? 'అమ్మగారూ! అబ్బాయిగారికి నీళ్ళు పొయ్యరేమండీ? నేను పొయ్యనా?' 'అమ్మగారూ! అబ్బాయిగారికి భోజనం పెట్టరేదండీ కడుపేడుస్తుంది.'

శకుంతల రంగమ్మతో మెల్లిగా ప్రారంభించి పోట్లాడటం క్రమంగా హెచ్చించింది. తనకు రంగమ్మమీదగల అసహ్యం మొగుడి ముందు దాద్దామనైనా ప్రయత్నం చెయ్యలేదు.

అనుకోకుండా వచ్చింది శకుంతల అహంకారానికంత్యదశ.

ఒకరోజు పిల్లవాడి మెళ్ళో గొలుసులేదు. అంతకుమునుపు రంగమ్మే ఆడిస్తున్నది పిల్లివాణ్ణి. శకుంతల రంగమ్మను ముందూ వెనకా చూడకుండా అనుమానించింది. మాటకూడా రానంత కోపంతో రంగమ్మ గుడిసె దగ్గిరికిపోయి పిల్లవాడి గొలుసు, దొంగిలించినది, ఇచ్చెయ్యమంది యజమానురాలు. రంగమ్మ తను గొలుసెరగనంది. కథలలో జరిగే గుడిసెలసోదాలూ, నగలక్కడ కనిపించకపోవటం శకుంతలకు జ్ఞాపకంరాలేదు. ఆవేశ చరాచరా లోపలికిపోయి సోదా ప్రారంభించింది. ఎంతో సోదా అవసరం లేకపోయింది. బియ్యపు చాటలో సగంబియ్యం అడుగునా, సగం పైకి కనపడే

అట్లా గొలుసు మెరుస్తున్నది. దీని కేమంటా వన్నది శకుంతల. రంగమ్మ అవమానంతో తల వంచుకో లేదు. నా కేమీ తెలీదు పొండన్నది. శకుంతల రంగమ్మను తక్షణం బయటికి నడవమన్నది రంగమ్మ సరేనని తట్టా బుట్టా బయట పడేస్తుండగా బజారువెళ్ళిన నరసింహం వచ్చాడు. రంగతంతా కనుక్కున్నాడు. అతనికి నవ్వాగ లేదు. శకుంతలను ఒకవిధమైన భయం కలిగింది.

అత నెంత చెప్పినా పోతానని రంగమ్మ భీష్మించింది. నరసింహం భార్యతో రంగమ్మను పోవద్దని బతిమాలమని లోపలికి వెళ్ళిపోయినాడు. శకుంతల ఎట్లా అర్థంచేసుకుందో, వేరే బతిమాలటంలేకుండా క్షమాపణే ఇచ్చింది రంగమ్మకు!

—కొండవటిగంటి కుటుంబరావు.

# ఆవేదన

౧

అదె కనుంగొను మాంధ్ర జననీ
వదనమున కన్నీటిచారలు
తెలుఁగుఁ దేశము వీఁగిపోయిన
తెఱఁగుఁ దోఁపించుఁగ!

౨

కడుపు లాఁకలితోడ మాఁడఁగ
ఎడఁదలో నుత్సాహ మింకఁగ
దీనులై యున్నారలదె, నా
తెలుఁగు సోదరులు!

౩

నా పురాతేజమ్ము వమ్మై
నాఁటిస్వాతంత్ర్యాలు మన్నై
దైన్యగీతలు, దాస్యరేఖలు
దక్కెనా నేఁడు!

౪

భరతవర్ష శ్రీలకెల్లను
బట్టుగొమ్మలు భ్రాతృజాతులు;
చెదరి నానామతములను వి
చ్ఛిన్నులైనారు!

౫

పాడు హృదయములోన సోదర
భావమింతకునైనఁ దోఁపదు
వజ్రకఠినపుగుండెరా, ఎటు
వచ్చు స్వాతంత్ర్యం?

౬

ఈశ్వర ప్రతినిధులు ప్రాణులు
ఎఱుఁగవా? శ్రుతివిన్నఘనుఁడవు
వాని నెత్తురు కండ్లఁజూచిన
వచ్చునా సుఖము?

౭

ఈ దురాచారాగ్ని శిఖలె
ఇంతవింతలు లేచినన్నె
ముద్దుఁగొనఁగా మోముమాఁడఁగ
ముఱియుదువె నాఁడు!

౮

లలిత సారస్వతము శిల్పము
కలసి మునుపొందవ మహాస్సును
మిన్నుముట్టఁగఁజేసె; నిపుడే
మున్నదీ మనకు!

౯

దేశభాషనుమఱచి నానా
దేశరీతుల మఱఁగి నా యా
వము నెఱుంగని నను సహించునె
భారతీదేవి!

౧౦

ఈ విషాద చరిత్రలో నిం
కెంతకాలము మగ్గియుండెద?
ఆమహాత్ముని దివ్యపథమే
అనుగమించెదను!

—కొండూరు వీరరాఘవాచార్యులు.

# 'అప్పన్న యిల్లు'

## గతసంచిక తరువాయి

### ౪

'మామయ్యా! పంతులు నడవడిక నాకు చాలా రోజులనుంచీ అనుమానంగా నేవుంది, కాని అనవసరంగా నీతో చెప్పడమెందుకని యిన్నాళ్ళూ ఊరుకున్నాను. గత నాలుగైదు నెల్లనుంచీ ఆయన తన మనస్సును సూచనగా కనబర్చడం ప్రారంభించారు. అప్పుడప్పుడు ద్వంద్వార్థం మాటలాడ్డం, పరసంచేస్తూవుండడం చాలా రోజులనుంచీ జరుగుతూంది. కాని దురుద్దేశంవుంటే ఆయనే పోతాడని నేను ఉపేక్షించేశాను. కేవలం చలోక్తికోసంఆడే మాటలుకదా అని ఆయన యేదీనా మారు అర్థమిచ్చే మాటలన్నప్పటికీ యేజవాబూ చెప్పకుండా ఊరుకునేదాన్ని.

'పదిహేనురోజుల కిందట ఒకసంగతి జరిగింది. ఆనాడే నాకు తెలిసిపోయింది ఆయన నిశ్చితాభిప్రాయం. సాయంత్రం అయిదుగంటలప్పుడు వసారాలో తుడుస్తున్నాను. ఆవేళకదా ఆయన కుమార్తెలంతా తోటలోకి వొచ్చారు? కుమార్తెలను తోటలోకిపంపేసి ఆయన తనగదిలో నిలుచుని నాకేసి చూస్తున్నారు. ఎవరూ లేరుకదా అని తొందరగానే తుడుస్తున్నాను

'అప్పుడాయన నాతో 'సీతా! యిల్లారా. ఈ గది తొగిరం తుడిచెయ్యి తలుపేసుకుని వీధిలోకి పోవాలి.' అన్నారు.

'నేను అనుమానిస్తూ రెండుమూడుసార్లు చెప్పేవరకూ గదిలోకి వెళ్ళలేదు. ఇంక ఆపైబలవంతంచేసేటప్పుడు మోటతనం చెయ్యలేక వెళ్ళక తప్పిందికాదు. గదిలో తుడవడం ప్రారంభించాను నేను. ఏదో ఆలోచిస్తున్నట్లుగా మూడునాలుగు సార్లు అటూ యిటూ పచారుచేసి పంతులు తిన్నగా నాదగ్గిర ఆగాడు. ఆయన చెయ్యి నా నడుముమీదవేసి కొంచెం నొక్కినట్టుగా జ్ఞాపకం.

'ఇంక అప్పుడు నాకు భయంచేత వొళ్ళూపయీ తెలియలేదు. తక్షణం లేచివచ్చి అవతలకి పారిపోయాను. ఆవేళే నీతో చెబదామనుకున్నాను గాని మన స్థితిగతులు చూసి నువ్వు తొందరమనిషివి గనక ఆకోపంలో యేంప్రమాదం చేస్తావో అని భయపడి ముందువెనకలు పస్తాయించి వూరుకున్నాను. అల్లా వూరుకోవడంవల్లనే యింత కొంపములుగుతుందనుకోలేదు.'

'ఇంతవరకూ చెప్పి నాభార్య వూరుకుంది. బాబూ! నాభావాలు యెల్లావుంటాయో చెప్పడంకంటె మీరు వూహించుకోవడమే మంచిది. కొంచెం వోపిక తెచ్చుకుని 'చెప్పు యేంజరిగిందో. చెప్పవే.' అన్నాను. అది మళ్ళా చెప్పింది.

'మనఖర్మం మామయ్యా! ఈసంగతి నీతో చెప్పకుండా యెంత వూరుకుందామనుకున్నా మనసు వూరుకోనియ్యడంలేదు. ఆతరవాత చెప్పేదేముంది? మర్నాటినించీ నేను ఒంటరిగా కనబడినప్పుడల్లా పంతులు 'ఏం సీతా! కోపంవొచ్చిందికాబోలు? ఆడవాళ్ళ మనస్సు మాగట్టిదే. మొగవాడిట్టే తేలిపోతాడు.' ఇలాంటి మాటలాడ్డం మొదలెట్టాడు నామనస్సుకి ఆమాట లెంతకష్టంగావున్నా మన బతుకుకోసమని నోరుమూసుకుని వూరుకునేదాన్ని. ఏదో జవాబు ఘాటుగా చెప్పాలనుకునేదాన్ని గాని పంతులు ముందర నిలబడి మాట్లాడ్డానికి సాహసంచాలలేదు.

'ఆఖరుకి నిన్న మళ్ళీ పిలిచి' ఏమేసీతా! యీపాటికేనా నామనస్సు నీకు తెలియలేదుటే? అంతా గడుసుయెత్తూ నీది! ఇదుగో ముందుచెప్పడం దేన్యాటి మొగవాడిదే గనక చెబతావిను. నీమీదనాకు మనస్సుకలిగిందని నేను వేరే చెప్పనక్కరలేదు కదా! ఈ బుద్ధి నాకు యెందుకు పుట్టిందో పుట్టింది. ఇంక మళ్ళడం లేదు. ఇందువల్ల నీకు కలిగే లాభాలు యెన్నో కొంచెం నెమ్మదిగా ఆలోచించుకో నాడబ్బు పారేస్తే నాకు

మనుష్యులు లేకపోలేదు. నీ కుటుంబానికి మేలు చెయ్యడానికే భగవంతుడు నా కీబుద్ధి పుట్టించాడనుకుంటాను. మన సంబంధం యెవరికీ తెలియకుండా రహస్యంగా వుంచేపూచీ నాది. తల్లిలేని పిల్లలకి తల్లివై యింట్లో తిరుగుతూవుందుగాని. కొన్నాళ్ళుచూసి మీనోటు మీకు తిరిగి సొమ్ముముట్టినట్లుగా రాసి యిచ్చేస్తాను. మీరు నాకు బాకీవున్నసొమ్ము ఒకదమ్మిడీ నాకు యివ్వక్కర్లేదన్నమాట. మళ్ళీ మీభూములు మీకు యిచ్చేస్తాను. మామూలుగా వ్యవసాయం చేసుకోవచ్చు బాగా ఆలోచించుకో' అని చాలాసేపు బోధించాడు.

'మధ్యమధ్య నేను వెళ్ళిపోబోయేదాన్ని. 'అయ్యో! వుండవే. సిగ్గుపడకూ' అని దారికి అడ్డుగా నిలబడి పంతులు ఆపుచేసేవాడు. ఆఖరికి 'ఏదో ఆలోచించుకుని రేపునాకు సమాధానంచెప్పాలి.' అని నన్నువదలిపెట్టేశాడు.

'పులినోటినుండి తప్పించుకుని వచ్చినదానిలాగు గబగబ యింటికి వొచ్చేశాను. నిన్నటినుంచీ యిదే నన్ను బాధిస్తోంది. నీకు చెబితే పంతులుతో దెబ్బలాడేస్తావు. వెంటనే మనజీవనోపాధి పోతుంది. ఏ లోటు అనుభవిస్తున్నా యింటిపట్టు వొదలక గుట్టు చెడకుండా కాపురం చేస్తున్నాం. ఆయనకి కోపం వచ్చిందంటే మనం యీవూరు వొదిలిపోవాలిగాని యింకో గత్యంతరంలేదు.

'సరి ఈవేళ జరిగినసంగతినిబట్టి చూస్తే యింక నీతో చెప్పకుండా వుంచడానికి వీల్లేనిస్థితిలోకి వొచ్చేసింది వ్యవహారం. నేనింతవరకూ ఏదీ తగినజవాబు చెప్పి ప్రతిఘటించక పోవడంవల్ల తనకి పూర్తిగా అనుకూలురాలననే అతను అభిప్రాయపడ్డాడు.

'మామూలుగానే యీసాయంకాలంకూడా నేను పంతులు యింటికిపోయి పనిచేసుకుంటున్నాను. అయిదుగంట లవగానే బండికట్టించి పిల్లల నందరినీ తోటలోకి వెళ్ళిరమ్మని పంపేశాడు పంతులు. కొద్దికొద్దిగా చీకటిపడేసరికి నాపని అంతా పూర్తిఅయి యింటికి రావడానికి ప్రయత్నపడుతున్నాను. అంతలో పంతులు నన్నుపిలిచి 'ఏమేవ్! పడమటిదొడ్లో కుండలో కొంచెం సున్నంవుంది తీసుకురా' అన్నాడు.

'మామయ్యా! నేను ఆయనమాటప్రకారం పడమటిదొడ్లోకి వెళ్ళి చూద్దునుకదా నా ఆశ్చర్యం యేంచెప్పను? అక్కడ అప్పుడే పంతులు సిద్ధంగా వుండి 'సీతా! ఇంకా యెన్నాళ్ళీదాగుడుమూతాలు? దా. ఇంట్లో యెవ్వరూలేరులే సందేహించకు' అన్నాడు.

'అబ్బా! అప్పటినాస్థితి యేం జెప్పను! దొడ్డి అంతా చెట్టూ చేమతో నిండి చీకటిగావుంది. విశాలమైన ఆయింట్లో పంతులూ నేనూ తప్ప యింకొకరు లేరు. నాశరీరం నిలువునా నీరువిడిచిపోయింది. ఏ పని చెయ్యడానికీ తోచక మతిపోయి కొయ్యబొమ్మలా గలాగే నిలబడిపోయాను.

'ఏసమాధానమూ చెప్పకపోవడం చూసి పంతులు క్రమక్రమంగా నన్ను సమీపించడం మొదలెట్టాడు. ఇంక ఆగితే మాటదక్కదని నేను పారిపోవడానికి ప్రయత్నించాను. ఆదొడ్డికి అన్నివేపులా ద్వారాలున్నాయి. కాని ఏద్వారందగ్గిర కెళ్ళిచూసినా తలుపులుపైని గొళ్ళెం బిగించబడి ఉండేది. బోనులో చిక్కిపోయాను నేను.

'నావెనువెంటనే పంతులుకూడా వొస్తూవుండేవాడు. నేను తలుపులు లాగిచూసి నిరాశచెంది యింకొక గుమ్మందగ్గిరకి పరుగెత్తడం చూసి వెర్రిగా నవ్వుతూవుండేవాడు. అన్నిగుమ్మాలూ మూసేసి వుండడంతోటే గుండెల్లో రాయిపడిపోయింది. నిస్పృహచెందిపోయి కూలబడిపోయాను నేను అప్పుడు. కేకలెయ్యాలని బుద్ధిపుట్టింది కాని నోరురాలేదు.

'వెంటనే పంతులు నాదగ్గిరకొచ్చి 'భయంలేదే. అయ్యో! వెర్రిదానా? ఎక్కడికల్లా పరుగులెడతావు. దా.' అని నాచేతులు పట్టుకుని లేవదీశాడు. అసలు పంతులుని చూస్తేనే నాకు భయం. అందులో ఆ సమయంలో అసలే నాగుండె బేజారైపోయింది. పంతులు నామీద చెయ్యివెయ్యడంతోటే నా ప్రాణాలు ఎక్కడివక్కడే యెగిరిపోయాయి. నాలోని ప్రతిఘటనాశక్తి నశించిపోయింది.

'మళ్ళా పడమటిదొడ్లోకి నన్ను తీసుకెళ్ళాడాయన

నాతల గిర్రున తిరిగిపోసాగినది. క్రమంగా దృష్టి నుంద గించిపోతూంది. దొడ్లోకి తెరుచుకునివున్న గదిలోకి నన్ను యీడుచుకుని వెళ్ళడంమాత్రం నాకు తెలుసును. ఆపైని నాకు స్మృతిలేదు. తరవాత యేంజరిగిందో నేను చెప్పలేను.

'నాకు మెళుకువవొచ్చేసరికి గదిలో మంచంమీద పడుకునివున్నాను. పంతులూ, పాలికాపు లచ్చన్నా యిద్దరూ నాపక్కని కూచుని గుసగుసలాడుతున్నారు. దాహానికి కావాలని నేను సంజ్ఞచేశాను లచ్చన్న నీళ్లు తెచ్చియిచ్చాడు. నేను నీళ్ళు తాగుతూవుండగానే పంతులు అక్కడనుంచిలేచి యింట్లోకిపోయాడు. నేను తూలుతూ పడుతూ యిల్లా యింటికొచ్చేశాను.

'ఇదీ యీవేళ జరిగినసంగతి. కాని మామయ్యా! నువ్వు ఒక్కటి నామీద ఒట్టేసుకుచెప్పాలి. ఇప్పట్లో నువ్వు తొందరపడకూడదు. నీకు అపరిమితమైన కోపం వొస్తుందని నే నెరుగుదును. కాని ఆయనతో కలహిస్తే మనం రేపే యీవూరు వొదిలిపెట్టిపోవాలి. పిల్లలతో యిప్పుడు మనం యెక్కడికిపోగలం? కొద్దిరోజులు ఆగి నెమ్మదిమీద ఎక్కడికోపోదాం. నేను ఏదో కారణం చెప్పి రేపటినుంచీ పంతులు యింటిపని మానేస్తాను! అని నన్ను బతిమాలడం మొదలుపెట్టింది.'

౫

'బాబూ! అప్పుడు నామనస్సు ఎల్లా బాధపడిందో తమరాలోచించండి. భూములా తీసుకున్నాడు. ఆస్తినా వేలంవేయించేశాడు. తుదకి నాభార్యకు మానభంగంకూడా చేశాడు. ఇంక నాబతుకెందుకూ? భార్యయొక్క మానసంరక్షణ చేసుకోలేనప్పుడు నేను బతికినా ఒకటే చచ్చినా ఒకటే అనితోచింది. తక్షణం పరుగెత్తిపోయి ఒక్కవేటుతో పంతులు బుర్ర పగలగొట్టి నాబుర్ర బద్దలుకొట్టుకుని చచ్చిపోదామని నిశ్చయించుకున్నాను. కాని ఎంతో పట్టుపట్టి నా భార్య నా సాహసాన్ని ఆపుచేసింది. ఎంత బతిమాలినాకూడా అది ఆరాత్రి మరి అన్నంముట్టుకోలేదు. మా మానసంగల మనిషిలెండి.' (అంటూ అప్పన్న చనిపోయిన భార్యని తలుచుకుని కన్నీళ్ళు తెచ్చుకున్నాడు. అతని కథలో తన్మయుణ్ణైపోయిన నాకు అతని అశ్రువులు చూడగానే మెలుకువవచ్చి 'తరవాతేం జరిగిందోయ్ అప్పన్నా!' అని అడిగాను. పైకి బహుసాధుమూర్తివలె కనబడిన పంతులుని చూసి మోసపోయానుకదా అని అప్పుడనుకున్నాను.)

'తరవాత యింకేముంది బాబూ! మర్నాడు నేను మామ్మూలుగానే తోటలోకి ఉదయాన్నే వెళ్లానండి. ఝాము పొద్దెసరికి పంతులు తోటలోకి షికారుగా వొచ్చాడు.

'అతనిముఖం చూసేసరికి నాకు అరికాలుమంట నెత్తికెక్కిపోయిందండి. చేతులో కొయ్యపారవుందే దానితో ఒక్కమొత్తు మొత్తుదామనిపించింది. కాని బహుకష్టంమైని కోపం ఆపుసుని నిలుచున్నాను. ఇంతలో పంతులు నన్ను సమీపించి ఏమీయెరగనట్టు చిరునవ్వునవ్వుతూ 'ఏమిరా! ఈవేళ సీత పనిలోకి రాలేదూ?' అని నన్నడిగాడు.

'ఇహ బాబూ! ఆమాటతో నాకు నసాళం అంటుకుపోయిందండీ. అయన్ని చూస్తున్నకొద్దీ నిలబడలేకపోయాను. ఒళ్ళూ్యసయీ తెలియలేదండి నాకా సమయంలో. ఒక్కవురుకున పంతులుమీద పడిపోయాను. చుట్టూ వున్నవాళ్ళు ఆపుచెయ్యబట్టిగాని అతని పీక రెండుముక్కలయేదే ఆవేళ. అక్కడికీ ఒకగుద్దు ఆయన ముక్కుమీద తగిలి రక్తం కారడం నాకు కనబడింది. తమరు బాగా నిదానించారో లేదోగాని నుదురుమీద గాయంవుందే అది అప్పటిదేనండి.

'సరి. ఇంక పైసంగతి మనవిచేస్తావినండి. ఏలాగో తొందరపడి నేను పంతులుమీద దౌర్జన్యం చేసినమాట నిజమే. నే నల్లా చెయ్యడం న్యాయమో కాదో దైవానికి తెలుసు. కడుపు వుడికిపోతూవుంటే ఉప్పూకారమూతిన్న శరీరం వూరుకుంటుందా చెప్పండి? ఇంక యీ వూళ్ళో వుండడం కష్టమనుకుని మర్నాడే మేమంతా మా అత్తారివూరు చామర్లకోట వెళ్ళిపోయాము. ఇంక యేమొహంతో పంతులు నౌఖరీచెయ్యగలం చెప్పండి?

'కోపం వొచ్చిందంటే పంతులుతో వ్యవహారం

పాములో చెలగాటమని తెలుసుకోండి. నేను పారు కూడుపోయినా పగపట్టి నన్ను సాధించడానికే ఆయన నిశ్చయించాడు. తక్షణం నేను బాకీవున్నసొమ్ముకి నామీద దావాపడేశాడు. సొమ్ము యిచ్చేద్దామని నేనూ మా మామగారూకలిసి చాలా ప్రయత్నించాం గాని సాధ్యపడలేదు. అందుచేత వారంటుమీద పట్టించి నన్ను జైలుప్రవేశం చేయించాడు పంతులు.

'బాబూ! నేను జైలుకిపోయిననాడు మా కుటుంబంలో అంతా ఎంతఏడిచామో యేం జెప్పగలను? ఏరోజున అవమానం పొందినదో అదిమొదలు నాభార్య మనోవ్యథతో మంచం పట్టిపోయింది. పైకికాస్త ఆరోగ్యంగాతిరిగి నా యిల్లూ వాకిలీ వొదిలి అత్తవారింటికి చేరడం నాకు కష్టంగానేవుండేది.

'ఇల్లా వుండగానే ఒకనాటివుదయం యెనిమిది గంటలకి వారంటు పట్టుకుని నన్ను అరెస్టు చెయ్యడానికి పోలీసులు హాజరైనారు. మామామ ఆవేళ వూళ్ళో లేడుకూడాను. ఆడవాళ్ళ ఖంగారు ఇంతంత కాదు పాపం? లేవలేనంత నీరసస్థితిలో వుండికూడా నాభార్య ఆవేశంతోవొచ్చి నన్ను వొదిలిపెట్టమని పోలీసుల కాళ్ళమీద పడిపోయింది. ఉట్టి వెర్రిబాగులమనిషి! లేకపోతే నన్ను వొదలడానికి ఆ పోలీసువాళ్ళకి యేమి అధికారంవుందని వాళ్ళని అల్లా ప్రార్థిస్తుంది చెప్పండీ!

'బహుకష్టంమ్మీద అన్నం తినడానికిమాత్రం కొంచెం టైమిచ్చారు పోలీసువారు. అబ్బబ్బ! ఆవేళ నాభార్య పడ్డవేదన తలుచుకుంటే నేటికీ నాకడుపు కరిగిపోతుంది. (అప్పన్న కన్నీళ్ళు మళ్ళా ప్రత్యక్షమైనాయి. కంఠం సవరించుకుని అతడు చెప్పడంసాగించాడు.) ఇంట్లో అంతా గోలెత్తిఏడిచారు ఏదో శవంపోయినట్లుగా. ఆస్థితిలో నా భార్యను విడిచిపెట్టలేక నేనుకూడా ధైర్యంవొదులుకుని ఏడిచాను.

'పదకొండుగంటల రైలుమీద నన్ను తీసుకుపోయారు పోలీసులు. మామూళ్ళు విచారణలన్నీ సాగిన తరవాత నన్ను జైలులో ప్రవేశపెట్టేశారు.'

'తమకి విసుగుపుడుతూందేమో. భోజనాల వేళయింది. ఇంక యీగొడవ ముగించేస్తున్నాను. నాసాధ యెప్పుడూ వున్నదేలెండి. నేను జైలులోవుండగానే ఈ కష్టాలకాగలేక నాభార్య మమ్మలిని వొదిలేసి పైలోకానికి వెళ్ళిపోయింది. దానివెనకనే తల్లికోసం యేడిచి యేడిచి ఆ చంటిపిల్లకూడా వెళ్ళిపోయింది.

'ఈవార్త తెలిసి జైలులో ఆనాలుగుగోడల మధ్యాపడి కళ్లమ్మట రక్తానికి రక్తం యేడిచాను నేను. కాని అక్కడ నాస్థితిగతులు చూసి విచారించేవాడెవడు? ఆ చచ్చిపోయేటప్పుడు ఒక్కసారైనా ఆముఖాన్ని చూడనైతినికదా అని నేటికీ నాహృదయము కొట్టుకుంటుంది. బాబూ! చచ్చిపోయేటప్పటికి ముప్పై యేళ్ళుకూడా నిండలేదు సుమండీ. ముగ్గురుపిల్లలతల్లి అన్నమాటేగాని ఆ శరీరపటుత్వమూ, అందమూ చూడ్డానికి రెండుకళ్ళు చాలవు అనిపించేది. ఆముఖమూ, ఆనవ్వూ ఇప్పటికీ నాకళ్ళకి కట్టినట్లుంటాయి. ఈ నిర్భాగ్యుడికి కల్లాంటి భార్య దక్కుతుందా? అవాకరోజులు.'

దుఃఖము మితిమీరిపోయినందున అప్పన్న మరి మాటాడలేకపోయాడు. పైనున్న ఉత్తరీయములో కళ్ళుతుడుచుకున్నాడు. భార్య జ్ఞాపకానికి రావడంచేత అతనిబాధ దుర్భరమైపోయినది. అయిదు నిముషముల వరకూ అతడు వెక్కివెక్కి యేడుస్తూ అల్లాగే ముఖం కప్పుకుని కూర్చున్నాడు. ఆయా సంఘటనల గంభీరతను ఊహించుకుంటూ పరధ్యానంగా నేనూ కూర్చున్నాను. ఇంతలో కోవెలలో మ్రోగిన జేగంటశబ్దము నన్ను మేల్కొల్పినది. అప్పన్నవేపుచూసి 'అయితే పంతులుకీ నీకూ మళ్ళీ యెలాగ కలిసింవోయ్?' అని నేను అడిగాను.

## ౬

'అయ్యా! అదే మనవిచేస్తాను. వినండి. తల్లిలేని పిల్లలు యిద్దరూ ఎంతగోల పెడుతున్నారో అని నా కడుపు తరుగుకుపోయింది. వాళ్ళని చూడకుండా ఒక్కగడియైనా ఉండలేననిపించింది నాకు. అప్పుడు నేను జైలువార్డరొకడు మావాడున్నాడు లెండి. వాణ్ణి పిలిచి నాస్థితిగతులు వివరిస్తూ పంతులుపేర ఒక పెద్ద ఉత్తరంరాయించాను. ఒక్కసారి పిల్లలను చూడనిస్తే

యావజ్జీవమూ అతనిదగ్గిర చాకిరీచేసి అయినా అప్పు తీర్చుకుంటానని పంతులుని ప్రార్థించాను అవుత్తరంలో.

'ఎట్టి పరిస్థితుల్లోనైనా చలించని పంతులు మనస్సు కరిగిందనుకుంటాను నా యేడుపుచూసి. లేక తనమీద దౌర్జన్యంచేసిన నాచేత నౌఖరీచేయించుకుని తనపంతం నెగ్గించుకుని గర్వంపొందాలనో అతని అభిప్రాయం. ఏదైనా నే వాయనదగ్గిర నౌఖరీచేసి అప్పుతీర్చుకునే ట్టుగా ఖరారువ్రాతలు రాయించుకుని వెంటనే నన్ను విడుదల చేయించాడు. ఎకాయెకీని నిద్రాహారాలుమాని ప్రయాణంచేసి యింటికిచేరానండి.

'ఇంటికెళ్ళేసరికి యిద్దరు పిల్లలూ మశూచికంతో బాధపడుతున్నారు. కష్టాలెప్పుడూ విడిగా రావు చూడండీ. ఆ మశూచికం నాకు రాకూడదు బాబూ! పదిరోజులు భూలోకనరక మనుభవించి పెద్దపిల్లాడు కూడా తల్లిలోనే కలిసిపోయాడు. ఇప్పుడూ రెండో కుర్రవాడు మాత్రమే మిగిలిఉన్నాడు. పదేళ్ళుంటాయండి. తాతగారింటిలోనే ఉన్నాడండి.

'ఇదుగో ఈ మొండికట్టెమాత్రం పంతులుకి చాకిరీ చేస్తూ ఇల్లా నిలిచిఉంది. ఈ కష్టాలకీ, నా కుటుంబ నాశనానికీ కారకుడై, నా భార్యా మానమునుకూడా హరించి నన్ను కారాగృహప్రవేశం చేయించిన పంతులు ముఖమే తెల్లవారితే చూస్తూ ఉండాలని రాశాడుబ్రహ్మ నా నుదుటని. అది నాఖర్మం. నాదురదృష్టం. ఒక్కొక్కప్పుడు ఈ రామన్నకోనేట్లో పడి పోదామనిపిస్తుంది. కాని పంతులు అప్పుతీర్చకుండా మాత్రం చచ్చిపోడానికి నా అంతరాత్మ ఒప్పుకోవడం లేదు. ఇంకో జన్మంలోనైనా తప్పదుకదా అండి యీ ఋణబాధ?

'ఈ నా స్థితికి పంతులు ఎంతవరకూ కారకుడో తమరే ఊహించుకోండి. నా లాంటివాళ్ళింకా చాలా మంది ఉన్నారు. పంతులు తనభార్యని పెట్టిన బాధలు తలుచుకుంటే శరీరం గగుర్పొడుస్తుంది. ఏ దినమందు గురు పిల్లలతల్లి అన్నమాటే కాని ఆ యిల్లాలు ఒక్కనాడు సుఖించిఎరగదు. అచ్చమ్మ అని ఒక కాసా మనిషి ఉందిలెండి. ఎప్పుడూ దానియింటిలోనే ఉండే వాడు. అది యిప్పటికీ పంతులుని విడిచిపెట్టలేదు సుమండీ. సంరక్షణకి ఉంచుకున్నానంటాడు పైకి.'

ఇల్లా అప్పన్న చెబుతూఉండగానే దేవాలయం లో నివేదనలకోసం గంటవాయించారు. కోనేటిలో దిగి కాళ్ళూచేతులూ కడుక్కుని కోవెలలో దేవతా దర్శనం చేసుకుని ప్రసాదంతింటూ సత్రానికి బయలు దేరాను. అంతవరకూ వీధిలోకూచుని అప్పన్న నా వెనకనేవచ్చి మధ్యదారిలోనేఉన్న తనఇంటిని చూపించాడు.

అప్పటికప్పుడే రాత్రి కొంత అతిక్రమించింది. ఇల్లంతా నిశ్శబ్దభరితము. గాఢాంధకార మా యింటిలో చెలరేగి తాండవిస్తూంది. అప్పన్న తాళంతీసి తలుపు తెరవగానే ఇంటి పైకప్పున వేలాడుతున్న గబ్బిలాలు మూడో నాలుగో తుర్రున పైకివచ్చాయి. పిల్లలూ వాళ్ళతో కలకలలాడే అప్పన్నయిల్లు శూన్యత్వమున భయముగొల్పుతూ ఉంది.

రాత్రిఅంతా అప్పన్న చెప్పిన కథను తలుచుకుంటూ ఆశ్చర్యపూరితుడనై గడిపాను. అప్పన్న దీనదశ నా హృదయాన్ని కళవళపెట్టేసింది. 'లక్ష ధర్మకార్యాలు చేసినా ఈ పంతులుకి ముక్తిలేదు' అనుకున్నాను.

మర్నాడు దేవాలయానికివెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు అప్పన్నఇంటిని ఇంకొకసారికూడా చూస్తేనేకాని నా మనస్సు తృప్తివహించలేదు. భార్యాపిల్లలు తిరిగే స్థలాలన్నీ నాకు చూపిస్తూ అప్పన్న పూర్వపురోజులు తలుచుకుని ఎంతోసేపు ఏడిచాడు. అతని దుఃఖంచూసి, శూన్యమైపోయిన ఆ యింటినిచూసి నేనుకూడా అశ్రువులు రాల్చకుండా ఉండలేకపోయాను.

ఇల్లంతా జీర్ణావస్థకి దారిచూపుతున్నా అప్పన్న భార్య సీతమ్మవేసిన చిన్న అరుగూ, శ్రద్ధతో పెంచిన జామి, నారింజ మొదలగు వృక్షజాతులూ, ఆమె చనిపోయినది మొదలుకుని ఉపయోగించబడకుండా ఉన్న ప్పటికీ గది గోడలకిపెట్టిన చుక్కలూ, ముగ్గులూ సగం సగం చెరిగిపోతూకూడా సౌందర్యభరితములై నాకు కనబడి అప్పన్న యేడుపునకు కావలసినంత కారణమున్న

దని గ్రహింపజేసినవి.

దొడ్లో తుప్పలూ గడ్డీ పెరిగిపోయి దుర్గమంగా ఉన్నాయి. పెంపుడు చెట్లకి సంరక్షణలేక నానాటికి పాడుదశలోకి దిగుతున్నాయి. తను రాత్రివేళ పడుకోడానికి అప్పన్న ఉపయోగించే సావిడి ఒక్కటి తప్ప మిగిలిన యిల్లంతా బూజులతోనూ దుమ్ముతోనూ నిండిఉన్నాయి.

ప్రక్కనేఉన్న ఒక గదితలుపు తెరిచి అప్పన్న 'బాబూ! ఇది మాపడకగది. సీత చచ్చిపోయిన తరవాత నేటివరకూ దీన్ని మరి తెరవడానికి నాకుసాధ్యం కాలేదు. ఎన్నోసార్లు ఈతలుపుతీసి ఒక్కసారి ఈ గదిలో ఉన్నవస్తువులని చూడాలనే కోరిక పుట్టేదిగాని తాళంతియ్యబోయే సరికి చెయ్యి వొణుకుపుచ్చుకునేది. గుండెలు బద్దలైపోయేటంత గట్టిగా కొట్టుకునేవి. ఇందులో ఉన్న వస్తువులని చూసేసరికి నాబాధ అపరిమితమైపోయి ప్రాణాలు నిలవవేమో ననే నాభయం తమరు నాయందు దయతో మళ్ళీ దయచేశారు గనక తమ సహాయంతో కూడా ఒక్కమారు ఈగదిని చూడాలని నేను నిశ్చయించుకున్నాను.' అన్నాడు.

ఇద్దరమూ గదిలో ప్రవేశించాము. అందులో ఒకవేపున పాత పట్టిమంచము కొంచెం పెద్దది ఒకటి ఉంది. కప్పు వేరైపోయిన పెట్టె ఒకటి ఇంకొక మూలని ఉంది. బూజూ, ధూళీ అధికంగా పడిన శ్రీరామ పట్టాభిషేకపు చిత్రమొకటి గోడకి తగిలించబడి ఉంది. నేలఅంతా గబ్బిలపు పెంటలతో నిండి అసహ్యకరంగా ఉంది.

ఆగదిలో ఉన్న ఏవస్తువును చూసినా అప్పన్నకి భార్యాబిడ్డలు జ్ఞప్తికివచ్చి దుఃఖోద్రేకము ముమ్మరమైపోయేది. 'బాబూ! సీత వెళ్ళిపోయాక ఈగది కీకతి పట్టింది. ఇంక దీన్నితుడిచి బాగుచేసే దిక్కెవరు? బాగుచేసిన ప్రయోజనమాత్రమేముంది? ఈ మంచాన్ని పుట్టింటినించి తెచ్చుకుంది సుమండీ. అది యేనాడు పోయిందో నాటినుంచీ నేను దీన్ని ముట్టుకోనైనా లేదు. దానిచేత్తో పక్కవెయ్యాలిగాని నన్ను ఎన్నడూ వెయ్యనిచ్చేదిగాదు. దానితోనే పోయింది ఈ మంచము ఆందమంతానూ. అదిలేనప్పుడీ గదెందుకు? ఈ మంచమెందుకు?'

అప్పన్న దుఃఖోద్రేకమున మైమరచిపోయాడు. బిడ్డల చిరిగిపోయిన చొక్కాలూ, ఆటవస్తువులూ అన్నీ నాకు చూపించి ఆనిర్భాగ్యుడు ఆడుదానిలాగు యేడిచాడు. ప్రతివస్తువునీ చూడ్డంవల్ల అతనికి గత సౌఖ్యపు దినములూ భార్య బిడ్డలూ జ్ఞాపకానికి వచ్చి సర్వబాహ్యప్రపంచమూ విస్మృతిలో పడిపోయింది. చంటిబిడ్డ చొక్కాని కౌగలించుకుని అప్పన్న అరగంటసేపుదాకా నేనెంత ఓదార్చినా వినకుండా యేడిచాడు. ఎంతోసేపటికిగాని అతన్ని గదిలోనించి బైటికి తీసుకురావడానికి నాకు వీలుకలగలేదు. అతని విచారం చూసి తొందరపెట్టడానికి నామనస్సు ఒప్పుకునేది కాదు.

సర్వేశ్వర నివాసముగు దేవాలయమువలెనే అప్పన్న యిల్లు కూడా నాయందు పవిత్రభావములను పురికొల్పినదని చెప్పక తప్పదు. ధూపదీప నైవేద్యాదులులేని శిథిల దేవాలయంవలె కనబడింది అప్పన్నయిల్లు నామనో దృష్టికి. పిమ్మట చాలా సంవత్సరములు గడిచిన తరవాత మళ్ళీఒకసారి అప్పన్నయింటిని చూడాలని నాకు బుద్ధిపుట్టింది.

నేను రెండోసారి వెళ్ళేసరికి ఆ అప్పన్నాలేడు. ఆ పంతులూలేడు. పైకప్పు పూర్తిగా పోయినందున సగంసగం పడిపోతూవున్న అప్పన్నయింటి మొండి గోడలుమాత్రం నాకు కనబడ్డాయి. పెంపుడు చెట్లూ చేమలూ నశించిపోయాయి. పనికిమాలినచెట్లు ఆవరణలోనూ గోడలమధ్యా పెరిగిపోయాయి. ఆ గడ్డీ గాదరాలోఉండి ఒక ఆవుదూడమాత్రం బెదురు బెదురు దృష్టులతో నావేపుచూస్తూ నాకు కనబడింది.

ఎన్నిరోజులు గడిచినా అప్పన్న యిల్లుమాత్రం నా స్మృతిపథమున చెక్కుచెదరక నేటికీ నిలిచిఉంది. ఆ యింటినిగురించి తలుచుకున్నప్పుడల్లా నా హృదయం త్వరితంగా కొట్టుకోక మానదు. నాకళ్ళు అశ్రుసిక్తములు కాక తప్పదు.

—కాళూరి వెంకటరామారావు.



# రుచీదేవి

(వచనరూపకము.)

అంకము : ౧.     రంగము : ౧.

స్థానము : రహస్యాగారము.

కాలము : సాయంసమయము.

[కృష్ణరాయుడు తలవంచి ఏదియో ఆలోచించుచున్నాడు. సమీపమునందు నిలచి అప్పాజి ఒక యుత్తరము చూచుచున్నాడు. అగరువత్తులనుండి పొగ త్రాచుపాము పిల్లలవలె బయలువెడలి పైకెగబ్రాకి పోవుచున్నది. కొలది నిముసములకు అప్పాజి కాగితమును జేబునందుంచుకొని, కృష్ణరాయని వంక జూచి ముసిముసి నగవుతో.]

అప్పాజి :—ప్రభూ! మీరంగీకరించినారా?

రాయులు :—(సిగ్గుచే తలవంచి, కాలి వ్రేలితో నేలవ్రాయుచు) ఇన్నిదినముల నుండి మనల నాయాసపెట్టుచున్న శత్రువు, పిలచి పిల్లనిచ్చెదననగా తలయూపితిని.

అ :—(చిరునగవుతో) ఇది లోకప్రవృత్తికి విరుద్ధము. ఇందేదియో రహస్యమున్నది. (ఆలోచనతో) అట్టులేగాకున్న పెక్కుమారులు మనచే పరాజితుడైన రాజు మామగా మారుటేల?

రా :—నా కంతటి యూహాపోలేదు. అన్నిటికిని అప్పాజి కలడన్న ధైర్యము చేతనే, నేనట్లు కబురంపితిని.

అ :—స్వార్థమునకై మానవు డెట్టి పని యైన జేయగలడు. 'ఖలునకు నిలువెల్ల విషము' అను లోకోక్తి మరచితిరా? నే నేలనో వివరింప లేకున్నాను, ఈ వార్త నన్నేలనో కలవరపరచినది.

రా :—మీయనుజ్ఞ గోరక నే నొనరించిన పనికి నన్ను క్షమింపవలయును. అన్నివిధముల నన్ను సవరింప, అప్పాజి నాయండ నుండ నాకేమి భయము?

అ :—(నవ్వుచు) పెండ్లియనినంత నెంత వానికేని సంబరమే కదా! శత్రువును మిత్రునిగా ప్రభువులు దలంచినారు! అయినను భయపడవలదు, మించిపోయినది లేదు.

రా :—(సిగ్గుతో కనుల నోరగా త్రిప్పి) ఇది ప్రమాదమే యగుచో ప్రస్తుత మూరకుండుటయే మంచిది. పెండ్లిపేరుబెట్టి పరిభవింప దలచనేమో? గజపతి!

అ :—ఈ ప్రయత్నమునకు విఘ్నము చేకూర్పవలదు. అకారణముగ భయపడితిమని గజపతి గేలిసేయును. ప్రథమముననే మాటజారితిమి; కావున కానున్నది కాక మానదు, ప్రభూ! ఆలోచనవలదు, కల్యాణమునకు తగు ప్రయత్నము లొనరింప రేపటిదినమే మనవారి కాజ్ఞాపింతును.

రా :—(తలవంచి) నాకేలనో యుత్సాహము సడలిపోయినది.

అ :—రాజా! అట్లనవలదు; వివాహమునకు విఘ్నము గూర్పవలదు.

రా :—(ఆలోచనతో, గోడవైపునకు తలత్రిప్పి) అట్లే, మన పరివారమును సిద్ధపరచుడు.

అ :—(రాయలకడకేగి, చెవిలో నేదియో చెప్పి) ఆవిషయము మాత్రము జాగ్రత్తసుమా! మరువవలదు, మున్నాటికి మరువవలదు.

రా :—(తలవంచి) అట్లే.

అ :—అదిగో నగారా మ్రోగుచున్నది. మీకు తోటలోని కేగు సమయమైనట్లున్నది ఇక నాకు సెలవు.

(ఇరువురు నిష్క్రమింతురు.)

---

అంకము : ౨. రంగము : ౧.

స్థానము : కటకపురి రాజాంతఃపురము నందొక గది.

సమయము : ఉదయము.

[కటకపురియం దాదిన మెచటగాంచినను కోలాహలమె. మహారాజతనయ యగు రుచీదేవి కల్యాణమునకు, దేశదేశములనుండి రాజులు, బంధుగులు, వచ్చి యుండియున్నారు. ఇంతటి సంతోషసమయమునం దేలనో గజపతి మహారాజు, అంతఃపురమునం దొకగదియం దాలోచించుచు పరుండియున్నాడు. క్రొత్త పెండ్లికూతురగు రుచీదేవి వింత సొబగుతో తండ్రికి కొలది యడుగుల దూరమున నిలచి చేతనున్న జాజిపూవుల దండను మాటిమాటికి మూర్కొనుచున్నది.]

గజపతి :—అమ్మా! అల్లారుముద్దుగ నిన్ను పెంచి పెద్దజేసి, తుదకు నేటితో వేరొకని వశమొనరించితిని—రేపటినుండియే నీవు విజయనగిరమున కేగవలసియున్నది, నాకేలనో విచారముగానున్నది.

రుచీ :—(సిగ్గుతో తలవంచును)

గజ :—మాటాడవేమి తల్లీ? పుట్టినిల్లు వదలి పోవుటకు నీకెట్లున్నదో గదా!

రుచీ :—(మరల తలవంచి, చేతనున్న జాజిపూవుల రెక్కల నొకటొకటి గిల్లివేయుచుండును.)

గజ :—అమ్మా! మాటాడవేమి? నా హృదయ మెట్లున్నదో నీకేమెరుక?

రుచీ :—(మెల్లగా)

"యాస్యత్యద్య శకుంతలేతి హృదయం
సంస్పృష్ట ముత్కంఠయా।
కంఠస్తంభిత బాష్పవృత్తి కలుషం
చింతాజడం దర్శనం।
వైక్లబ్యం మమతావదీ దృశమహో
స్నేహా దరణ్యౌకసః।
పీడ్యంతే గృహిణః కథంను తనయా
విశ్లేష దుఃఖైర్నవైః।"

అని మహాఋషి కణ్వుడే వాపోయినట్లు మొన్నటి పాఠములోనే నేర్చుకున్నాను.

గజ:—విద్యావతి వైనందుకు, నీ పలుకులు నన్ను సంతోషపరచుచున్నవి. (చేర బిలచి, సంతసమున శిరము నిమురుచు) అందరివలె నీవు నీ యత్తింట ప్రవర్తింప వీలులేదేమో!—నేను—

రుచీ:—(తండ్రివైపుచూచి) ఏమి అట్లంటిరి? అందరవంటి దానిని నేను గానా?

గజ:—(తొట్రుపాటుతో) నా యింట బుట్టిన లక్ష్మీదేవివి నీవు. నా యింటి గౌరవమును నిలువబెట్టుటకు నీవే సమర్థురాలవు; తండ్రికన్న దగ్గరచుట్టము లోకమున గలడా?

రుచీ:—మీ పలుకులు నా కర్థమగుట

లేదు. ఒకమాట కొకటి సంబంధమే లేదు.

గజ:—ఆలోచింపుము. నీ తండ్రిఋణము దీర్చవలయును సుమా!

రుచీ:—ప్రతియువతియు, పుట్టినింటికిని, మెట్టినింటికిని, కీర్తి తేవలయును. తల్లిదండ్రుల ఋణము దీర్చుటకొకటే యుపాయము.

గజ:—ఆ యుపాయమేమి?

రుచీ:—(చిరునగవుతో) అత్తింట మంచి పేరుగడించి, బ్రతికినన్ని దినములు లోకమున సుప్రతిష్ఠ నార్జించి, చిన్ననాటనుండి పెంచిన తల్లిదండ్రులకు కీర్తి సంపాదింపగల్గిన కూతురే, పితృ ఋణము మాతృ ఋణము తీర్చుకొనగల్గునది

గజ:—(లేచికూర్చుండ; పుత్రికను చేర బిలచి, మరల శిరము నిమురుచు) నీవు, పితృ ఋణము వేరువిధమున దీర్చవలయును సుమా!

రుచీ:—(ఉలికిపాటున) ఎట్లు?

గజ:—ఆలోచించుకొనుము.

రుచీ:—(దీనముగ జూచుచు) నాకేమియు తోచుటలేదు.

గజ:—ఆ మాట, అట్లుండనిమ్ము;—నిన్ను కృష్ణరాయని కొసగుట మీ యమ్మకిష్టమేనా?

రుచీ:—(బిక్కమొగముతో) నాకెట్లు తెలియును.

గజ:—నీ తోబుట్టువుల కిష్టమేనా?

రుచీ:—(భయముతో వణకును)....

గజ:—మాటాడవేమి? వెఱ్ఱిదానివలె విలోకించెదవేమి? .......ఒక రహస్యమున్నది.......

రుచీ:—(ఆతురతతో) ఏమి?

గజ:—ఈ సంబంధము మీ యమ్మకు గాని నీ తోబుట్టువులకుగాని ఇష్టము లేదు.

రుచీ:—(కంట నీరు గ్రమ్మ, పైట నద్దుచు, హీనస్వరముతో) ఎందుచేత?

గజ:—కృష్ణరాయడు దాసీ పుత్రుడని వారి యూహ.

రుచీ:—(మొగము చిట్లించి, పెదవు లదరుచుండ, గంభీరముగా) దాసీ పుత్రుడు రాజెట్లు కాగలడు?

గజ:—(విసుగుతో) అదియంతయు నే నెందులకు?...

రుచీ:—(ఆలోచించుచు) మాయమ్మకు, ఇష్టము లేని, "దా—సీ—పు—త్రు—న—కు," మీ రెట్లు నన్నొసగిరి?

గజ:—(తత్తరమున) ఒకపని సాధింపవలయునని.

రుచీ:—ఏమి? ...ఒకపని సాధింపవలయుననియా?

గజ:—ఔను.

రుచీ:—(మొగమున గ్రమ్మిన స్వేదబిందువుల పైటనద్దుచు, మాటిమాటికి దిశలు పరికించుచు) దయతో నా కెఱిగింపుడు.

గజ:—పిచ్చితల్లీ! నేడైన తెలసికొనుము.—తెలసికొని నీ పుట్టినింటి గౌరవము నిలువబెట్టుము—గౌరవము నిలువబెట్టి నీ తల్లిదండ్రుల ఋణము తీర్చుకొనుము.

రుచీ:—(భయముతో గడగడలాడుచు, చేతనున్న జాజిపూవుల దండను నేలకువదలి, వెఱ్ఱిదానివలె జూచుచు) ఎట్లు?

గజ:—రాయలు నాకు గర్భశత్రువు. నన్ను పెక్కుమారు లోడించి, పరిభవించిన క్రూరుడు. కరుణలేక పరుల యభ్యున్నతికి దుఃఖించు స్వార్థపరుడు.—ఎన్నియో మారులు వానిని శిక్షింపదలచితిని, కాని కోర్కె నెరవేర లేదు.—పరాభవముతో ఎట్లో

కాలము గడపుచున్నాను. నా హృదయ కుహురమునం దింకను క్రోధానలము చల్లబడ లేదు; నా కంటియెఱుపింకను విచ్చిపో లేదు; నా యుబికిన కండరములింకను సమసిపో లేదు; తలచినకొలది హృదయము తల్లడిలి పోవుచున్నది.--నిన్ను వానికొసగి వాని పీచమడంప దలచితిని.—ఈ వివాహముతో వాని, మనసు, మారిపోయినది. నన్నాప్తబందుగునిగా జూచుకొనుచున్నాడు. ఇది పసిబట్టిన కోడెత్రాచని, ఆకలిగొన్న ఆడుపులియని, వాడెరుంగడు. అమ్మా! భారము నీపై యొఱగినది. ఆలసించిన అమృతమే విషమగును. రేపే నీవు విజయనగరము చేరనున్నావు, నీభర్త నీకు వశుడగునట్లు నీయోపినకొలది బ్రయత్నింపుము.—ఆనంద పారవశ్యమున, అరమోడ్పుకనులతో శయ్యపై బరుండి యుండినపుడు, ...(కంఠము సన్నగిలును, గొంతు సవరించుకొని)....పరుండి యుండినపుడు,....పరుండి యుండినపుడు.... (వడిగా నొకకత్తిని పైకితీసి)....ఇదిగో కఱకు కరవాలము, దీనితో వాని శరీరమును ముక్కలు ముక్కలు గావింపవలయును,— నీ కన్నతండ్రి కడుపుమంట తగ్గింపవలయును. వెనుకాడవలదు, విచారింపవలదు; వెఱగొందవలదు, కనుల మూసికొని, మహాకాళివై కార్యము నెరవేర్పుము. ఇందులకే నిన్ను ఎల్లరు వలదనుచున్నను దాసీ పుత్రునకు దాన మొనరించితిని.

రుచీ:—(తలయూపుచు, నిట్టూర్పు విడచుచు, తండ్రివంక బెదరిబెదరి చూచుచు) అంతయు వినాను. ఆపని నావలన కానేరదు.

గజ:—ఒకేమాట! ఒకే వాగ్దానము! ఒకే ప్రశ్న! ఒకే జవాబు!—"నాకోర్కె తీర్చెదవా? లేదా?"

రుచీ:—తీర్చెదనని కలనైన తలంపవలదు.

గజ:—(తెల్లబోయి) అంతే!

రుచీ:—లోకమునం దెచ్చటనైన ఇట్టి ఘోరకృత్య మొనరింప ఏ జనకుడైన తన తనయను ప్రోత్సహించెనా? అల్లారుముద్దుగ పెంచి, పెద్దజేసి, తుదకీరీతి గొంతుగోయ దలచిన జనకుడెందైన గలడా? గుండె రాయి యొనరించుకొని, భర్త నీరీతి హింసించిన వనిత ఏ కాలమందైన, ఏ దేశమందైన, ఏ జాతియందైన, గలదా? యుద్ధమున పరిభవింపబడి, మరల కసిదీర్చుకొనుటకు ధైర్యము లేక, ఇంటియందున్న పడతుల సాయమున పగతుర బరిమార్ప ప్రయత్నించిన రాజే చరిత్రయందును గానరాడె! ఎంతటి దారుణము! తెలుగువారు, పరమేశ్వరునికన్న పవిత్రునిగ జూచుకొనుచున్న ఆ భూనాయకుని శిరము ద్రెంచి, నీ ఋణము దీర్పవలయునా? ఇందులకా! నన్నా భూనాథునకు దాన మొసగినది?....తలచినంత మాత్రమున దేహమునందలి ప్రతి రక్తపుబొట్టు సలసల క్రాగిపోవుచున్నదే! కోమల హృదయులగు, కోమలుల చేతనా నెత్తురుకూడు భుజింప జేయునది. నేను సుప్రతిష్ఠతో వెలుగొందుట నీ కిష్టము లేదా? నా మొగమున కుంకుమబొట్టు నిలచియుండుట నీవు చూడలేవా?— తండ్రీ! ఆలోచించుకొనుము. ఈర్ష్యా దవానలమున కాహుతిగాక, పాలవంటి కులమునకు అపకీర్తి సమకూర్పక, నిదానింపుము; కనికరింపుము; కన్నకూతురును కసాయిపని జేయ పురిగొల్పకుము. కీర్తి శాశ్వతముగాని తనువుగాదు.

గజ:—(కన్నులెఱ్ఱజేసి, పండ్లు పటపట

కొఱుకుచు) నేను మోసపోయితిని! మోసపోయితిని! ఇంటనున్న శత్రువు నెఱుంగక, వెఱ్ఱివానివలె వేగిరపడితిని.—చాలును—నా కడుపున బుట్టి—నాయింట బెరగి—ఇంతదనుక నాయండన నిలచియుండి—తుదకు నాకే ద్రోహమొనరింప దలచితివి! నీకై ఇంత శ్రమయొనరించి, తుదకు, నా గొంతునకు నేనే యురి తగిలించుకొంటిని. నిన్ననో, మొన్ననో, తాళి గట్టిన వానిపై నీ కప్పుడె, ఎంతప్రేమ అంకురించినది! (నిరాశతో కనుగొనల నీరుగ్రమ్మ తలవంచును.—ఎల్లెడ నిశ్శబ్దము.)

రుచీ:—(గోడవంక మొగముత్రిప్పి, ఎఱ్ఱబడిన కనులతో, వాడిపోయిన చెక్కులతో, రేగియున్న ముంగురులతో, తలవంచి, తనలో॰) ఆర్తరక్షణ పరాయణా! ఆదినారాయణా! ...ఏది దారి? ... ....తండ్రి—భర్త. పుట్టెడాసతోనున్న తండ్రిని మోసగించుటయా? లేక ప్రేమపూరిత హృదయుడగు భర్తను సంహరించుటయా? అబ్బా! ఎంతటి పని....ఎంతటిపని ... ....తల తిరుగుచున్నది. ఏమియు తోపకున్నది.—నా ములుకులబోలు పలుకులకు నా జనకుడు నిరుత్సాహ పూరిత హృదయుడైనాడు; నిరాశతో ఒరిగిపోయినాడు. కన్నతండ్రిని కష్టముల పాల్జేసినచో నాబ్రతు కెందులకు?—భర్తను పరిభవించినచో నాబ్రతుకు వ్యర్థమేకదా?—ఇదియొక పరీక్ష—నా పూర్వజన్మ పాపఫలము ఎట్లేని ఈ సమయమునందు నా నేర్పును ప్రకటించి ఎల్లరచే మెప్పుబడయవలెను.—నేను మెప్పుబడయవలయుననిన, ఒకచో తండ్రిని సంతృప్తి పరచవలయును, వేరొకచో భర్తను బ్రతికించుకొనవలయును. ఇది పొసగుటెట్లు? భర్త జీవించియున్నచో తండ్రికి సంతృప్తి లేదు, భర్త జీవించియుండనిచో నా బ్రతుకే నిష్ఫలము. పెంచి పెద్దజేసినవాడు తండ్రి—ప్రేమించి పోషింపనున్నాడు భర్త. ఒకటి అలభ్యము, వేరొకటి అమూల్యము. (తల పైకెత్తి, మొగము చిట్లించి) ఛీ! ఛీ! 'భర్తను సంహరింపవలెను' అని నేను ఇపుడు తలచితినా? లేదులేదు, ముమ్మాటికి అట్లు నేను తలంపలేదు. ఆపనియే నేనొనరించిన లోకము నుమ్ముదులిపిపోయదా? ... .... అయ్యో! కన్నతండ్రి కడుపుమంట నేనెట్లు చూడగలను? చూచి సహించుటెట్లు? ... ఈ విషయమెట్లు పరిష్కరింపబడవలయును. వేరొకసారి, నా తండ్రిని పలుకరించెదను. (ప్రకాశముగా) నాపై నిజమగు ప్రేమయుండినచో నిట్టి దారుణకృత్య మొనరింప నన్ను బ్రోత్సహింతువా? అంతులేని అప్రతిష్ఠకు నాబ్రతుకు గురికాదా? తండ్రీ! క్షమింపుము! కన్నకూతురి కడుపున కనికరములేక కారుచిచ్చు రగులగొట్టకుము. ఈ పని నా కొప్పగింపకుము. నీ పాదములంటెదను, ఇపు డల్లుడుగామారిన పరరాజుపై ఇకనైన కోపము సంహరింపుము. ఏదీ, తలయెత్తి నా మొగముచూడుము; నా కనుబొమల మధ్యనున్న కుంకుమబొట్టు నేల రాలవలసినదేనా? కన్నతండ్రివి కావా? కనికరమువలదా? పాదము లంటెదను, ఈ ప్రతిజ్ఞ మరచిపొమ్ము. (పాదములపైబడును)

గజ:—(పాదములను వెనుకకు లాగికొని) చాలు చాలును, తెలసిపోయినది నిన్ను గనినందులకు, నా బ్రతుకేగాదు నా వంశమంతయు అప్రతిష్ఠ పాలైనది. నీవేల నాయింట బుట్టితివి? నీవు కడుపునందుండగా, మీయమ్మకేల గర్భస్రావము కలుగకపోయెను! నీ బదులు, ఏ రాయియో, రప్పయో, మీ

యుష్మత్కడుపున బుట్టిన, నేను తలయెత్తి తిరిగియుందును. పాపీ! నా యీ వేదన తిలకింపవేమి? నా కష్టముల లెక్కింపవేమి? నా ఋణము దీర్పవేమి? ...(పిచ్చివానివలె గదియంతయు కలయదిరుగును.)

రుచీ:—(తండ్రినిగాంచి, మరల నేదియో ఆలోచించి, వెఱ్ఱిగా తనలో తాను మాటాడుకొని, తుదకు ధైర్యముతో మరల తండ్రివైపునకు తిలకించి) నాయనా! నీకోర్కె నెరవేర్చెదను. నా మానాభిమానముల నిక దిగజార్చుకొంటిని. నీ యీ వేదన చూడలేకున్నాను. నా ప్రార్థనమెల్ల నీ మ్రోల నిష్ఫలమైపోయినది. ఇక లాభము లేదు. నీ పలుకు నిర్వహించి నీఋణము దీర్చుకొందును.—కాని—ఇదియే నీ తనయను తుదిసారి కనులార చూచుకొనుము; నా ప్రాణేశ్వరునితోబాటు నేనీలోకమును వదలక తప్పదు--కాని—ప్రతిష్ఠ--ప్రతిష్ఠ--భగ్నమగును. ఆ మచ్చ తుడచిననూపోదు: కడగినను పోదు; (ధైర్యముతో, గొంతు సవరించుకొని బిగ్గరగా) నీకోర్కె నెరవేర్తును--నెరవేర్తును--విజయనగరమునకు వెంట గొనిపోయెదను--ఆ కత్తినిమ్ము--తండ్రీ! మ్రొక్కుచున్నాను-ఇదియే కడసారి వందనము--ఇదియే తుదపలుకు--ఇదియే తుట్టతుది దర్శనము--వందనములు--వందనములు, (వినయము వెల్లివిరయ చేతులు మోడ్చును).

[గజపతి పలుకనేరక నిలచిపోయెను. కత్తి నొసగెను, కన్నుల నీరుగ్రమ్మెను; రక్తము పొంగెను. తనయను తిలకించినాడు. ఆమె తండ్రివంక తలద్రిప్పినది. ఇరువురు మాటాడలేదు. బొమ్మలవలె నిలచియున్నారు. ఎల్లెడ నిశ్శబ్దము.] తెర—[సశేషము.

—చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు,
బి.ఏ.

# కలహం

## ౧

శ్రీరామమూర్తి యింటికి వచ్చేసరికి కమలకూరలు బేరమాడుతోంది. బేరం పూర్తిఅయ్యేసరికి షుమారు అరగంట పట్టింది. కమల కొసరుక్రిందకూడా కొన్ని కాయలు యిచ్చి పొమ్మంటుంది. 'వీసెడో, అరవీసెడో, కొసరుక్రింద తీసేసుకుంటావా ఏమిటమ్మా' అని కూరలది దెబ్బలాడి, ఆఖరికి 'యీ యింటికి యింకెప్పుడూ రాకూడదమ్మా' అంటూ లేచిపోయింది. శ్రీరామమూర్తి అదంతా అయ్యేవరకూ నిలవబడే వున్నాడు. కూరలు యింటిలోపెట్టి, కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు తెచ్చింది.

శ్రీరామమూర్తి:—కూర కొనటానికి అరగంట బేరమా? యింతసేపటిలో వెయ్యిరూపాయిల సరుకులు ఖరీదు చెయ్యొచ్చును.

కమల (కొంచెం సిగ్గుపడుతూ):—ఉన్నదిగదా అని డబ్బు ఊరికే పారేస్తామా ఏమిటి?

శ్రీరా:—అది సరే. కాని, కాలానికికూడా కొంత మూల్యం వున్నదంటావా? అరగంట బేరమాడితే ఒక్క కానీ మిగిలింది. ఆ కూరలది 'యిదెక్కడి పల్లెటూరు గబ్బిలాయిరా' అనుకుంటుంది. యికనుంచి పొరపాటున కూడా యీదారిని రాదు.

క:—కానీయిచ్చి దమ్మిడీ సరుకు పుచ్చుకుని ఊరుకోవటం నావల్లకాదు.

శ్రీరా:—యింతసేపటిలో పదిపేజీలు చదివివుండేదానివి. నిన్న దాసీతో దెబ్బలాడావు. మొన్న పాలవాడితోటీ అంతే బ్రతుకంతా యిల్లాటి చిల్లరవిషయాలకోసం నిరర్థకంగా చెల్లిపోవలసిందేనా ఏమిటి?

శ్రీరామమూర్తి రోజూ భార్యకు ఉపదేశాలు చేస్తూనేవుంటాడు. రెండోపెండ్లి. కమల కాపురానికి వచ్చి రెండునెలలే అయింది. మొదట కొన్నాళ్ళు పెద్ద ఆడబిడ్డవుండి వంట వగైరాలుచేసేది. గాని ఆమె వెళ్ళేక కమలే స్వతంత్రంగా యిల్లు దిద్దుకుంటోంది. భర్తని సుఖపెట్టడమే ఆమె ముఖ్యోద్దేశం. అతడు చెప్పిన

ట్లా నడుస్తుంది. ఒకసారి చెప్పినమాట మరిచిపోకుండా హృదయంలో అంకితం చేసుకుంటుంది. కాని రోజూ ఏదో ఒక కొత్తవిశేషం జరుగుతూనే వుంటుంది. శ్రీరామమూర్తి ఉపదేశం యిస్తూనే వుంటాడు.

౨

మరొకరోజు

కమల కాచినపాలు పట్టుకొచ్చి బల్లమీద పెట్టింది. శ్రీరామమూర్తి ఈజీఛైరులో పడుకుని పేపరు చదువుకుంటున్నాడు. కమల తమలపాకులకు సున్నంరాస్తూ కుర్చీకమ్మలమీద కూర్చుంది. యింతలో పిల్లి ఆ పాలు కాస్తా త్రాగేసింది. కోపంతోటి కమల ప్రక్కనవున్న రూళ్ళకర్రతో పిల్లిని కొట్టింది. పిల్లి రెండుమూడు మొగ్గలేసి, కుంటుకుంటూ పారిపోయింది.

శ్రీరా:—అది చచ్చిపోతే?

కమల (కోపంతో):—అది నా పాలెందుకు త్రాగాలేం?

‘దాన్ని కొడితే నీపాలు తిరిగి నీ కొచ్చాయా?’

‘తప్పుచేసిన వాళ్ళమీద కోపం రాదా?’

‘రాకూడదు. పశువుతో సమానంగా మనిషి ఎందుకు పశువు కావాలి? మనిషికీ పశువుకూ భేదంలేదా?’

శ్రీరామమూర్తి దయ, వివేకము, శాంతి మొదలైన సద్గుణాలమీద ఉపన్యాసం యిచ్చాడు. కమల ఉక్రోషంచేత ఏడ్చింది.

3

మరొకరోజు

గుమ్మంలో బిచ్చగాడు ‘ఏతీరుగ నను దయచూచెదవో యినవంశోత్తమ రామా’ అంటున్నాడు. కమల వంటయిల్లు, అలుక్కుంటూ—చెయ్యారుకో లేదు వెళ్ళబ్బాయీ అంది.

శ్రీరా:—నువ్వు పెట్టలేకపోతే నేనులేచి పెట్టొస్తాను. బిచ్చగాడ్ని పొమ్మంటావేం?

కమల (కోపంతో):—పొద్దస్తమానమూ ముష్టేనా ఏమిటి వేళాపాళాలేకుండా దేశమంతా బిచ్చగాళ్ళమయంలాగుంది.

‘ఆ దేశంలోనే నువ్వూ వుంటున్నావుగా?’

‘వీళ్ళు కూలికెందుకు పోరు?’

‘పనులు దొరికితేనూ, చెయ్యగలిగిఉంటేనూ ముష్టి ఎత్తుకుందామనే నీచుడెవ్వడూ ఉండడు. అంగహీనులకు ముష్టికంటె గత్యంతరం ఏమిటి?’

‘గవర్నమెంటు వీళ్ళకోసరం శరణాలయాలెందుకు ఏర్పరచరూ?’

‘స్వరాజ్యం వచ్చాక ఏమన్నా ఏర్పాటుచేస్తారేమో! కాని స్వరాజ్యంకూడా ధర్మంపైననే వస్తుంది.’

‘లక్షలకొద్ది సాధు, సన్యాసులూ, గుడిపూజార్లూ, పండాలు యీ ధర్మపిండాలతోటే లక్షాధికారులవుతున్నారు. ఈధర్మం చాలదూ? ధర్మంమూలాన స్వరాజ్యం రావలశివుంటే ఎన్నడో వచ్చివుండవలశింది.’

‘ఆ ధర్మంమూలాన్నే హిందూజాతి యింకా ఈమాత్రంగా జీవించివుంది. లేకపోతే ఎన్నడో రసాతలానికి పోయి, రోము, యూనాను, ఈరాను అసీరియాలకు జతఅయి వుండేది.’

‘హిందూజాతి యింకా బ్రతికివున్నదని మీ రనుకుంటున్నారు గామున్న. అది ఏనాడు పరాధీనమయిందో ఆనాటితోనే చచ్చిపోయినదాన్నిగా ఎంచుతున్నాను. స్వతంత్రంగా ఉండటమే జీవించివుండటం. దాస్యముంటే చావటమే.’

శ్రీరామమూర్తి చకితనేత్రాలతో భార్యవంక చూశాడు. ఈవిద్రోహపు ఊహలు ఈమెకెట్లా పట్టుబడ్డాయబ్బా! పైకి ఏమీ తెలియనిదానిలా కనుపిస్తుంది. అనుకుని కోపంతో—‘ఏమిటీ వ్యర్థవివాదం. సిగ్గులేకపైగా మాట్లాడొచ్చావు’ అన్నాడు. కమల యిక మాట్లాడలేదు. ఒకనిమిషం నిలువబడి నెమ్మది నెమ్మదిగా యింటిలోకి వెళ్ళింది.

౪

మరొకరోజు

శ్రీరామమూర్తి స్నేహితులకు విందుచేశాడు. వంటంతా కమలేచేసింది. విందుచేయటానికి ముందు ఆమెతో సంప్రదింపు జరగలేదు. ఆమెతోటి ముందుగా సంప్రదించి ఉంటే చేయటానికి అత్యుత్సాహం చూపుతూ విందు తానే చేస్తున్నాననుకుని అతి సంతో

మంగా వంటచేసేదే. గాని యిప్పుడామె తనవల్ల చెప్పని పొరపాటుతనం. చేయింపబడుతోందనుకుంటోంది. అందరూ భోజనంచేసి వెళ్ళిపోయారు, శ్రీరామమూర్తి భోజనం చేత్తో ముట్టుకోనట్లు అల్లా పీటమీదకూర్చునే ఉన్నాడు.

కమల—ఏం అల్లా కూర్చున్నారు.

శ్రీరామమూర్తి (కళ్ళు చించుకుంటూ):—'ఏం తిన్నునీమొఖం. యిది అన్నమా? గొడ్లదాణా?'

కమల (అరికాలిమంట నెత్తికెక్కి):—'ప్రొద్దస్తమానమూ పొయ్యిదగ్గిర మాడినందుకు జరిగిన బహుమానమా ఇది! నా చేతనయినట్లు చేశాను.'

'అన్నం బిరుసు'

'అయివుంటుంది'

'పప్పులో ఉప్పెక్కువ. ఎవ్వడూ ముట్టకోలేదు.'

'అవుతుంది.'

'పరమాన్నం విరిగింది'

'అవును'

'పాల్పా పచ్చికంపువస్తోంది'

'వస్తుంది'

'స్త్రీ వంట బాగా నేర్చుకునివుండాలి. అది ఆమె పరమధర్మము' యిల్లాగే ఉపదేశం మొదలుపెట్టాడు. కమల కోపంతో లేచిపోయింది.

౫

అయిదారు నెలలు గతించాయి.

భర్త దూరబంధు వొకడు వచ్చాడు. వారం రోజులయింది. యింటిలోంచి కదలడు. కమల అతడికి ప్రొద్దున్నే కాఫీ, భోజనం. మధ్యాహ్నం ఫలహారం అన్నీ జాగ్రత్తగాచేసి పెడుతోంది.

ఇక వాడు వెళ్ళిపోవలశిన అవుసరం ఏముంది?

శ్రీరా:—'వాడిని పొమ్మనవేం?'

క:—'ఎందుచేత'

'ఎల్లాలేదన్నా రోజుకు రూపాయి కాజేస్తున్నాడు. యీ అతిథి సత్కారం యిట్లాగే నడుస్తోంటే వాడు బ్రతికివుండగా ప్రయాణంమాట తలపెట్టడు.'

'ఏదో నాలుగురోజులుండి పోదామని వచ్చిన వాడి వెంటబడటం నా వల్లకాదుసుమండీ, వాడియిష్టంవచ్చి నన్నినాళ్ళుండనీయండి.'

'ఇల్లాటి వెధవల్ని సత్కరించటం మహాపాపం. నువ్వు వాడినంత నెత్తినెక్కించుకోకపోతే వాడిన్నాళ్ళు ఉండేవాడేకాదు. రోజుకు మూడుసార్లు ఫలహారమూ, రెండుమాట్లు భోజనమూ, పదహారుసార్లు తాంబూలమూ వాడి కిక్కడనుంచి కదలవలసిన పనేముంది?'

'పట్టెడన్నం భాగ్యానికి అంత ముఖాముఖాలు చూసుకోవటంకూడా మర్యాదకాదు'

'పాత్రాపాత్రతలనుకూడా కొంచెం విచారించాలి. యిల్లాటి సోమరిపోతులను మేపడం నిజంగా వాళ్ళకు విషంపెట్టడం అన్నమాటే. వీడింకో నెలగాని యిక్కడ వుంటే వాడు బ్రతికివున్నన్నాళ్లు ఏపనికీ పనికిరాకుండా పోతాడు.'

తర్కము ప్రబలమయింది. ప్రమాణాలు వర్షించాయి. భర్తా తాను చేసినపనులకు ఎప్పుడయినా సంతుష్టిపడటం అంటూవుంటుందా? యీ ఉపదేశాలకొక హద్దుఉంటుందా? లేదా? యీ ప్రశ్నలు ఆమెను మాటిమాటికీ వేధిస్తున్నాయి.

౬

మరొకరోజు

ప్రక్కనున్న ఒక పల్లెటూరునుంచి మంచి నేయి తెప్పించారు. దానిని శుభ్రంగాకాచి వడపోసి చల్లారాక ఉట్టిమీదపెడదామని యింటిలో ఏదో పనిచేసుకుంటోంది. యింతలో దాసీది యిల్లు తుడవటానికి వచ్చింది. కుండఎత్తి ఉట్టిమీద పెట్టబోగా, చేయిజారి క్రిందబడింది. దాసీ నిలువబడి ఏడుస్తోంది. ఈ ధ్వనివిని కమల పరుగెత్తుకువచ్చి చూసింది. కుండ చెక్కలయిపోయింది. నెయ్యి యిల్లంతా మడుగయింది.

కమల:—కుండ ఎట్లాపగిలింది? నీ జీతంలోంచి తెగ్గోస్తాను యీ డబ్బంతా. రామరామ నెయ్యంతా మట్టిలో కలిపేశావు. నీచేతుల్లో సత్తువలేదా? ఎన్నాళ్లు కష్టపడితే యిప్పటికీనెయ్యి తెప్పించగలిగినాము. ఒక్కచుక్కైనా గొంతు దిగలేదు. ఫో. నీ పనిచేసుకో.

దాసి (కళ్ళు తుడుచుకుంటూ):—తప్పు అయిందండి అమ్మగారూ జీతం తెగ్గోయండి, చంపండి, ఎత్తి

ఉట్టిమీద పెడదామనుకున్నాను. యిట్లా జరుగుతుందని నాకేం తెలుసును. ప్రొద్దున్నే లేచి ఏవెధవముఖం చూశానో!

కమల:—అదంతా నాకు తెలియదు. యీడబ్బంతా నీ జీతంలోంచి తెగ్గోయ్యాలికిందే. పైగా యింకో రూపాయి జుల్మానాకూడా పుచ్చుకుంటాను.

దాసి:—చచ్చిపోతానండి అమ్మగారూ! దమ్మిడీ అయినా లేదు నాదగ్గిర.

కమల:—చావు లేక బ్రతుకు. అదంతా నాకు తెలియదు.

దాసీ (ఒక్కనిముషం ఆలోచించి):—సరే తెగ్గోసుకోండి అమ్మగారూ మీరు ఒక్కపూట భోజనంలేకుండా వుండలేరుగాని మేము ఎన్ని కటిక ఉపవాసాలైనా చేస్తాము. ఆకలితో చచ్చిపోతాను అంతేకాదూ! బ్రతికివుండి ఏమంత మహాసుఖం అనుభవిస్తున్నానేమిటి? చచ్చేందుకు భయపడటానికి.

కమల (దాసీమీద దయవచ్చి)—నీవు తిండిలేక చస్తే మాకు పనిచేసేదెవరు?

దాసీ:—పనిచేయించుకో దలుచుకుంటే పెట్టండి లేదా చంపండి. ఇవ్వాళటినుంచి మీగుమ్మంముందే పడివుంటాను.

కమల:—నిజంగా యివ్వాళ నువ్వు చాలా నష్టం చేశావే.

దాసీ:—నాకే కష్టంగావుందండీ అమ్మగారూ.

కమల:—అలుకుగుడ్డ పట్టుకువచ్చి అలికెయ్యి. కుండపెంకులు ముందుగా ఏరి అవతలపారెయ్యి. బజారుకువెళ్ళి నెయ్యి తీసుకురావాలి.

దాసీ సంతోషంతో కుండపెంకులు పోగుచేసి అక్కడపెట్టి పేడవేసి నేల అలుకుతోంది యింతలో శ్రీరామ్మూర్తి బయటనుంచి వచ్చాడు. కుండపగలటం చూసి అడిగాడు ఎట్లాపగిలిందని.

కమల:—దాసీ ఎత్తి వుట్టిమీద పెట్టబోతే క్రిందపడి పగిలింది.

శ్రీరా:—నెయ్యంతా పోయిందా?

'కొంత మిగుల్తుందా ఏమిటి?'

'నీవు దాన్నేమీ అనలేదా?'

'ఏమనాలి. అదేం పడెయ్యాలని పడేసిందా?'

'ఈ నష్టం ఎవరు పెట్టుకోవాలి?'

'మనమే మనచెయ్యిజారితే ఏమిచేస్తాము?'

శ్రీరామ్మూర్తి (పెదవి కొరుక్కుంటూ):—నీ మాటలు నాకేమీ అర్థంకావటంలేదు. నష్టం ఎవ్వరు చేశారో వారే అది భరించాలి. ఈ రూపాయిలు దాసీది యిచ్చుకోవాలికిందే. దాని జీతంలోనుంచి తెగ్గోయ్యి. యివ్వాళ నెయ్యి పారపోసింది రేపు మరోకటి చేస్తుంది.

కమల భయపడుతూ:—నేను దానిని క్షమించాను.

శ్రీరామ్మూర్తి (కళ్ళెర్రచేస్తూ):—నేను క్షమించను.

దాసీ గుమ్మంలో నిల్చుని యిదంతా వింటూంది. యజమానికి కోపంరావటం చూసి ముందుకువెళ్ళి—'బాబుగారూ పొరపాటుజరిగింది. ఈ ఖరీదు అంతా నాజీతంలోనుంచి తెగ్గోసుకోండి. నాదగ్గిర డబ్బులేదు గాని లేకపోతే యిప్పుడే పట్టుకువచ్చి. యిచ్చి వుండేదానిని.' అంది.

కమల (దాసిని మందలిస్తూ):—మా డబ్బు గల దానివి బయలుదేరావ్ఫులే పో అవతలికి.

శ్రీరామ్మూర్తి (భార్యవైపు కోపంగాచూస్తూ):—నీవుదాన్ని వెనకేసుకొస్తావేమిటి. ఎవడు నష్టంచేస్తే అది వాడు పెట్టుకోవలసివుంటుందని పసిపిల్లలకి కూడా తెలుసును. అయిదురూపాయిల నష్టం యిప్పుడు నేనెందుకు భరించాలి? కుండ అది జాగ్రత్తగా ఎందుకు పట్టుకోలేదు, బరువయితే నిన్ను సాయం పిలవక పోయిందా? అదంతా దాని అజాగ్రత్తకాదూ?

యిల్లా అంటూ శ్రీరామమూర్తి బయటికివెళ్లాడు.

## ౨

కమలను యీ అపరాధానికిగాను చీవాట్లు వేయవలసివుంటే చాటున వేయకూడదూ? దాసీ దానిముందు గడ్డిపోచలాగ యీసడించాడే! యిత డెట్లాటివాడని. మబ్బా! యివ్వాళ చెప్పింది రేపు కాదంటాడే! మొన్న బిచ్చగాడిని పొమ్మన్నానని కావలసినంత ధర్మోపదేశాలు వెళ్ళబెట్టారు. యిప్పుడీ అయిదురూపాయల

భాగ్యానికి ప్రాణం పోగొట్టుకుంటున్నారు. రేపు దాసీది ఎగగొడ్తే సరి మా సర్దాగావుంటుంది. అయినా ఊరుకున్నకొద్దీ యీయన మరీ నెత్తికెక్కుతున్నారు. యిదంతా నా మంచిదనపుఫలితమే. దీనికి సరియైన మందు చూడాలి. యీయనగారి మాట లక్ష్యం చేయకూడదు. అల్లాఎందుకు? అతడేమిచెప్తే అదేచేస్తాను. కొంచెం ఎక్కువాలేదు కొంత తక్కువాలేదు. నేను చేసిన ప్రతిపనీ ఆయనకి నచ్చకపోతే అనవసరపు పనులుచేసి నేనెందుకు చీవాట్లుపడాలేం?

ఆమె రాత్రంతా యిదే ఆలోచనతో గడిపింది. ఉదయాన గోదావరికి స్నానానికవెళ్ళి శ్రీరామమూర్తి యింటికి వచ్చేసరికి తొమ్మిదయింది. యింటిలోకివచ్చి చూస్తే అంట్లు ఎదురుగా గుమ్మంలో కనుపిస్తున్నాయి

'ఏం దాసీ రాలేదూ?'

'లేదు'

'అయితే?'

'మీ ఆజ్ఞ ఎల్లాఅయితే అల్లాగే'

'ఇది చాలాకష్టం సుమా'

'అవును. అయితే'

'ప్రక్కయింటివారి దాసిని ఎందుకు పిలవలేదు?'

'ఎవరు ఆజ్ఞయిచ్చారని పిలవను? యిప్పుడు చెప్పారుగా యికపిలుస్తాను.'

'ఇపుడు పిలుస్తావూ? యిక అన్నం ఉడికేదెప్పుడు దాసీది రాకపోతే ప్రక్కయింటి వాళ్ళదాసిని పిలవాలని తెలియదూ?'

'పిలిచాక ఎందుకు పిలిచావంటే ఏంచెప్పను. నా బుద్ధికి తోచినట్లు చేయడం మానేశాను. ఇక మీరు ఏంచెప్తే అదేచేస్తాను. నాకు మాటలుపడడం యిష్టం లేను.'

'సరే యికముందు జరుగవలశిన దేమిటి?'

'మీచిత్తం.'

'నువ్వు నన్ను ఆడిస్తున్నావుసుమా'

'నాకంతపాటి తెలివికూడానా! నేను దేవరవారి పదదాసిని. మీ సెలవుప్రకారం చేస్తాను.

'సరే! నేను వెడ్తున్నాను. నీయిష్టంవచ్చినట్లు చెయ్యి.'

'వెళ్ళండి. నేనేమీ చెయ్యను.'

'అయితే నువ్వేమితింటావీపూట?'

'మీరేమిపెడితే అది'

'తే! టిఫినుకారియరిల్లాయియ్యి. హోటలునుంచి అన్నం పట్టించుకొస్తాను.'

కమల ఒకరూపాయి, టిఫిను కారియరూ, తీసి యిచ్చింది. హోటలునుంచి అన్నంవచ్చింది. ఆపూట భోజనం అయిపోయింది. శ్రీరామ్మూర్తి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. తిరిగి యింటికి వచ్చేసరికి ప్రొద్దుగూకింది. రావటంతోనే అడిగాడు—'ఏం దాసీ వచ్చిందా?'

కమల:—లేదు.

'ప్రక్క యింటి దాసీని పిలిచి కనుక్కోమనలే?'

'పిలిచాను. నెలకి అయిదురూపాయిలు యిమ్మంటోంది'

'అయితే! ఉన్నతేడా ఒక్కరూపాయే గాదూ? ఎందుకు వప్పుకోలేను?'

'మీరు ఆజ్ఞయివ్వందే! రూపాయి ఎక్కువకి ఎందుకు వప్పుకున్నావంటూ, ఖర్చు అట్టే చేయగూడదనీ ఉపదేశం మొదలుపెడ్తే అప్పుడేంచెయ్యను?'

'మూర్ఖురాలులా వున్నావే బొత్తుగా'

'అవును అంతే'

'అయితే యీపూటకి వంట ఆశలేదన్నమాటే?.

'అంతే'

శ్రీరామమూర్తి నెత్తిని చేతులేసుకుని కుర్చీలో చతికిలబడ్డాడు. హోటలు భోజనం అతడికిపడదు మనస్సులో చాలా విసుక్కున్నాడు. కమలను చివాట్లేశాడు కూడాను. కాని ఆమె వినిపించనట్లు నటించింది. ఆఖరికిలేచి ప్రక్కయిళ్ళకువెళ్ళి దాసీకోసరం వాకబు చేశాడు. అందరూ మళ్ళకు వెళ్ళిపోయారు. ఆఖరికి ఒక చాకలాడు దొరికాడు రెండణాలుపుచ్చుకుని ఆ పూట అంట్లుతోమిపోయాడు.

కమల—అన్నంలోకేంచెయ్యను?

'అన్నం, కూరాను.'

'కూరలేదింటిటో'

'ప్రొద్దుటినుంచి ఇంటిలో కూర్చున్నదానివి కూర కొనలేకపోయావా? ఇంత రాత్రిపూట కూరలెక్కడ

దొరుకుతాయి?'

'నన్ను కొనమని మీరు చెప్పందేనా! నేను ఖరీదెక్కువపెట్టి కొంటేః?'

శ్రీరామమూర్తి (విసుక్కుని పళ్లుకొరుకుతూ):— అయితే ఆఖరికి నీ వుద్దేశ్యంఏమిటి?

కమల (శాంతంగా):—ఏమీలేదు. అవమానం నేను సహించలేను. అంతే.

'నిన్ను అవమానపరచిందెవరు!'

'మీరే'

'అయితే! ఇంటివిషయంలో నన్నేం జోక్యం కలిగించుకో వద్దంటావా?'

'మీరు కాకపోతే ఇక ఎవరున్నారు. నేను మీ ఆజ్ఞ ఎట్లాఅయితే అట్లా నడుస్తాను.'

రాత్రి పచ్చడి మెతుకులతో కాలం గడిచింది. యిద్దరూ పడుకున్నారు. కమలకు త్వరగా నిద్ర పట్టింది. శ్రీరామ్మూర్తి నిద్రపట్టక అటూయిటూ దొర్లుతున్నాడు. యీవిధంగా కమల సత్యాగ్రహంచేస్తే ఒక్కపూటైనా పని గడవదు. ఒక్కరోజు భోజనానికి యింత కష్టంఅయింది. అసలు దీనిదారే వేరుగావుంది. నేను మాట్లాడటం దీనికి కష్టంగావుందిగామున్న. దీనిఫలితం ఇట్లావుంటే నేను మాట్లాడకపోవటమే మంచిది. సరే కాస్తా కూస్తా నష్టంవస్తే వస్తుంది. అంతే కాదూ? ఆఫీసునుంచివచ్చి హోటలుకి పరిగెత్తటం. నావల్ల కాదబ్బా! ఇంత కా దాసీదాని దగ్గిర రూపాయిలు వసూలుచేయమనటం దీనికి కష్టంలో చిన్నట్లుంది. వసూలు కానూలేదు.

కమలను లేపుతూ—యింత నిద్రేమిటే నీకు?

కమల:—కూలీలకు నిద్రబాగావస్తుంది.

'సరేలే! దాసీదానిదగ్గిర రూపాయిలు వసూలు చెయ్యొద్దు'

'అది ఎదురుగుండా పట్టుకు కూర్చుందా?'

'యీమాటవింటే అది పనిలోకివస్తుంది'

'సరే రేపు కబురంపుతాను లెండి.'

'ఇదుగో! నీవు చెప్పిందానికి ఇక ఎదురుమాట్లాడను. ప్రమాణం చేస్తున్నాను'

'నేను యిల్లు దోచిపెడితేనో?'

'దోచిపెట్టు, పాడుచెయ్యి, కాని కోపగించబోకు నువ్వు ఏవిషయంలోనైనా సలహా అడిగితే చెప్తాను. లేదా నోరు తెరవను.'

'నేను అవమానం సహించలేను సుమండీ'

'యీతప్పు క్షమించు'

'అంతఃశుద్ధిగా నేనా యీమాటలు'

'ఆ అంతఃశుద్ధిగానే'

—భోగరాజు పేరాజు.

# నిస్పృహ

శా॥ ఔరా! ఏమివిచిత్ర మీ, నడినిశీథావేళమందార్తి నే।
ప్రారబ్ధంబున కేడ్చు యేడ్పులును, నా భార్యా వియోగంబుచే
వారింపందగరాని భావములతో బైబాదు బాష్పంబు లీ,
(శారచ్చంద్రికఁ గాంతిమంతములునై') - 'సల్లాప సత్క్రీడకై
సారెఁ సారెకు జూచు కీటము' వలెఁ - చాలించు నామోముపై
ప్రేరేపంబున బిల్చుచుండె - నదిగో! వీక్షింప - నానందఝుం
కారంబేసెడి కీటకప్రియుల!— ... ...
— నాకర్మంబు గాకున్న, నా
దారారత్న మదేలరాదు? - ధరనేదారాడు టింకేలకో!!

—గుమ్మలూరు సత్యనారాయణ, బి. ఎస్‌సి.ఎజి.

# అతని ఊహాలు

౧

'ఛీ! ఛీ! పో......'

వెల్లికిల పడుకొని కాలుచేతులు పైకెత్తి, యింటి కప్పువంక చూస్తూ, ఆడుకుంటున్న కుమారుడి ముఖంలో ముఖంపెట్టి తల ఒకప్రక్కనుంచి మరొకప్రక్కకు త్రిప్పుతూ చిరునవ్వుతో

'ఛీ! ఛీ! పో......' అన్నాడు కృష్ణమూర్తి.

పిల్లవాడు బోసినోరు విప్పి కొద్దిగా నవ్వాడు. ఆ మందహాసంవల్ల ముఖం విప్పారి తేజోవంతమై ప్రకాశించింది. నవ్వినప్పుడు చెక్కిళ్ళమీద ఏర్పడిన చిన్న గుంటలు ముద్దులుమూటగట్టినవి.

'ఛీ! ఛీ పో......' అన్నాడు కృష్ణమూర్తి.

పిల్లవాడు తనబోసినోరు బాగా విప్పాడు. గది అంతా మెరిసినట్లు అనిపించింది కృష్ణమూర్తికి. చెక్కిళ్ల మీది గుంటలు మరికొంచెం లోతై ఎంతో ముచ్చటగా ఉన్నాయి.

'ఛీ! ఛీ! పో......' అన్నాడు కృష్ణమూర్తి తన వేలితో పిల్లవాడి బొడ్డుదగ్గర అనీ అనకుండా స్పృశిస్తూ, చక్కిలిగింత పెడుతూ.

పిల్లవాడు కేకిసలు కొట్టుకుంటూ నవ్వాడు. కృష్ణమూర్తి పారవశ్యం చెందాడు. నవ్వుతున్న పిల్లవాడి నోట్లో నోరుపెట్టి ముద్దుపెట్టుకున్నాడు. పసినోరు పాలవాసన వచ్చింది. కుమారుణ్ణి చేతుల్లోకి తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు. ఒళ్ళు గగుర్పొడిచి వెంట్రుకలు మొనలమీద నిలుచున్నవి.

౨

కమల ఇంట్లోపనంతా సర్దుకొని, చక్కగా శృంగారించుకొని తండ్రికొడుకులున్న చోటుకు వచ్చింది. తల్లిని చూడడంతోనే తండ్రిచేతులలో నిలవకుండా తల్లివైపు చేతులుచాచి ఆత్రపడ్డాడు పిల్లాడు. కృష్ణమూర్తి వాణ్ణి కమలచేతి కిచ్చాడు. వాడు కమలవద్దకు పోయింతేతడవుగా పాలకు తొందరచేశాడు. కృష్ణమూర్తి మంచముమీద కూర్చుంటే కమల ప్రక్కగా క్రిందకూర్చొని పిల్లవాడికి పాలివ్వడానికి ఆరంభించింది పిల్లవాడు ఒకరొమ్మున పాలుతాగుతూ రెండవరొమ్ము ఎడమచేత్తో పట్టుకున్నాడు.

ఆవైపే సాభిలాషుడై చూస్తున్న కృష్ణమూర్తికి చిరునవ్వు ఆగలేదు. అతనికళ్ళు, కమలకళ్ళు కలుసుకున్నాయి. కమలగూడా అతని అభిప్రాయం తెలుసుకున్నట్టుగా చిరునవ్వు నవ్వింది సిగ్గునూదిస్తూ.

కృష్ణమూర్తికి సృష్టివైచిత్ర్యాన్ని గురించిన ఆలోచనలు వచ్చిపడినయి. పాలుత్రాగుతూ ఓరగంట తండ్రివైపు చూస్తున్న పిల్లవాడి చూపులలో కలసి కృష్ణమూర్తికి స్పృహవచ్చింది. వాడివైపే చూస్తూ కృష్ణమూర్తి నవ్వుతూ 'చెయ్యితియ్యి వెధవా!' అన్నాడు.

పిల్లవాడు ఆదేరీతిన పాలు త్రాగుతున్నాడు. కృష్ణమూర్తి భార్యవైపువంగి పిల్లవాడి ఎడమచెయ్యి పట్టు వదిలించాడు.

పాలుత్రాగడ మాపి పిల్లాడు కొంచెం తల పైకెత్తి తండ్రివైపుచూస్తూ నవ్వాడు. తల్లితండ్రు లిద్దరూ ఒకరినొకరినిచూసి నవ్వుకొన్నారు వాడి నవ్వుచూసి.

౩

తర్వాత కొంతసేపటిమాట. పిల్లవాడేడవడం మొదలుబెట్టాడు. వాణ్ణి చంకనవేసుకొని లేచి ఇటూ అటూ కాసేపు త్రిప్పింది. పిల్లవాడు ఏడ్చిఏడ్చి నిద్రపోయినాడు. వాడికి పక్కవేసి పడుకోబెట్టి బాగా నిద్రపోయేవరకు పక్కనకూర్చొని చిచ్చికొట్టింది. వాడు నిద్రపోయినతర్వాత ఊలు ముందువేసికొని కొడుక్కు మేజోళ్లు అల్లుతూ కూర్చున్నది. ఇంతలో పిల్లవాడి పాలకుగాను నీళ్ళు పొయ్యమీదపెట్టి వచ్చిన మాట జ్ఞాపకంవచ్చింది. పిల్లాడు నిద్రపోతున్నాడుగదా అని, ఆనీళ్ళు థర్మొ ఫ్లాస్కు (Thermo flask) లో పోసి అలమరలోపెట్టి వచ్చింది. పిల్లవాడికి నీళ్ళు పోయడానికి రేపటికి సున్నిపిండి నిండుసున్నదని, ఊలు

అవతలపెట్టి, గోనెపట్టాపరిచి దానిమీద తిరగలిపెట్టి, సున్నిపిండినూక తీసుకునిరావడానికి అవతలికి వెళ్ళు తున్నది.

'కమలా'

'ఓయి.'

'ఇలారా'

'వస్తున్నా, ఎందుకు?'

కొంచెంసేపు ఆగాడు కృష్ణమూర్తి. ఆమె రాలేదు.

'నిన్నే! మాట! !'

'వస్తాలెద్దురూ. పనున్నది'

'మాటంటే'

కమలవచ్చి భర్తదగ్గరనుంచొని 'ఎందుకు?' అన్నది

'కూర్చో. మాటఉంది'

'వస్తానుండండి' అని కమల పనిమీద వెళ్లుతున్నది.

'బొత్తిగా తీరకుండాఉందే! వచ్చికూర్చో గోల' అని వెళ్ళుతున్నకమల పమిటచెరగు పట్టుకున్నాడు.

కమల వెనక్కుతిరిగి, భర్తచూపులను తన బ్రతిమాలు చున్న చూపులతో ఎదుర్కొని

'ఉండండి అబ్బా! కబుర్లకేమి? అబ్బాయికి రేపటికి సున్నిపిండిలేదు. విసిరివస్తాను ఛప్పున, ఇదిరరలాగా కబుర్లకు ఎట్లా తీరుతుంది చెప్పండీ మరీ చిన్నపిల్ల లవు తున్నారు?'

అని అంటూ కమల తన చీరెచెరగు మెల్లగా వదిలించుకొని వెళ్ళిపోయింది.

## ౪

అలాగే కూర్చున్న కృష్ణమూర్తికి అప్రయత్నంగా ఏవో ఆలోచనలు వచ్చినవి. తన్నుగూర్చిన కమల చర్యంతా సింహావలోకనముచేశాడు. పిల్లవాడు కలుగక ముందు ఆమెచర్యకు, కలిగింతర్వాత ఆమెచర్యకూ చాలా వ్యత్యాసము గోచరిస్తున్నది. తన కీవిషయం చాలా రోజులాయె మనస్సుకు తట్టుతున్నది. అయితే దానివిషయమై గట్టి ఆలోచన కలగలేదుగాని.

ఇదివరలో ఆమె హృదయంలో తన కొక్కడికే ప్రాధాన్యము. తనను సంతోషపరచడమే ఆమె పరమా వధి. ఆమె స్నానంచేయడం వగైరా ఆమెచేసే ప్రతి పనీ తన సంతోషాన్ని అతిశయింపజేస్తవనే అభి ప్రాయంతోనే చేసేది. ఆమెచేసే సర్వమూ తన పాద కమలాలవద్ద హృదయపూర్వకంగా అర్పించేది పనిలో మునిగితేలుతూ ఉన్నప్పుడుగూడా తనను నవ్వుతూ ఒక్కసారి పలకరించడానికి ఆమెకు అవకాశంకలిగేది. అప్పుడు ఆమె తన ఉత్సాహాన్ని ఇనుమడింపజేసి ఆమె ద్విగుణీకృతోత్సాహంతో పనిచేసుకుండేది.

ఇప్పుడూ అంత ఉత్సాహంతోనే పనిచేస్తున్నది. చూడగాచూడగా ఇంకా ఎక్కువ ఉత్సాహంతోనే పనిచేస్తున్నట్లు అనిపించింది అతని అసూయాబాధిత హృదయానికి. కాని ఈ ఆమె సర్వప్రయత్నమూ తన్ను సంతోషపర్చడానికికాదు. పిల్లవాడే ఆమె సర్వస్వాన్నీ ఆక్రమించుకున్నాడు. తనకామె హృదయంలో స్థానం కనిపించలేదు. ఇప్పుడా హృదయాన్ని మరొకమూర్తి ఆవరించింది. ఇప్పుడామెచేసే ప్రతిపనీ ఆమూర్తి సాన్నిధ్యాన్నే అర్పిస్తున్నది.

తాను మాత్రం తన కుమారుణ్ణి ఆమాత్రం ప్రేమిం చడం లేదా? అందుకని ఆమెయందు తనకుగల ప్రేమ ఏమాత్రమైనా తగ్గిందా? ఆమెను ఉదాసీనభావంతో చూస్తున్నాడా? ఆమెమాత్రం ఆలాఎందుకు ప్రవర్తించ గూడదూ? ఆమెకు తనమీద ఉన్న ప్రేమంతా ఏమయింది?

ఆ ఆలోచనా పరంపరకు అంతులేకుండాపోయింది. భోజనంచేసి తాను అక్కడ కూర్చున్నదిమొదలూ తన సంతోషంకోసమని ఆమెచేసిన పనేమున్నది? పిల్లవాడి కోసం మాత్రం ఆమె శ్రమపడగూడదని తానంటు న్నాడా? ఆమె హృదయంలో, ఆమె మనస్సులో తనకు గూడా, ఒక మారుమూలనే అయినా, ఒక కొద్ది పాటి జాగాఎందుకు చూపగూడదూ? పిల్లవాడికి రేపు ప్రొద్దుటికికావలసిన సున్నిపిండి కిప్పుడు తొందర వచ్చిందా? తనవద్ద కూర్చుని మామూలుమాదిరి రెండు కబుర్లు నవ్వుతూ మాట్లాడి తనను సంతోషపరచడానికి ఆమెకు సావకాశమేలేదా? అంతకన్న రేపెప్పటికో కావలసిన సున్నిపిండిపని ముఖ్యమా! అని కొండప్లీటి చాంతాడుభళె ఆలోచన,

కృష్ణమూర్తి కమలవంక చూశాడు. ఆమె చిత్త వృత్తినిగురించి ఆలోచిస్తున్నకొద్దీ అతనికి కష్టంగా ఉన్నది. ఆమెఅంటే అసహ్యమైంది. కమల అత్యం తోత్సాహంతో తనపని తాను చేసుకుంటున్నది. ఆమె ఉత్సాహాన్ని కృష్ణమూర్తి సహించలేకపోయినాడు.

ఇంతలో పిల్లవాడు నిద్రలేచి ఏడ్చాడు. కమల చేస్తూచేస్తూ ఉన్న పని వదలిపెట్టిపోయి పిల్లవాడిని ఎత్తుకొని లాలించడం మొదలుపెట్టింది. ఇంతసేపాయి తాను పడుతున్న అవస్థ ఏమాత్రము గ్రహించకుండా కొంచెం ఇట్లా పిల్లవాడు ఏడ్చాడోలేదో ఏమంత తొందర? చేస్తున్నపనికూడా వదలిపెట్టిపోయింది.

కృష్ణమూర్తి ఈర్ష్యాగ్రస్తుడైనాడు. తన కుమారుణ్ణి చూస్తేగూడా కోపమునిపించింది. తమ ఇద్దరిమధ్యనున్న ప్రేమానుబంధము సడలిపోవడంకంటె వీడివల్ల తమకు గాని, ప్రపంచకానికిగాను జరిగిన ప్రయోజనం ఏమి టనుకున్నాడు. పరిస్థితులు ఈలాఉంటే ప్రపంచక మంతా పిల్లలుకావాలె పిల్లలుకావాలెనని ఏడుస్తా రెందుకు అనుకున్నాడు. వెంటనేపోయి కమలను ఏమ యినాసరే అడగవలసిందే ననుకున్నాడు. ఏమని అడగా లెనో తెలియలేదు. లేచి గబాగబా రెండడుగులలో కమలను సమీపించాడు ముఖం వింతగానున్నది.

'కమలా!' అన్నాడు అధికారంసూచించే గొంతుకతో కృష్ణమూర్తి.

ఆమె ఇటుతిరిగి ఏమిటి అనేలోగా పిల్లవాడు ద్దా, ద్దా, ద్దా, అంటూ తండ్రివైపు చేతులు చాచాడు. తల్లిచేతులో ఉన్న పిల్లవాణ్ణి అతనువంగి ముద్దుపెట్టు కున్నాడు, కమల కుమారుణ్ణి ముద్దిడుతూ ఉండగా. ఆమె చెక్కిళ్ళు తనచెక్కిళ్ళకు తగలగా తాను పార వశ్యం చెందాడు.

అతని ఆలోచనలన్నీ మాయమయినవి. 'ఎందుకూ పిలిచారు?' అన్న కమలప్రశ్నకు 'ఏమీలేదు' అని సమా ధానం చెప్పాడు.

తరువాత ఒకగంటసేపు ప్రయత్నించేస్తేనేగాని అతని ఆలోచనలన్నీ అతనికి జ్ఞాపకంరాలేదు. అతనిలో అతనికే వెర్రినవ్వు వచ్చింది.

—మొదలి సీతారామస్వామి బి.ఏ.

# క్రీడావస్తువులు

బాబ్జీ, ఈదుమ్ములో కూర్చొని, ఆ విరిగి పోయిన పూరెమ్మతో ఉదయాన్నుంచీ ఆడు కొంటూ ఎంత హాయిగా ఉన్నావు!

ఆ ఎండిపోతూన్న చిన్న పూరెమ్మతో ఆడుకోవడం చూచి నేను నవ్వుతాను.

జమాఖర్చులు చూచుకుంటూ చిత్రాలు అవీ రాసుకుంటూ ఉంటాను.

నాకు తీరుబడి ఎప్పుడు?

నీ దృష్టిని నాకేసి ఒకసారి ప్రసరింపజేసి 'ఇంత ఆహ్లాదకరమైన ఉషానమయం ఎలాంటి ఆటతో వృథాచేస్తూందో!' అను కుంటావు గాబోలు!

బాబ్జీ! మట్టితో కానులు పుల్లముక్క లతో తుపాకీలు చేసి ప్రొద్దస్తమానమూ వాటితో గడిపేయడం అనే కళ మరచే పోయాను.

నేను ఖరీదుగల ఆటవస్తువులను కోరి... బంగారు ముద్దలూ వెండిప్రోగులూ సంపా దిస్తున్నాను.

నీవు, ఏవస్తువులతోనైనా సరే, ఎప్పు డైనా సరే, ఆహ్లాదకరమైన క్రీడలను సృష్టించుకుంటావు నీ కొరకు. నేనో? నా కాలం బలం—నా జీవితములో - ఎప్పుడూ సంపాదించలేని వస్తువులమీద వృథా చేస్తాను.

అస్థిరమైన యీ జీవిత నౌకతో వాంఛా సముద్రమును దాటుటకు పలు కష్టములూ పడుచూ—నే నొక ఆట ఆడుచున్నానని మరచి పోతాను.

—చిట్టూరి సత్యనారాయణ.

# సింధునదీ ప్రాంతములందలి ప్రాచీన నాగరికత-తత్కారకులు

(The Indus valley civilisation and its authors)

'హిందూదేశచరిత్ర క్రీ. పూ. 326 నా డుపక్రమించెనని మొన్న మొన్నటిదాక పలువురు పాశ్చాత్య పండితుల యభిప్రాయము. గ్రీసునాయకుడగు నలెగ్జాండ రుత్తరహిందూస్థానముపై దండెత్తిన దీ సంవత్సరమే. డాక్టరు స్మిత్తువంటి గొప్ప ప్రాచీన హైందవ చరిత్రవేత్తలు అలెగ్జాండరు దండయాత్రతోడనే హిందూదేశచరిత్ర ప్రారంభించెనని యుద్ఘాటించిరి. ఈ వాదము పలువురచే నంగీకరింపబడినది హైందవ పండితులలో గొందఱీవాదమును ప్రతిఘటింప జూచిరిగాని వీరి ప్రయత్నములు నిష్ఫలమాయెను.

అదృష్టవశమున 1922-వ సంవత్సర మీ పాశ్చాత్య పండితుల కండ్లుతెరచినది. ఈ స్మరణార్హమైన వత్సరముననే బెనర్జీగారు సింధుప్రపాతమందలి యొక గుట్టకు పయనమైరి తొలునోలు, యతడొక బౌద్ధస్తూపమును, ఒకమఠమును కనుగొనెను. వాని బాహ్యరూపమునుబట్టి యతడు వాని ప్రాచీనతను గ్రహించెను. సింధుప్రపాతము తరువాత తరువాతకూడ చారిత్రిక ప్రాముఖ్య వాహకత్వముచే మిక్కిలి ప్రసిద్ధి వహించెను. పాశ్చాత్యప్రపంచ నాగరికతవలెనే, హైందవ నాగరికతకూడ నతిప్రాచీనమని బెనర్జీగారు జగత్తునకు తెలియజెప్పిరి ఈ విషయమున ప్రభుత్వమువారు కూడ శ్రద్ధవహించి పౌర్వికవస్తుచిహ్నములం దసంఖ్యాకములై యుండుటచే, సింధునది పరిసరములను త్రవ్వించుటకు కావలసిన ధనసహాయము నొసంగిరి. ఈ కార్యము బెనర్జీగారితరువాత దీక్షితుగారిచేతను వారి తరువాత వాట్సుదొరగారి చేతను సమర్థతతో నిర్వహింపబడెను. వారచ్చట చాలలోతువరకు ప్రాచీనవస్తుచిహ్న సముదాయ ముండెనని కనుగొనిరి. బెనర్జీగారచ్చట కొన్నిముద్రలను కనుగొనిరి. అవి చాల్కాలితుకు యుగమునకు చెందియుండెనని వారి యభిప్రాయము. సింధుప్రపాతమందలి ఖననక్రియలను ఉపదర్శించుటకై 1926-వ సంవత్సరమున, సర్ జాను మార్షలుగారు (Director general of archaeology) నియమింపబడిరి. వారు వచ్చిన తరువాతనే ప్రభుత్వము వారు మొహంజదారో పురః ప్రత్యాకాశించసియని తెలిసికొనిరి. హైందవనాగరికత క్రీ. పూ. 3 మిలియనులనాడే ప్రారంభమైనదని చెప్పుటకు ప్రబల సాక్ష్యములైన యీ ప్రాచీన చిహ్నములను కనుగొను మహాభాగ్యము వీరికొరకు వేచియున్నది కాబోలును. రామప్రసాదుచందగారు చెప్పునట్లు 'మొహంజదారో హారప్పాలలో దృష్టములైన ప్రాచీన వస్తుచిహ్నములు భారతదేశ చరిత్రమును క్రీ. పూ. 3.వ శతాబ్దమునుండి, క్రీ. పూ. 3-వ మిలియనునాటికి త్రోయగలిగినవి.'

ఈ మొహంజదారో లర్ఖానా జిల్లాలో యున్నది. ప్రాచీననగర చిహ్నములు సుమారు 70 గజముల గుట్టలలో గుప్తములై యున్నవి. ఖననక్రియలు జరిగిన స్థలము వైశాల్యము సుమారు 240 యకరములుండును. మన దురదృష్టవశమున నానగరము చుట్టును విరివిగా నుండు నుప్పును, సైంధవసారమును, ఈ స్థలముయొక్క పరిక్షయమున కవ్యవహిత నిమిత్తములైనవి. ఒక్కొక్కప్పు డచ్చటి యుష్ణ మతిస్వల్పముగా నుండును. కాదాచిత్కముగా సంభవించు వరదలభయముచే వారు నగరము నున్నతప్రదేశమున నిర్మించిరి. అయ్యును నవి తరచుగా నిదనోన్ముఖములగు చుండెడివి. వ్యాఘ్రములును, కుంజరములును లెక్కకు మిక్కిలియై యున్నవి. సింహచిహ్న మొకటైనను దృగ్గోచరము

కాకుండుటచే నది శుష్కమండలము కాదని మన మూహింపవచ్చును. అందుచే సింహాభావము మిక్కిలి ప్రాముఖ్యము వహించినది. ఉత్ఖాతమైనంతవరకు ఏడు వరుసలైన ప్రాచీనచిహ్నములు కనుగొనంబడినది. అచ్చటి నేలమట్టమంతయు సమముగాలేదు. పైదానిని బట్టి, యీ సంఘనాగరికత పర్షియా, మెసపటోమియా, ఈజిప్టుదేశములందు వలెనే, హిందూదేశమునకూడ ప్రాచీనకాలమందే ప్రబలియుండెననీ చెప్పవచ్చును.

ఇచ్చటి కట్టడములన్నియు నిరలంకారములైన ఇటుకలతో కట్టబడియున్నవి. ఉపయుక్తమైన వస్తుసముదాయము మిక్కిలి సువహము. గవాక్షములు మిక్కిలి చిన్నవి. కవాటములు కూడ గుర్తింపబడినవి. ఇచ్చట కనుగొనబడిన భవనములలో కొన్నిటికి రెండుమూడంతస్థులు కూడ గలవు. ప్రతిగృహము చెంత నొక నూయియు, స్నానగృహమును నిర్మింపబడినవి. మహోన్నతములైన యట్టిభవనము లిప్పుడు నిర్మూలింపబడినవి కాని వాని యౌత్కృష్ట్య చిహ్నములు నేటికిని గోచరించుచునే యుండును. వీని నన్నిటిని బట్టి, నిట నొక గొప్ప నాగరికత ప్రబలియుండెనని యూహింపవచ్చును. వీధులన్నియు మిక్కిలి బాగుగా నిర్మింపబడియున్నవి. కొన్నివీధుల కోణములు వలయాకారమును దాల్చియున్నవి. ఇచ్చటి గృహములను మూడువిధములుగా విభజింపవచ్చును (1) నివాసగృహములు (2) ఇంకను సరిగా నిర్ధారణ చేయ వీలులేని గృహములు (3) స్నానగృహములు రెండుమూడు అంతస్తులుగల గృహములలో, పైయంతస్థుపై నిద్రించుచుండెడివారు. కొన్నికట్టడములు మతప్రాధాన్యమును వహించునట్లున్నవి. కాని పరిశోధనలు జరిగిన తరువాతగాని వానిని గూర్చి ఏమియు చెప్పజాలము. నేటికిని వారు స్నానముచేయునట్టి ఒక తటాకము నిల్చియున్నది. వీని చుట్టును చిన్నచిన్న స్నానగృహములు కూడ నుండెనని సరుజానుమార్షలుగారు అనుచున్నారు (Mohenjadaro and the Indus valley civilisation vol 1 page 6.)

మొహంజొదారోలో మిక్కిలి దిగువ నున్న అంతస్థులను పరికించినచో నవి క్రీస్తుపుట్టుటకు నాలుగు మిలియనుల పూర్వమే యున్నట్లు తెలియును. భూమ్యధః పంక్తికిని గుట్టల శిఖరములకును మధ్య నేడువరుసల శిథిలశేషములు గలవని యీ నూతన పరిశోధనల వలన తేలినది. ట్రోయి మొదలగు పాశ్చాత్యదేశములలోని ఖననపరిశోధకుల పద్ధతిని బట్టి పరికించినచో నొకవరుసకును మఱొకవరుసకును నడుమ 1000 వత్సరములు పట్టియుండునని తేలును. మనము పరిశీలించిన ప్రకారమిచ్చట నిధనపరిక్రియయు పునర్నిర్మాణమును త్వరాన్వితములై యుండెను. అందుచే నొక్కొక్కవరుసకు 500 సంవత్సరములు వ్యవధాన ముండెనని మనము నిర్ధారణ చేసికొనవలయును. ఒక్కొక్కవరుసకు 500 సంవత్సరముల చొప్పున గణించినచో నిచ్చటి నాగరికతా కాలము క్రీ. పూ. 3000 సంవత్సరములనాటికి జరుగును. అంత మహోన్నతమైన నాగరికత ఒక శతాబ్దములోనే వర్ధిల్లుట కవకాశము లేదు గావున నా యభివృద్ధికి 1000 సంవత్సరములు పట్టైనను సమంజసముగా నుండును. ఇట్లు చేసినచో నాకాలము క్రీ. పూ. 4000 సంవత్సరముల నాటికి జరుగును. సింధుప్రపాత లబ్ధములైన ముద్రలకును, క్రీ. పూ. 3000 లోపలి మెసపుటోమియాలోని ముద్రలకును సన్నిహిత సామ్యముగలదని పండితులు కనిపెట్టియున్నారు. ఈ సందర్భమున ఉరు, కిషులలో దొరకిన ముద్రలనుబట్టి లాంగుడను, గాడ్, అను పాశ్చాత్యపండితులీనాగరికతా కాలము క్రీ. పూ. 2800 కు తరువాతిదై యుండవలెనని యూహించుచున్నారు. ఈ పైముద్రలు ప్రాయః మధ్యకాలమునకు చెందియుండుననియు, దానిని బట్టి మొహంజదారో యొక్క ఆక్రమము క్రీ. పూ. 3250కిని 2250కిని నడుమ జరిగియుండుననియు మార్షలుగా రభిప్రాయ పడుచున్నారు.

మొహంజొదారో వంటి జనసమ్మర్ధము గల పట్టణములు విరివిగాను హానాసదుపాయము చేయుటకు సమర్ధములైనట్టియు, వర్తకవ్యవసాయముల సౌలభ్యమునకాదిభూతమైన మహానది గలిగినట్టివియు నగు ప్రదేశ

ములలో దక్క వేరుచోట్ల నుండుట దుష్కరము. గోధుమలయొక్క, బార్లీయొక్క ప్రతులుకూడ నిచ్చట కనిపెట్టబడెనని యీ సందర్భమున చెప్పవలసియున్నది. అచ్చటివారు బార్లీను, మాంసమును, కూర్మమును, ఆహారముగా నుపయోగించుకొనెడివారు. ఈ యంశము అచ్చట పరిదృష్టములైన ఎముకలు మొదలగు వానిపై నాధారపడియున్నది. హారింప్లవద్ద వృషభములను, ఒంటెలను, మహిషములను, గొఱ్ఱెలను పెంచుచుండెడివారు. కాని వ్యాఘ్రములు, లొట్టిపిట్టలు, కోతులు మున్నగునవి ముఖ్యములని గుర్తుపెట్టుకొనవలయును.

ముద్రలను, తత్పరిన్యస్తమైన యక్షరక్రమమును శ్రద్ధతో పరిశీలింతుము. 1927-వ సంవత్సరము మేనెల నాటికి 558 ముద్రలు దొరికినవి. వానిలో విశేషభాగము మీద నొకటి లేక రెండు పంక్తుల రచన యుండెను. ఆకృతులు భిన్నభిన్నములై యుండెను. సింధునదీ ప్రాంతములందలి జను లుపయోగించిన యక్షరక్రమము మినోవను, సుమేరానుయుగములందలి యర్ధపరిణతములైన యక్షరపద్ధతుల తెగకు జేరియుండెను. లాంగుడను వానిని శుచిముతములైన యక్షరాకృతులని వర్ణించియున్నాడు. అవి సులభముగా గుర్తించుట కనువు రావు? సిడ్నీస్మిత్తుగారును, గాడ్ గారును వానిని పట్టీల రూపమున ప్రచురించియున్నారు.

ఇచ్చటిప్రజలు మట్టిబిళ్ళలకు బదులు ఇటుకలను శూన్యతాళపత్రములను, వస్త్రములను ఉపయోగించెడివారు, వానిమీద నక్షరములు కుడినుండి యెడమకు వ్రాయబడెను. ఒక్కొక్కప్పు డీపద్ధతి ననుసరింపకుండుటయు గలదు. వాని మీది రచన సాక్షరక్రమమైనట్లు లేదు. మొత్తముమీద నది స్వసంబంధిపోలె తోచుచున్నది. కొందరుపండితులు దీనికిని పడమటి ఆసియాయందలి చైత్రికరచన (Pricto graphic script) కును, సంబంధము కలిగించుచున్నారు. కాని నిజముగా నిరోధించినచో నీరచన స్వతంత్ర ప్రభవము కలదని గోచరించును

ఇచ్చటిజనులకు లోహపరిచయము సైతము గలదు. అట్టి నాగరికతకే Chaleolithic నాగరికత యని పేరు. వారికి వెండి బంగారము, ఉక్కు, తగరము, మొదలగు లోహములను గూర్చి మంచి పరిజ్ఞానము కలదు. హానోక్గారి యభిప్రాయము ప్రకారము బంగారము దక్షిణ హిందూస్థానమునుండి వచ్చియుండవలెను. వెండి, బంగారము లాభిజాత్యమై యుపయోగింపబడుచుండెను. వెండితో పాత్రలు సైతము చేయించుకొనుచుండెడివారు. రాగి, ఆయుధనిర్మాణమునకును, చవుకరకపు టాభరణములకును వాడబడుచుండెడిది. కాని అన్నితరగతుల జనులును ఆభరణములను ధరించుచుండిరి.

ఇంతవరకు వ్రాసిన దానినిబట్టి సింధునదీప్రాంతములందలి జనులు మతవిషయములలోకూడ మిక్కిలి నిపుణులై యుందురని నూహింపవచ్చును. కాని నిశ్చయమైన యభిప్రాయము నిచ్చుటకు సరియైన ఆధారములింకను అందుపాటులో లేవు. ఇప్పటికి లభించిన రాతిశిథిలములు గాని లోహసామగ్రిగాని వారిమతము నిర్ణయించుటకు సహాయపడవు. సరుజానుమార్షలుగారు రది ద్రావిడనాగరికతయని చెప్పుచు, దానిపరిణతత్వ ముద్ఘాటించిరి. కాని మానియరు విలియమ్సుగారు హైందవ నాగరికతకు ద్రావిడులొసర్చిన సాయము విస్మరణీయమని యభిప్రాయపడుచున్నారు. అనార్యులు భూదేవితో సంబంధము కలిగిన యొక సర్వాధికమైన పరతత్త్వముయొక్క యునికియందు దృఢనమ్మకము గలిగియుండిరని Opport గా రూపించుచున్నారు. ఇచ్చట కనబడిన కొన్ని చిత్రములలో ప్రకృతిదేవతా చిత్రణము కలదు. ఇట్టి పూజావిధానము ఫ్రిజియానుండి వచ్చినదని కొంద రూహించుచున్నారు కాని యీపద్ధతి ఇండియాలో మఱియెచ్చటను ఇంత బహుళవ్యాప్తి నందియుండలేదు. మతసంబంధులగు శిథిలశేషములు మిక్కిలి తక్కువగా నున్నవని యిదివరకే వ్రాయబడినది. ఒక ముద్రమీద త్రిలోచనుడగు నొక పురుషదైవము చక్కగా చిత్రింపబడియుండుటచే నప్పుడు పురుషదైవత పూజకూడ నుండెనని చెప్పవచ్చును.

సింధునదీ ప్రాంతముల శక్తి పూజ సైతము ప్రచారమున నుండెను. శాక్తేయమతము నందలి ప్రధానలక్షణమేమన ప్రకృతిపురుష సంయోగమునందలి విశ్వాసము. ఆ కాలమున శిలలుకూడ పూజింపబడెడివి. వృక్షపూజకూడ నిచ్చట ప్రచారముగలదు. వృక్షచిత్రములుగల ముద్రలు బహుళముగా గలవు.

శృంగములు దేవత్వమున కొకగుర్తు రాగిపలకల మీదను, ముద్రలమీదను సజీవజంతువులు కొన్ని చిత్రింపబడియున్నవి ఈచిత్రములు పశ్చిమాసియా, సుమేరియాలోని చిత్రములను బోలియుండుటచే కొందరు పండితులీవస్తువుల మాతృకలం వైదేశికములని యూహించుచున్నారు.

మృతులను వా రేమి చేసెడివారో చెప్పుటకు ఆధారభాగ మడ్డంకిగా నున్నది. మరణానంతర క్రియ యప్పుడు త్రివిధమై యుండెడిది. సరుజాను మార్షలుగారి ప్రథమ సంపుటమున నీవిషయమును గూర్చి మంచి వివరణము కలదు. మొత్తముమీద దహనమే మృత్యనంతర క్రియయని మనము నిర్ధారణ చేయవచ్చును వీరు మృతులయెడల జూపు నీ యపారగౌరవము వారికి మతముసెడ మిక్కిలి పట్టుదల యుండెనని తెలియుచున్నది.

ఇంత మహోత్కృష్ట నాగరికతకు,నిలయమైన యీ ప్రజలు వర్తక విధానమునఁ గూడ నిపుణులే. వారి తూనికవస్తువులు మిక్కిలి హృదయరంజకములు. కొందరు పండితులు వీనికి వైదేశిక ప్రభవమును సూచించుచున్నారు.

రాగితోను, కంచులోను చేయబడిన పాత్రలసంఖ్య మిక్కిలి తక్కువ. అప్పటిపాత్రలు చాలభాగము చక్రనిర్మితములే. వాని బహిర్భాగము సుందరముగా చిత్రితమై యుండెడిది. ఈపాత్రలమీద మనోహరములైన అలంకారములు ఇండియాయందలి కులాలవృత్తియొక్క ప్రాచీనత్వమును సూచించుచున్నది.

అప్పుడు దంతములు ఎముకలు మొదలగునవి కత్తులుగా నుపయోగింపఁబడెడివి.

జూదమున్న వారికి మిగులనిష్టము.

ఆనాటి కళాస్థితిని కొంతవిమర్శింతము. సరుజాను మార్షలుగారు సూచించినట్లు ప్రతియంగుళము నేలయు బహుళాలంకారాన్వితమై యుండెడిది. ఈయలంకారములు కొన్ని నైసర్గికములు కొన్ని సమయసిద్ధములు. కాని వానిలో చాలభాగము అరణ్యదృశ్యదర్శన సంజాతీ వేళమే నిమిత్తముగా గలది. పాత్రసామగ్రి సాధారణముగా నిరాడంబరమై యుండెను. మృణ్మయపాత్రల నిర్మించి, వాని బహిర్భాగమును చిత్రవర్ణకముగా జేయుట యొకవృత్తియే కాని కాళామచ్యము కాదు. వృషభ మహిషాది సంజీవజంతువులు రమ్యముగా చిత్రింపబడియుండుట జూడ హిందూదేశ మానాఁడే కళాసమృద్ధమై యుండెనని చెప్పవచ్చును. అరుణశిలానిర్మితములైన మానవవిగ్రహములుకూడ . కొన్ని దొరకినవి. ఇవి వివిధవర్ణములతో చిత్రింపబడియున్నవి.

ఇందు సింధుప్రపాతముయొక్క సంక్షిప్తవర్ణనము. విస్తరభీతిచే ననావశ్యకములైన విషయములు కొన్ని వర్జింపబడినవి ఇక నానాటి, నాగరికత యెట్టిదో సమగ్రముగా పరిశీలించి దానికి ప్రపంచనాగరికతా సమూహమున నెట్టి స్థానముకలదో నిర్ణయింతము.

## నాగరికతా కాలము

సింధునదీప్రాంతస్థ నాగరికతకును, ప్రాక్చరిత్రయుగమునందలి సుమేరియా నాగరికతకును సామ్యమున్నదని యనేక చరిత్రకారు లభిప్రాయపడుచున్నారు. చైల్డు చెప్పునట్లుగా నీరెంటికిని సాధారణధర్మములలో సామ్యమున్నది. పట్టణములలోని సంఘనిర్మాణ విధానము, ఆయుధములకు ఇనుమును కంచును ఉపయోగించుట, స్వర్ణకారవిద్యలోని యభివృద్ధి, యివి యన్నియు సుమేరియను ప్రభవమును సూచించుచున్నవని యతని యభిప్రాయము. అదిగాక దక్షిణపశ్చిమాసియాయందలి నాగరికతకును సింధునదీప్రాంతములందలి నాగరికతకును మిక్కిలి సన్నిహిత సాధర్మ్యమున్నది. హోమరు నాగరికతతో నది సమకాలికము. నాలుగవశతాబ్ది అంతమున నా రెండు దేశములకును సంబంధము మిగుల బహుళముగా నుండెననియు, అవి

మిక్కిలి యుచ్ఛదశనొందిన కాలముకూడ నదియే యనియు మనము చెప్పవచ్చును.

ప్రతిపట్టణమునకును 500 సంవత్సరములను, నాగరికతాభివృద్ధికి 1000 సంవత్సరములును పట్టియుండునని మన మిదివరకే యూహించియున్నాము. (Ur kish) వద్ద రెండుప్రతులు దొరికినవి. ఇవి క్రీ. పూ. 2800 సపూర్వమువరకు జరుగును. అందుచే సింధునదీప్రాంతముల సమాక్రమణము క్రీ. పూ. 3250-2750 మధ్య జరిగెనను మార్షలుగారి యభిప్రాయముతో నేకీభవించుచు, నీనిర్ణయము సునిశ్చయముకాదనియు, నూతనాధారము లేవియైన వెలువడుచో దిద్దుబాటునకు లోంగియుండుననియు వ్రాయవలసియున్నది. ఈ విషయమును గూర్చి నిరంకుశాభిప్రాయము నొసగుట కిప్పుడు వీలులేదు. గృహసంబంధులగు చెక్కడములు కాలనిర్ణయమునకు పరికరములు కావు. ఉర్ పాలించిన రాజులలో మూడవతరగతివారు 2278-2170 బి.సి. మధ్యనుండిరి. ప్రస్తుతము చరిత్రకారులు 3-వ వారినియు మని, కాలమును నిర్ణయించిరి.

## సింధునదీ ప్రాంతముల నాగరికతకు కారకులు.

ఈ నాగరికతా కారకత్వవిషయమై యభిప్రాయభేదము గలదు. సరుజానుమార్షలు, మొదలగు కొందరు పండితులు 'నాలోచితముగా, వారు వైదికార్య జనులను' నభిప్రాయమును వెలువరించుచు, యీనాగరికా కారకులు అనార్యులని సూచించిరి. ఈనాగరికతా కారకులు వైదికార్యులను యభిప్రాయముతో యనేకమంది పరిణతమైన సైందవ నాగరికతను బట్టి యార్యుల భారతదేశ సమాక్రమణము యొక్క ప్రాచీనతను సిద్ధాంతీకరించుటకుఁగూడ పూనుకొనిరని మార్షలుగారి యభిప్రాయము కాని మఱికొంద రాసింధునదీప్రాంతముల వారికిని సుమేరియనులకును అభేదమును పాటించుచున్నారు. నగరనాగరికతను సూచించు జోల్కొలిటిక్ యుగమునకు చెందిన కంకశాము లిరువది నాలుగు కనిపెట్టబడినవి. మార్షలుగారు జననసంఖ్యయొక్క వైవిధ్యరూపమును కూడ నొక్కి చెప్పుచున్నారు. అచ్చట వివిధజాత్యాకృతుల సంయోగము గోచరించుచున్నది. 'ఈ నాగరికత ఏప్రత్యేక జాతసముత్పన్నము కాదనియు అచ్చటనే నెలకొనియున్న వివిధజాతులనుండి కలిగినదనియు' మార్షలుగారి యభిప్రాయము. వీరు సుమేరియనులకును ద్రావిడులకును ఏదో యొకసంబంధమును ముడిపెట్ట జూచుచున్నారు. డాక్టరుహాలుగారు సుమేరియనుల తల్లినేల మెసపుటేమియాకు తూర్పుననుండెనని చెప్పుచు, వీరికిని ద్రావిడులకును సమాన శారీరాకారమును, నిర్దేశించుచున్నారు. వారిప్రకారము వారు పంజాబు, సింధు, బెలూచిస్థానము ప్రాంతముల నివశించుచుండిరి. మొహంజదారో వలె నేసప్ నివాసులలోకూడ వివిధజాతి సమ్మేళనము కలదు. ఇట్లు కొందఱు పండితులది ద్రావిడనాగరికతయని యూహించుచున్నారు.

సరుజానుమార్షలుగారు తన యమూల్య గ్రంథమున సైంధవనాగరికతకు కారకులు వైదికార్యజనులని నిశ్చయించినయెడల వారిమతములో తేడా గలదని దెల్పియున్నాడు. వైదికనాగరికతను, సైంధవనాగరికతను పోల్చిచూచినచో నీరెంటికి నెట్టిసంబంధము లేదని నిశ్చితమగును. వైదికార్యజనులు ఆజానుబాహులుగను, సుందరవర్ణులుగను, దీర్ఘశిరస్కులుగను ఉండిరి. వేదములలో చెప్పబడిన హైందవార్య రాజకీయవిధానము కొంత వ్యవసాయికమనియు, కొంత పాశ్చొరల్ అనియు సరుజానుమార్షలుగారి తర్కము. ఇతఁడే వారింకను గ్రామ్యస్థితి నతిక్రమించలేదనియు, వారికి సంకీర్ణార్థిక నిర్మాణముగల పట్టణజీవిత పరిజ్ఞానము లేదనియు, వారి గృహములు కీచకదండ నిర్మితములై యుండెననియు చెప్పుచున్నాడు. ఈనాగరికత వైదికార్యసంబంధము కాదని నిరూపించుట కిది మార్షలుగారి ప్రధానాధారము. కాని పురశబ్దవ్యవహారము దీని కాటంకముగా నున్నది. మార్షలుగారు ఋగ్వేదమునందలి యీశబ్దమునకు కొందరు వైదికపండితుల ననుసరించి దారుప్రాకార సంవృతిమైన మట్టికట్టడమని యర్థము చెప్పి, యార్యులకు నాగరిక జీవనమును నిషేధించినారు.

వైదికానుబంధము, ప్రథమసంపుటము, 538 పుట నుండి, పురపదము ఋగ్వేదమున తరుచు వాడబడు చుండెననియు దానికి తరువాత తరువాత కోట కాక దుర్గము అను నర్థము వచ్చినట్లును గ్రహింపవచ్చును. పిశ్చలు, గెల్డరు అను పండితులవి దారుప్రాకార పరిఖా సంవృతములైన పట్టణములని యభిప్రాయపడుచున్నారు. కొందరు పండితులు ఎన్నదగిన యాకృతులు గల హైందవార్య నిర్మాణ చిహ్నములు కనిపెట్టబడకుండు టచే భిన్నాభిప్రాయులైరి హారప్ప మొహంజదారోల లోని నూతనపరిశోధనలతో నలబ్ధపరిచయులగుటచే వండితు లింకను పురశబ్దమునకు పట్టణమను నర్థము నొసంగకున్నారు. ఇంతవరకు పరిశీలించిన దానినిబట్టి ఋగ్వేదమునాటి హైందవార్యజనులు గ్రామ్యస్థితిని మీరియుండలేదను మార్షలుగారి యభిప్రాయము నిరాధారమైనట్లు కనప్పట్టుచున్నది. (చూడుడు: నరేంద్ర నాదలా గారి వ్యాసము Indian Historical quarterly March 1932)

హైందవార్య నాగరికతకును, సింధు నాగరికతకును నెట్టి సంబంధమును లేదని చెప్పుటకు మఱియొక నాధారము గలదు ఋగ్వేదకాలమున నార్యులు బంగారు రాగి, కంచు మున్నగు లోహములనే వాడియుండిరి. తరువాత యజుర్వేదోత్తర భాగమునాటికి వెండి యినుముకూడ వాడుకలోనికి వచ్చెను. సింధునదీప్రాంత ములవారికి వెండి సాధారణమయ్యె నియోలిథిక్ యుగమునందు వలె రాతితో చేసికొనుచుండెడివారు. వైదికార్యులు దాడివెడలునప్పుడు విల్లు బాణము కత్తి మొదలగు నాయుధముల నుపయోగించెడివారు. ఆత్మ రక్షణమునకై వారు కవచమును, డాలును ఉపయోగిం చెడివారు. మార్షలుగారిది సింధునదీ ప్రాంతముల వారి కవిదితపూర్వమ'ని చెప్పుచున్నారు. ఇట్లు వీరినాగరి కత ఆర్యేతరమని నిర్ధారణచేయుచున్నారు. మఱియొ కచో నతఁడు స్వయంవిరుద్ధముగా నిట్లు వ్రాసియు న్నాడు. 'మొహంజీదారో పరిశోధనలలో నినుము యొక్క చిహ్నమైనను లేదు' ఈవ్రాత ఈ రెండునాగ రికతలకును గల సామ్యమును వ్యక్తపఱచుచున్నది. ఇరు వురునుకూడ రాగి, బంగారము, కంచు, వెండి మొద లగు లోహములను సమానముగా వాడియుండిరి. ఋగ్వేదకాలమునకూడ పానపాత్ర పేర్కొనబడినది. అప్పటివారు, రుబ్బురోలు, పాత్రమునుకూడ నుపయో గించిరి. ఇంక నాయుధచిహ్నము లేవియు సింధుప్రపా తమున కనిపెట్టబడలేదన్న మాత్రముచే మార్షలుగా రచ్చటి నాగరికతకు భిన్నమైనదని నిస్సంశయముగా చెప్పుటకు వీలులేదు. ప్రొఫెసరు లా, గారు చెప్పినట్లు 'కవచాదులు అవనసారముచే నిర్మూలింపబడి యుండ వచ్చును' దీనినిబట్టి చూడ మార్షలుగారి సిద్ధాంతములు నిరాధారములుగా నున్నవి. నిజము పరికింప వైదికార్య జనులే యీ సైంధవ నాగరికతకు మూలపురుషులని తోచుచున్నది.

'వైదికార్యులు మాంసభక్షకులు. ఋగ్వేదమునం దెచ్చటను మత్స్యము పేర్కొనబడకుండుటచే వారికి మత్స్యభక్షణము విరుద్ధమని తెలియుచున్నది. కాని సింధునదీ ప్రాంతములవారికి మత్స్యమాహారవస్తువులలో ముఖ్యమైనది.' అని మార్షలుగారొకచో వ్రాసియు న్నారు. అనుదితములైన వస్తువులేవియు నప్పుడు లేవని చెప్పవలయునని మార్షలుగారి యూహ. కాని వైది కార్యులు తమ వస్తుబాహుల్యము న మత్స్యమును పేర్కొనుటంత ముఖ్యము గాదని యోచించి యుండ వచ్చును. అదిగాక ఋగ్వేదమునాటి ఆర్యులకది విరు ద్ధమైనచో తరువాతి వారు దానిని పరిహరించుటకు గాను వారీసంగతి నందు వ్రాసియే యుండెడి వారు.

సింధునదీ ప్రాంతములవారికి గుఱ్ఱముతోడి పరిచ యములేదని మార్షలుగారు వ్రాసియున్నారు. అశ్వ చిహ్నములు కొన్ని కనిపెట్టబడినను అవి వర్తమాన యుగమునకు చెందియుండునని మార్షలుగా రుద్ఘాటిం చుచున్నారు. తరువాత సింధునదీప్రాంతముల భావము వచ్చుచున్నది. వైదిక కాలమున గోవులు మిక్కిలి స్తుతింపబడుట చూచియున్నాము. కాని వృషభములు గౌరవపాత్రములై యుండెనని చెప్పు మార్షలుగారు సింధునదీప్రాంతముల గోవులులేవని నిరాకరించుట పొస

గదు. వైదికకాలమునగూడ వృషభములు మిక్కిలి శ్లాఘింపబడెనను విషయము మార్షలుగారు గుర్తించుట లేదు. ఈ విషయమును గూర్చి మాక్డొనెలుగారి వేదిక్ మిథాలజీ అను గ్రంథమును పరిశీలించినచో విశద మగును. అదిగాక మార్షలుగారు మిక్కిలి ప్రయత్నించియు, కొలది శిథిలశేషములను మాత్రమే సంపాదించ గల్గిరి. గో తురగముల చిత్రములు గల ముద్రలు పెక్కు నష్టములై యుండవచ్చును. ఈమాత్రమున సింధునదీ ప్రాంతములవారు వాని నెఱుంగరనుట పాడిగాదు. 'వేదములలో వ్యాఘ్రము పేర్కొనబడి యుండలేదు. కుంజరములు గూడ నతివిరళముగా నుండెను. ఈ రెండు జంతువులు సింధునదీ ప్రాంతములవారికి సుపరిచితములు' అని మార్షలుగారు వ్రాసియున్నారు. ప్రొఫెసరు మాకెగారు వారి మొహంజదారో అను గ్రంథములో సింధునదీ ప్రాంతమందలి యొకానొక ముద్రపై గల చిత్రము పలువురు భ్రమించినట్లు వ్యాఘ్రము కాదనియు, అది చిరుతపులి యనియు వ్రాసియున్నారు. ఇక చిరుతపులులు వైదికకాలమున గూడ నుండినట్లు వేదముల వలన దెలియుచున్నది. ఏనుగులు కూడ వేదములలో పేర్కొనబడినవని చెప్పవలసియున్నది. ఋగ్వేదమున ఏనుగు అనునర్థమిచ్చు వారణ, హస్తి పదములు కానవచ్చుచున్నవి. ఆకాలమున హస్తిన్ అనగా గజ రక్షకుడని యర్థము. సైంధవనాగరికత కాలమునగూడ నవి లేకుండెనని ప్రొఫెసరుమాకేగారు చెప్పుచున్నారు. దానినిబట్టి వైదికార్య సైంధవ నాగరికతలకు సామ్యముగలదనియు మార్షలుగారి సిద్ధాంతములు నిరాధారములనియు మనము చెప్పవచ్చును.

వైదికదేవతా సమూహములో స్త్రీదేవతలు పురుష దేవతలకు లోబడినవారనియు, మాతృదేవతగాని, శివుడుగాని యచ్చట ప్రాధాన్యము వహించియుండలేదనియు మార్షలుగారి యభిప్రాయము. సింధునదీప్రాంతములలో స్త్రీపురుష దేవతలలో హెచ్చుతగ్గులు లేవు. సింధునదీ సమీపమున కనిపెట్టబడిన చిత్రములనుండి సరుజాను మార్షలుగా రీసారాంశమును గ్రహించెను. తరువాత తెలుపబడిన పృథ్వీదేవత మాతృదేవతకంటె భిన్నమైనది, ఈ సంగతులను మనము విరివిగ చర్చింప నవసరము లేదు. ఇవన్నియు గ్రంథకర్త ఈ నాగరికత ఆర్యేతర మని సిద్ధాంతీకరించుటకు తెచ్చిపెట్టుకొన్న యాధార ములే గాని మరేమియు గావు.

వైదికదేవతలలో నగ్ని ప్రాధాన్యమును వహించు టయు, ప్రతిగృహమును అగ్నికూడ శోభితమైయుండు టయు మార్షలుగారి సిద్ధాంతమునకు ప్రోద్బలకములు. మొహంజదారోలో నగ్నికుండములు కనిపించుటలేదు. మార్షలుగారి యీవాదనకు తగినట్లు పూర్వపక్షము చేయవలెను. ఋగ్వేదమున నగ్నికుండము లెచ్చటను పేర్కొనబడియుండలేదు. వారి వాదమున కీయద్భుత వస్తుసూచనయే యాధారము. వారాసంగతిని తమవాద మును నిర్విఘ్నముగా కొనసాగించుటకై పూర్తిగా విస్మరించిరి.

సింధునదీ ప్రాంతములలో పరిష్కృతముకాని, లింగ పూజ వేదకాలమున వైముఖ్యముతో చూడబడెనని మార్షలుగారు చెప్పుచున్నారు. వారి వాదమును పోషించు ఋజ్వాధారములేవియును లేవు. బహుళమగు నాధారముకలదని యనుటయేగాని వారా యాధారము బహుళ్యమెద్దియో చూపించుటలేదు.

మార్షలుగారు చెప్పునదియే వేదవాక్యమని విశ్వ సించువారు ఆర్యసైంధవనాగరికతలకు ప్రభూతప్రభే దముకలదని చెప్పగడంగవచ్చును. కాని పరిశీలించిన కొలదిని ఈ వాదముయొక్క నిస్సారత బహిరపడుచు న్నది. వైదికార్యులు సింధునదీ ప్రాంతములవారికి పూర్వులగుట నిక్కము. కాని యిట్టి పరిణామసిద్ధాం తములు సర్వము వైదిక నాగరికతా కాలనిర్ధారణము మీద నాధారపడియున్నవి.

ఆర్యాగమన కాలవిషయము భిన్నభిన్నాభిప్రాయ ములకు గురియైయున్నది. ఆర్యనాగరికత సైంధవనాగ రికతకు తరువాతదిగాదని మనము చెప్పవచ్చును. ఏది ఎట్లున్నను ఈ రెండు నాగరికతలకును జన్యజనకభావము గలదని మనము తెలిసికొంటిమి. తరువాత యీ రెంటి లోను, ఏది ముందువచ్చినదో పరిశీలింతము. వైదికనాగ రికత సైంధవనాగరికతచే ననుసృతమన్న మనము చెప్పవ

చ్చును. పాశ్చాత్యపండితులు, ఆర్యు లిండియాకు వచ్చినది క్రీ. పూ. 1500 సంవత్సరములలో నని చెప్పుచున్నారు. మార్షలుగారు కూడ వీరి యభిప్రాయములతో నేకీభవించుచున్నారు. ఆర్యుల ప్రాచీనతను నొక్కి చెప్పుటకు పెక్కు టాధారములు గలవు. నిజమైన కాలము మాక్సుముల్లరుగారే నిర్ణయింపలేదు. డాక్టరు Winternetz గారు వేదములు 2500కు పూర్వము వ్రాయబడెనని చెప్పియున్నారు. ఇంకను మఱిరెండు భిన్నాభిప్రాయములు గలవు. ఒకటి జాకోబి గారిది. రెండవది తిలకుగారిది. జాకోబి క్రీ. పూ. 4500 ను, తిలక క్రీ. పూ. 6000ను యిచ్చియున్నారు. ప్రస్తుతము పలువురు పండితులు క్రీ. పూ. 3500 నాడు ఆర్యు లిండియాలో నుండిరనియు వైదికమత మప్పటినుండి ప్రారంభమైనదనియు తలచుచున్నారు. క్రీ. పూ 3250-2750 మధ్యకాలమున సైంధవ నాగరికత యుండెనని మార్షలుగారు నిశ్చయించినారు. అందుచే వైదికార్యులు సైంధవనాగరికతా కాలమున యుండిరని తేలుచున్నది. సింధునదీ ప్రాంతములవా రార్యేతర జాతి వారై యుండరు. ఏమన నార్యులును వారి సంతతివారును దక్క నంత యున్నతమైన నాగరికతను ప్రతిష్ఠాపించుటకు సమర్థులు కాజాలరు. ప్రఫెసరు లాంగుడనుగారు చెప్పునట్లు 'వైదికనాగరికతా వాఙ్మయాభివృద్ధికి తొలుతటి కాలమునే నిర్ణయించినచో సైంధవనాగరికతా కారకత్వముతో నార్యులకు గలసంబంధము తెలిసికొనుట సులువుగా నుండును. కాని దానికి మార్షలు గారు రద్దుపెట్టుచున్నారు.' సైంధవ నాగరికతకు, వైదిక నాగరికత పూర్వికమైనచో వైదికకాలముననుండిన నినుము, రక్షాకవచము, గుఱ్ఱము మొదలగునవి సైంధవ నాగరికతా కాలమున నుండకుండుట యెట్లు సంభవించినది? కంచు, రాగి, ఇనుము మొదలగునవి విరివిగా నుండిన వైదిక నాగరికత మధ్యనుండుటయే నిజమయినచో సైంధవనాగరికతలో, నియోలిథికు తరమునకు చెందిన శిలావస్తు సామగ్రియు, పాత్రలును ఉండుట యెట్లు పొసగును.' పైప్రశ్నలకు సమాధాన మనవసరము చివరకు వీరు అది వైదికనాగరికతనుండి వెలువడినదని చెప్పుటకు కాలమును ముందుకు జరుపలేము అని ముగించియున్నారు.

ఆచారవ్యవహారములు కాలక్రమమునుబట్టి మాఱుచుండు నను విషయమును మార్షలుగారు విస్మరించినారు. బాగుగా పరికించితిమేని యతని స్వజాతియే తన పూర్వపు దురాచారములు పెక్కింటి నిప్పుడు విసర్జించినది. అట్టి దురాచారములు కొన్ని యిప్పుడు గోచరింపకుండుటచే నధునాతనాంగ్లేయులు పదవశతాబ్దపు ఆంగ్లేయుల సంతతివారు కాదనుట యుచితమగునా?

వైదికార్యు లీరెండు నాగరికతలకును కూడ కారకులని చెప్పుట తగునాయని మార్షలుగారు మఱియొక ప్రశ్న వేసియున్నారు. ఇంతవరకు వ్రాసినదానిని బట్టి వైదికార్యులే సింధునదీ ప్రాంతములందలి ప్రాచీన నాగరికతకు కారకులని చెప్పవచ్చును. తరువాత సింధునదీ ప్రాంతముల నాగరికత నశించుటకు కారణము లేకపోలేదు. ఆర్యులు సైంధవనాగరికతను ప్రారంభించి, వరదలమూలముననో లేక మఱియే హేతువుచేతనో ఆ ప్రదేశము వారికి సుఖప్రదమయి యుండకపోవుటచే పంజాబునకు తరలిపోయిరి. తరువాత వారీప్రదేశమును మఱచియుందురు. అది మానవస్వభావ సహజము. కనుక సింధునదీ ప్రాంతమునందలి ప్రాచీననాగరికతకు ఆర్యులే కారకులని మనము చెప్పవలసియున్నది. ఈ వ్యాసమును ముగించుటకు ముందు, యీ వ్యాసము వ్రాయుటలో నాకు అమిత సలహాలనిచ్చిన, మా విశ్వకళా పరిషత్, చారిత్రకోపన్యాసకులగు శ్రీకుర్తి వెంకటారావు యం.ఏ.యల్.యల్.బి.గారికి నా కృతజ్ఞతాభివందనములు తెలుపవలసియున్నది.

—రాంపల్లి విశ్వేశ్వర రావు బి.ఏ (ఆనర్సు)



# కోడలిపిల్లా!

౧

దిగినది సంక్రాంతి, మదినె
దిగినది ఉబలాట మింటి తెరవున జూపుల్
నిగిడినవి ; పిలుపు లేదా
మగువా ? తలపున్నమాట మాటు వరప కే!

౨

"పండుగ నాటికిన్ పిలువపంపుదు తప్పక నానగారి నిన్
రం" డని బండివద్ద కనురాగమునన్ జనుదెంచిచెప్పె ; ఆ
తండును సమ్మతించెను గదా యిగనేమరి ? నేడొ రేపొ రా
కుండునె వార్తలవ్వి! యిటులొక్క మొగిన్ తొరసెందనెందు కే ?

౩

తొందర యేదియైన కలదో! జనకుం డట నద్దిగాక యే
సందడి నుండెనో! తనకు సాగమి ఉత్తరమేని వ్రాయడా ?
తందర యెందు కే! పిలుపు తప్పక వచ్చును ; నాటికీవు పో
కుందువె లేనిపోని బెగడొందకు మమ్మరో! రెండునాళ్ళలో.

౪

ఇదె తొలిసారి; నీ వతడు నిద్దరు నొద్దిక గూడి పోవుటల్
—గది కదిలించ నీదుగద క్రమ్మిన సిగ్గది పోయినేడు;—నె
మ్మది పదరోజులుండు ; డొకమాట, పడంతుక! విస్మరింప కీ
యదునున నాన్నతో నుడివి యాతని ముచ్చట దీర్చిపెట్టుమా!

౫

అడిగిన పటుచీర కొనరయ్యెను కాదని వాదులాడి నం
గడచినయేడు ; "ముందున కగత్యము కొందుము లే !" యటంచు నా
తడవకు నచ్చజెప్పినది తల్లి; నిజమ్ముగ నీయభీష్ట మి
ప్పుడు సమకూరు ; ఊరకయె పోవునె పండుగ వచ్చినందుకున్ ?

౬

గావిడ పెట్టెనుంచి అటుకం బడవైచిన బొమ్మలన్నియున్
బావయె దింప దుమ్ము దులుపన్వలె పోయినయంత ముందుగా
చావడి దిద్దితీర్పవలె జక్కగ, బొమ్మల కొల్వు కోసమై
ఓ వగలాడి! కాచుకొనియున్నవి నీకయి యెన్ని యోపముల్.

౭

'పిల్పడ' దన్నమాట చెవిపెట్టక అమ్మకు నొప్పబల్కి ఏ
యల్పమొ పిండివంటలు తయారొనరింపుము; కాక, రిత్తగా
నిల్పెదె బొమ్మలన్ ? చెలియ! నీ యనుజన్ములతోడ చిక్కితా
మెల్పన నుండకున్ననవి మ్రింగి గుటుక్కని పింతు రింతలో.

౮

కమ్మని కోరికల్ మనసుగ్రమ్మగ చేసెడి బొమ్మపెండ్లి; చి
త్తమ్మున కెక్కు నెచ్చెలులు, తమ్ముని యల్లరిచేత లాల కొ
ట్టమ్మున బుల్లిదూడ ఒకటా యిటువంటివి వేనవేలు నృ
త్యమ్ములు సేయుచున్నవి గదా అపుడే వలపూరు కండ్లలో ?

౯

మనసున నుంచుకొమ్మిది, అమాయికురాలవు నీవు; మాటలం
దున చెలికత్తెలే యడిగి నొక్కినచో విని నవ్వ మంతె కా
"కనయమువారు నన్ను విడ" రంచు వచింపకు; పెండ్లమన్నమా
త్రన యెవరైన క్రొత్తడిసి రాసుకయే తిరిగేరు కోమలీ!

౧౦

చెప్పుట కాదు మాటకయి చేడియ! ఆతని కున్నకోరికం
దప్పక సిద్ధిచేయు మటుదప్పిన యింటికి వచ్చినంతనే
దెప్పులు మానబోవ డిక తేపకు తేపకు, తోచినంతలో
గొప్పని పించుకొండి యిదిగో అతడన్నను చిక్కులివ్వియే.

౧౧

అదిగో నీ పెనిమిటి తా
నదియో ఉత్తరము చేతనిడుకొని యిటుగా
కదలి చనుదెంచుచుండెం
గొదువగునే తలఫు క్రొత్త కోడలి పిల్లా!

—బొడ్డు బాపిరాజు.

# భూలోక నరకాలు

నరకమనేది ఎక్కడో ఉండేదిట పూర్వము. ఎక్కడున్నదీ తెలియకపోయినా అది అంటే మాత్రం చాలా భయం మానవకీటకాలకు.

దాన్ని చాలా విపులంగా, విచిత్రంగా వర్ణించారు పెద్దలు. ఆ వర్ణనలవల్ల అది పాపముచేసినవాళ్ళు కొంత కాలం బసచేసి ప్రతిఫలం అనుభవించడానికి ఏర్పడ్డ ఒక స్టేషను లాంటిది.

అందులోకి జనం అనేక దేశాలనుంచీ, అనేక వైపుల నుంచీ ప్రతినిముషమూ వస్తూఉంటారు. పని కావడం తోటే తిరిగి వెళ్ళిపోతూఉంటారు.

పూర్వకాలంలో ఈ పాపంచేయడమూ, అందువల్ల పాపానుభవమూ చాలా తక్కువగా ఉండేవి. అందు వల్ల అప్పట్లో ఎవరికీ కనబడకుండా నిర్మించిన ఈ ఒక్కనరకమే సరిపోయేది అందరూవెళ్ళి పాపఫలం అనుభవించి పునీతులు కావడానికి'

ఈకలికాలం వచ్చింతర్వాతా బ్రాహ్మలు భ్రష్టులై వాళ్ళ నాశనమై దేశాన్ని నాశనంచేసినతర్వాతా ఆనర కానికీ, తదధిపతి యముడికీ తీరనిపనయి మరికొన్ని నర కాల ఆవశ్యకతకలిగింది. బ్రహ్మదేవుడు ఈ విషయం స్వయంగా గమనించి, మహాజన్లూ టీపార్టీలూ, లంచాలు ఆయనకేమీ అవసరంలేదు గనుక, ఇవ్వేవీ లేవు అనుకోకుండానే మరికొన్ని నరకాలు నిర్మించ డానికిన్నీ, అవి నరులసామీప్యంలోనే ఉండి వారికి దృష్టమవుతూ ఉండడానికిన్నీ ఆర్డర్లు జారీచేశాడు. అవి అసలు జరుపబడ్డవి. వాటినే భూలోకనరకాలనీ, ఆధునిక నరకాలనీ అంటున్నారు.

ఈ నరకాలు మూడురకాలు. రకానికి కొన్నికాపీలు అదేపంపినీన వేలకువేలు ప్రపంచమంతా వెలిసినయి. ఇప్పటికైనా ఈ నరకాలన్నిటివల్ల పాపానుభవం సరిగా జరుగుతున్నదీ లేనిదీ ఇంకా రిపోర్టు వెలువడలేదు.

అందులో మొదటిది రైల్వేస్టేషనులో మూడవతర గతి ప్రయాణీకుల శాల. ఎన్ని స్టేషనులున్నవో అన్ని నరకాలూ ఉన్నవన్నమాటే. ఆధునిక ప్రథమనరకాన్ని వర్ణించేటప్పుడు అసలు నరకంతో పోల్చదలుచుకుంటే వీనిలో ఏదిగొప్పదో చెప్పడం కష్టమే అసలు నరకం మనం చూడనికారణంచేత. కాని అసలు నరకాన్ని గురించి వ్రాయబడిన వర్ణనలనుబట్టి చూస్తే ఆధునిక ప్రథమనరకమే మిగులు అనవలసివస్తుంది.

అసలు నరకం చాలా పరిశుభ్రంగా ఉంటుందట. పాపులను శిక్షించడానికి ఎర్రగాకాలిన ఇనుపస్తం భాలూ, మంటలు మండే గోతులూ, అంపాలతో కోసే స్థానాలూ వగైరా ఉంటవట. పాపులు బాధమాత్రమే అనుభవిస్తారు. కోస్తేకారే రక్తమూలేదు. మంటలో వేస్తే నశించే శరీరమూలేదు. మిగిలే ఎముకలూలేవు. అనగా అసలునరకం స్మశానంలా ఉండదు. కసాయి వాళ్ళ జంతువులనునరికేస్థలంలా ఉండదు. కసాయి దుకాణంలా ఉండదు. జనంమాత్రం బాధ అనుభవి స్తారు. ఆ బాధ సహింపరానిది.

భూలోకనరకం వర్ణనాతీతం ఈ అభినవ ప్రథమ నరకాన్ని ప్రత్యేకంగా వర్ణించవలసిన అవసరము లేక పోయినా కావ్యానికి లోపంవస్తుందనైనా అపని చేయక తప్పదు.

ఒకప్రవాహం ఆ ప్రదేశమంతా ఆవరించి నాప రాళ్ళుపరచబడ్డ ఆచోటును తడిపివేస్తూ ఉంటుంది. అదే లాలాజలప్రవాహం. ఆ ప్రవాహమధ్యమున శ్లేష్మము పైకి తేలిఉంటుంది. కాలువేసిన వాడికల రెండువక్కలు కావలసిందే. అంతకుమించిన పాపాను భవమేమున్నదీ! ఆ ప్రదేశమంతా కాలుపెట్టడానికి వీలు లేని పరికరాలతో నిండిఉంటుంది. ఆ పరికరాలనే భగ వంతుడు పాపులను శిక్షించడానికి ఉపయోగిస్తాడు. అచ్చటచ్చట పచ్చపచ్చని, అప్పుడేవేయబడిన అరటి పళ్ళతోళ్ళు, మరికొన్నిచోట్ల ఎండి నల్లబడిపోయిన అరటిపళ్ళతోళ్ళు, ఇంకా ఇతరచోట్ల ఆరిపోని బీడీలు వగైరా పదార్థాలు ఆస్థానాన్ని ఆవరించి ఎప్పుడు

ఏపాపిని పునీతముచేద్దామా అని కాచుకొని ఉంటయి.

అసలు నరకం అన్నిరకాలజంతువులూ పాపఫలం అనుభవించి పునీతంకావడానికి ఏర్పడిన ప్రదేశమే అయిఉంటుంది. కాని దాన్నిగురించిన వర్ణనలవల్ల మనకు మానవులు మాత్రమే అందులో పాపఫలం అనుభవిస్తారని తెలుస్తూఉన్నది. అయితే మానవుడు ఇతర జంతువులకన్న తెలివిగలవాడు కావడంచేత బహుశః ఆ ప్రదేశాన్ని ఆక్రమించుకుని తాను దానికి స్వంతదారుడయి ఉండాలి మానవుల చేష్టలుచూసి భగవంతుడు నరకాన్ని మానవులకందరికీ అగ్రహారంగా ఇచ్చి ఉండాలి. ఏదెట్లాఉన్నా ఇతరజంతువులను అన్నింటిని త్రోసిరాజని మానవులే నరకాన్ని ఆక్రమించుచున్నారని తేలుతూఉంది.

అలాగే ఈనరకంగూడా మానవుల సామ్రాజ్యమే. ప్రతి మానవుడూ తాను ఈనరకానికంతా అధిపతినని అనుకుంటాడు. ఆరోజుకు ప్రథమంలో నరకానికి వేంచేసిన మహానుభావుడు అక్కడ ఉండే బల్లమీద తిష్ఠాయించి పడుకుంటాడు. మరెందరు అక్కడకు వచ్చినా లేవడు. జనం కిటకిటలాడుతున్నా, తానుమాత్రం లేచి ఇతరులకుగూడా చోటివ్వాలెనని అనుకోడు. ఆపైన ఒకచుట్ట వెలిగిస్తాడు. అది సరి క్రొత్తచుట్టకాదు అనుకోవడానికి తగిన నిదర్శనాలేమీ లేకపోయినా దానినుంచి వచ్చే వాసనమాత్రం పాకీదొడ్డివాసనను జ్ఞాపకంచేస్తూ ఉంటుంది. కొంతసేపు ఆ చుట్టను కాల్చికాల్చి తుభుక్కున ఇంత శ్లేష్మమిశ్రిత లాలాజలాన్ని తన తాత ముత్తాతలు సంపాదించిన ఆ ప్రదేశంలో వదిలిపెట్టుతాడు. ప్రక్కన ఇతరు లెవరన్నా ఉండి అని వాళ్ళమీద పడ్డా వాళ్ళు తనస్వంత చోటును అన్యాయంగా ఆక్రమణచేసినందుకు ప్రతిఫలమే ననుకుంటాడుగాని పొరపాటుచేశాననైనా అనుకోడు. అయితే ప్రతివాళ్ళూ ఆలాగే అనుకుంటారు గనుక ఆక్షేపేచీలేదు.

ఇంతలోనే ఒక నవనాగరిక యువకుడు తమలపాకు కిళ్ళీ నములుతూ ఈ నరకప్రవేశంచేస్తాడు చెయ్యగానే ఆయనకు ఎర్రని తన లాలాజలముతో ఆ ప్రదేశాన్ని అలంకరించాలెననే విశాలభావ మొకటి ఉత్పన్న మవుతుంది. ఆప్రకారమే చేస్తాడు. కాని ఆ లాలాజలంలో పడి పునీతుడయ్యే మానవుణ్ణి చూడకుండానే వెళ్ళిపోతాడాయన అచటనే మరొకచోటుకు. ఇంతట్లో కొందరు ధూమదేవతా ఉపాసకులు ఒక్కచోట సమావేశమయి తమ ఉపాసన ఆరంభిస్తారు. వారు ప్రసాదించిన ఆ ధూమం ఆ ప్రదేశాన్నంతా ఆవరించి నరకప్రవేశంచేసిన ప్రతి మానవుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

ఈ నరకాలలో ప్రత్యేకంగా చూడదగిన స్థలం ఒకటి ఉంటుంది. అక్కడక్కడ మనుష్యులు నీళ్ళు త్రాగడానికి నీళ్ళపైపులు, వాటిచుట్టూ పళ్ళాలు కట్టి ఉంటవి. వీటినే ఈనరకాలలో యాత్రాస్థలాలగానూ, దేవతాస్థానాలగానూ, ఎంచుతారు. మానవ ప్రపంచకంలో పుణ్యంచేసుకున్నవాళ్ళు యాత్రాస్థలాలకు వెళ్లినట్లే ఈనరకాలలో అక్కడికి జనం మరీ పాపంచేసినవాళ్ళుగాని వెళ్ళరు. వీటిని వర్ణించడానికి వేయితలలుగల వాడికిగూడా అలవిగాదని చెప్పుకుంటారు. ఆ అన్నపు మెతుకులూ, అపల్లుదోము పుడకల సేపాలూ, అనరాని కశ్మలమూ ఎంతపాపంచేస్తేనో అక్కడికి వెళ్ళడం. వీటితోడు పాదిపట్టిన ప్రదేశమూ పాపుల పాపానుభవానికి విశేషంగా తోడ్పడుతుంది.

ఆధునిక నరకాలలో రైలుస్టేషనుకే అగ్రస్థానము.

వీనిలో ద్వితీయం మూడవతరగతి ప్రయాణీకుల రైలుబండి. ఇది ఇంచుమించుగా మూడవతరగతి ప్రయాణీకుల శాలను పోలే ఉంటుంది. దానికి దీనికీ భేదం. అది ఒకేచోటున నిలకడగా ఉంటుంది. ఇది ఒక చోటునుండి మరొకచోటుకు కదులుతూ, తాను స్వయంగా పాపానుభవానికి సావకాశం కలుగజేస్తూ పాపులను ప్రథమనరకాలకు చేరుస్తూ ఉంటుంది.

ప్రథమ నరకాన్ని దర్శించిన పాపి తొంభయి తొమ్మిది పాళ్ళు ఈనరకాన్ని గూడా అనుభవిస్తాడు.

ఈనరకంలో మానవులు పాపం అనుభవించడానికి అన్నింటికి తోడు భగవంతుడు ప్రతి నరకానికీ ఒక పాకీదొడ్డిని ఏర్పాటుచేశాడు. అవసరాన్నిబట్టి—అవ

టకు వచ్చే పాపుల శిక్షాక్రమాన్ననుసరించి—ఆ దొడ్లను బాగుచేయడమో, బాగుచేయక పోవడమో నిర్ణయమవుతుంది సాధారణంగా బాగుచేయక పోవడమే విస్తారం. దానినుంచి బయలుదేరే ఒక వాసన పెట్టెను ఆవరించి ఉంటుంది. ఎక్కువ శిక్ష అనుభవించవలసిన పాపులు ఎక్కే పెట్టెలలో ఆ దొడ్ల తలపులు సొంతముగా తీసివేయబడి ఉంటవి.

ఈ నరకాలలో ఏర్పాటులు అదో క్రొత్తరకం. ఇందులో ప్రతినరకంలోనూ గల ప్రదేశానికి మించిన జనాన్నిపెట్టే ఏర్పాటు ఆశ్చర్యమయింది. ఏడుగురు పాపులు శిక్ష అనుభవించడానికి ఏర్పడ్డ నరకంలో ఇబ్బడి, మూడురెట్లు పాపులు అవసరాన్నిబట్టి చేరుతూ ఉంటారు. పాపం పెరిగితే మరేమవుతుంది? ఇందరు చేరినసమయంలో చోటుచాలకపోవడం అలాఉండగా, ఉక్కపోయడం, చెమట వాసనవేయడం, ఊపిరి ఆడక పోవడం మరికొన్ని శిక్షలు. ఇవి పైకి సామాన్యశిక్షలుగా కనపడినా అనుభవించేవాళ్ళకు తెలుస్తుంది వాటి సంగతిబాగా.

ఈలాంటి సమయంలో ఏ మామూలగ్రామం నుంచో ఏ పల్లెటిదిక్కునుంచో నరకప్రవేశంచేసిన పాపి తనచుట్టు వెలిగిస్తాడు. ఆధూమంసర్వత్రా వ్యాపించగా ఆ అలవాటులేని శుద్ధఛాందసుడు ఎంతపాపం అదివరలో చేసిఉన్నాడో నరకబాధ అనుభవిస్తాడు.

ఈ నరకంలో ఒకనియమముంది. నియమోల్లంఘనం అంటే ఎరగనిపాపులు దీన్నింతక్రమంగా ఆచరిస్తున్నారంటే ఆశ్చర్యంలేదు. ఈ నియమ మేమిటంటే-నరకంలోచేరిన మానవుడు కిటికీలోగుండాగాని, తలుపులోగుండాగాని బయటికి ఉమ్మి వేయగూడదు. ఈలాంటి నియమాలను జయప్రదంగా నెరవేర్చగలరనే భారతీయులకు అన్యదేశాలలో ఇంతపేరు ప్రతిష్ఠలు అబ్బుతున్నవి. ఈ పేరుప్రతిష్ఠలు నిలబెట్టుకోడానికే మనం సర్వవిధాలా పాటుపడవలసిఉంటుంది. ఒకానొక మహాపాపి ఈ నియమోల్లంఘనము చేస్తాడు కాని ఒక అస్పృశ్యుడులా చూడబడతాడు. నరకంలో స్పృశ్యాస్పృశ్యభేదం లేదనుకోవడానికి ఏమీ వీలులేదు అది సాక్షాత్తూ శాస్త్రాలమీద ఆధారపడిన ధర్మరాజురాజ్యం గనుక.

మిగతా అన్నివిషయాలలోనూ ఇది ప్రథమనరకాన్నే పోలిఉంటుంది.

ఇహ భూలోక తృతీయనరకం పట్టాలలోమాత్రం ఏర్పాటు చేయబడ్డది. ఇది ప్రత్యేకంగా చదువుకున్న పాపులకు మాత్రమే అని చెప్పవచ్చు. అయితే ఇతరులూ చెరిసగంగా వస్తూనేఉంటారు. అవి సినిమాహాలు—కంపెనీహాలులు. ప్రథమ ద్వితీయనరకాల లక్షణాలన్నీ ఇందులోనూ మూర్తీభవిస్తయి.

ప్రత్యేకలక్షణాలుమాత్రం చెప్తామంటే చాలు. సినిమాఅయితే రీలు రీలుకూ మధ్య, నాటకమయితే రంగం రంగానికీ మధ్య కొంత వ్యవధిఉంటుంది. ఆ సమయంలో యమధర్మరాజుభటులు 'తమలపాకు, బీడీ, సిగరెట్టు, సోడా' అని వికటాట్టహాసంచేస్తూ నరకప్రవేశం చేసిన మానవులమీద విరుచుకుపడతారు. వాళ్ళధ్వని కర్ణపుటాలు పగులగొట్టుతుంది. అకారణంగా మానవుడు వెర్రిత్తిగ గోలుపడతాడు. పాపానుభవానికి ఇంతకంటె వేరేశిక్ష అవసరంలేదు ఎంత పాపికైనా.

అదేసమయంలో పాపులసమూహం అంతా నవనాగరికులు కావడంచేత సిగరెట్లువెలిగిస్తారు. ఆ పాపుల పాపం ధూమరూపంగా పైకిపోయి వాళ్ళను పునీతులను చేస్తుందిగాని ఎంత అలవాటుగలవాళ్ళయినా ఆ ధూమప్రతాపానికి ఉక్కిరిబిక్కిరై నానాశ్రమలు పడతారు. అయినా విరివైన ఆ ధూమోత్పత్తి మానమనడానికి ఎవరికీ హక్కులేదు. చెప్పేవాళ్ళెవరు ఇంచుమించుగా అంతా చేసేవారయినప్పుడు? ఈ అలవాటు లేక మహాపాపంచేసిన మానవులకు భగవంతుడు ఈ ధూమపానంచేసే వారి మధ్య ఉండవలెననే శిక్ష విధిస్తాడు. ఆశిక్షకు సరిపోయేశిక్ష అసలు నరకంలోనైనా ఉండదు.

అప్పుడప్పుడు సినిమాహాలులలో టాకీలను చూపిస్తారు, వినిపిస్తారు. మాటలువినపడవని - గాలి పోతుందని తలుపులన్నీ బిడాయిస్తారు. ఎలెక్ట్రిక్ విసనకర్రలు ఉండవు, నవనాగరికులు సిగరెట్లు వెలిగిస్తారు. ఆలాంటి

నరకాలలో ఆప్రత్యేక పరిస్థితులలో ఉన్న స్థితిగతులను ప్రత్యేకంగా వర్ణించడం కంటె వారివారి ఊహలకు వదిలివేయడమే మంచిది. ముక్కుమూసుకున్నా ప్రాణంపోతుంది. ముక్కు మూసుకోకపోయినా ప్రాణంపోతుంది.

అసలు నరకంలో బాధపడడం ఉన్నా శరీరం బాధపడదని అనుకోవడం. ఈ భూలోక నరకాలలో బొందితో నరకం. బొందితో కైలాసానికి ఇది ప్రత్యర్థి.

మొత్తంమీద భగవంతుడు యముడికోర్టులు దేశమంతటా పెట్టించినందుకూ, నరులుకూడా విరివిగా వాటిని ఉపయోగించుకొని పాపఫలం అనుభవించి పునీతులవుతున్నందుకూ చాలా సంతోషించవలసిందే. ఇప్పుడు ఈ నరకాలలోఉన్న పరిస్థితులలో ఏమాత్రం మార్పుకలిగినా పాపానుభవానికి సరియైన ఏర్పాటు లుండవు గనుక ప్రభుత్వంవారు వీనిలో జోక్యంకలిగించుకొని ఏమీ మార్పులుచేయకుండా సనాతన ధర్మోద్ధరణమే పనిగా పెట్టుకున్న పుణ్యాత్ములు యావన్మం దీసమయం మించిపోకుండా నడుము బిగించి పనిచేయవలసిఉంటుంది అని మరిమరీ మనవి చేస్తున్నాను.

—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ.

# నిజరాగము

తేటగీత:

౧

శారదపుటహస్సు చివర సంజగడియ
నడకఁ జనునప్పు డొక వరి మడి నడుమను
అక్కజపడుచుఁ జూడంగఁ, జిక్కబలిసి
దుబ్బుకట్టి చేను పొడుగు నుబ్బుసూపె:
ఎంతయో మేర లేదది: యేడెనిమిది
చతురపు టడుగులుండును. చక్కఁ బెరిగి
యున్న యాయిక్క చెన్నుకు నున్నకడమ
చేనికిని భేదమెంతయో కానుపించు.
కడమ యాడుపు సూతుమ నిడుపు లేదు,
బలుపు లేదు కలుపు మొలిచి లవిసెడియె.—
దాన యజమాని పాలేరువాని నెంచి
"అల్లసన్న చీలిక యది వల్ల మాలి
నంతవలము బలిసియున్న దంతకు సరిఁ
బెంటపోసిన కడమ యీ పెడ నిదంత
పుగుగునా కేసి నటులున్న దరెరె! పసులఁ
బెట్టి మేపేసినావా? యదెట్టి ఖింత!"
యనుచు నడిగెను:—పాలేరు కనుగొనొక
వితపు వింతగ: ననియెను "వెఱ్ఱిపంట
పండు నయ్యిక్కయే పేట: ఎండదెపుడు;
తక్కనది యెప్పుడింతేను: ఇక్కడ కివు
డీసువచ్చి స్వయముగను నెఱుఁగఁదలచి
నారు గావున సెబుతుంటి—నరుఁడొకఁడెపు
డోయచటఁ బూడ్చఁబడెనట, యాయవసర
మయినదిగ మఱి సాగు సాగంగనీయ
నాటినుండి యాది బ్బది నాడెమైన
పంట పండఁ బెరుగునంట పచ్చపచ్చ:—
చెప్పువారూర: నయ్యల కొప్ప జెప్ప
రాని కారణ మదియని యే నియమము
కొలఁదిఁ జెప్పంగ లేదింతకున్న మున్న."

— — — —

వినుచు యజమాని యిట్లనె "పిట్టలకల
చెక్కపంట విడిచిపెట్టు డొక్కగింజ
కలవనీయకుడు మనగాదె నిలువనుండ
నీకు డాపంట: ఎవ్వాని ప్రాకట మృతి
నేటికిని బచ్చ మొలచుచు గాటపుఁ బ్రియ
మాత్మ కెఱిగించు నదియొ, పేరాలకింతు
నెఱుగవా!" యంచు ననియెను "ఎఱుగనండి
యెంతమంది యీ భువిపయి మృతులగుదురో
యంతమంది నీభువియందె యణగి మణగి

యుండఁజూడ్తురు గదయిది యొకని దనఁగఁ
జెప్ప జ్ఞాపకముండునే చెప్ప లేము.
పండినటువంటి పంట 'నూ'ర్పట్టుకు నని
తినుదుమని యాడె బాలేరు: "తెలివి తేట!
అట్టులగు నేని పంటంత పిట్టలకిడి
మనము మన్నుగొట్టుకు పోదుమా నడునడు"
అనుచు నాడెను యజమాని: యనియె నెవడొ
చేనిగట్టు గడ్డి పొడవు నానని నడి
'మనము పిట్టల మేనండి తినుగొలంది'

## ౨

అప్పటికి నిప్పటికి నెవ్వడల కుటీర
మంటుకొన, మంటమడిసెనో మహి నొకఁ
డెఱిగినట్టిదు గానరా డరయువారె
యందఱునుదావు: అనువారె యందఱున్న
'పోయె: పోయె: మంటనుబడి పోయె నెవడొ
మండి తగులడిపోయె' నం చండ నిలిచి.

— — — —

నేను సాంధ్యవిహృతి నడ నిశ్చిత మెది
యనుచుఁదలపోయుచును సూర్యన స్తమింపు
చూచికొనుచు సూర్యుఁడు దనశుద్ధమోక్ష
మునకుఁ దనసాంధ్యరాగంబు పొదలనిచ్చి
తనకుఁ దానందె పడుచు నంతంబు నొందు
గతిని భిక్షుండు చలిమంట కాగికొనుచు
తనకు దా రగుల్పుక పెడకునికి గుడిసె
యంటుకొనఁ దెలియకతండు నంతరించి
యుండి యుండునటంచును నూహసేతు :
అర్ధనిశనంట నిశ్శబ్ద మర్థ మీని
యట్టి చీఁకటి బయలున వట్టిబూది
యైనదఁట యొకమనిషి మేను. హత్య
సేసి యొరునందు గాల్చిరాచె నటులెవరొ
జాడ తెలియని మచ్చునం చాడెదు జను
లున్న—వారితో నే ననుకొన్న దెల్ల
చెప్పుచుం గొనరుగ నింక నొప్పచెబుదు
'శాంతి సెప్పుడయ్యాత్మకు శాంతి సెప్పు
డెప్పుడేన్ బోవును శరీర మప్పగిదిని
పేరుకూడ మాసి నుసియగా వారలెవరు ?
ఎవ్వడో యెవ్వతో యేద్వ నిల మిగులుదు
రల్ల యొడలికిఁ బెండ్లాము పిల్లలెవరు ?
లేరు ; లే దూరులే దిల్లులేదు వెలితి,
యులకు, నయ్యది యట్టఁల దృశ్యమైన :
శాంతికూడఁ జెప్పవలదు : శాంతి చెప్ప
దాన నొకపద మొకవ్యక్తి తనము దెచ్చి
పెట్టువార ంపుగుదుమే మొ విశ్వపుహృది.

## ౩

తాళములతోడ భజన మాత్మకు నసంగ
బిగ్గఱగఁ జేసికొనుచును బెద్దనగరు
నిండు సందడి వీథినే కుండనిష్ఠ
ముందు రాజఁ, గటుకుపైనిఁ బోయినజను
మోచికొనిపోవుచుండిరి : ముగ్ధుఁడనయి
చూచినాడను. ఆగుంపు నుంతలోన
వీథితిరిగి వేఱొక వీథి వెడలిపోయె
మనుజులావీథిఁ గనియుంద్రు మఱిమఱిమఱి
ఆర్ద్రభావానఁ గాంతురా యపరదిశను
నమల గోదావరాసిక తాంచలమున
స్నానమాడు లాతి జనమ్ము చన్నవాని.
నెందఱేన్ జాలిఁగాంతురం చెంచితి నెద.
ఏమ ? వెళ్లినకొలఁదిని నెక్కుడుధ్వని
వినబడంగను జొచ్చె భజనము ! అద్ది
ఆత్మకొఱకైన నప్పుడే యాత్మ తాను
దేహమింకఁ గాల్పఁబడకె మోహముసెడి
పోవునట్టిదె విన లేని పోకడునటు
లంతగట్టిగ భజనంబు లమరుచున్న ?
ఆత్మకొఱకు గాదది పరమాత్మకొఱకె.
ఎక్కడెక్కడి పరమాత్మ నొక్కెడకట
పిలుచుచున్న దాభజనంబు పిలుచుచుండె.
పాఠకా ! నీహృది రవంత భాగమందు
నల్ల పరమాత్ముఁడే యున్న నవధరింపు.

—కవికొండల వేంకటరావు.

# సూరతు 'కాఫీ హొటలు'

[టాల్‌స్టాయి కథకు అనువాదము]

సూరతుపట్టణంలో వుండేది ఒక కాఫీహోటలు. దేశదేశాలనుంచి అనేకమందివచ్చి, భోజనాని కక్కడ చేరేవారు. అ పెద్ద సమూహంలో అనేకవిషయాలను గూర్చి వింతవింత ప్రసంగాలు జరుగుతూ వుండేవి. దేశవార్తలు చెప్పుకునేవాళ్ళు కొందరు; ఉపన్యాసాలిచ్చేవాళ్ళు కొందరు; వాటిని విమర్శించి సమర్థించేవాళ్ళు కొందరు; కాదని ఖండించేవాళ్ళు మరికొందరు —ఇట్లా అందరూ కలిసి కూర్చున్నంతసేపూ, అనుదినం, యేదో ఒక వాద ప్రతివాదం జరుగుతూవుండేది.

ఒకరోజున పారసీక తత్వవేత్త ఒక డక్కడికి రావటం తటస్థించింది. అతడొక విద్వాంసుడు భగవంతుని స్వరూపం, స్వభావం యెట్టివో పరిశోధనద్వారా స్థిరపరచవలెననే ప్రయత్నంలో జీవితమంతా గడిపినవాడు. ఈ మహద్విషయాన్ని గూర్చి వ్రాయబడ్డ గ్రంథాలెన్నో చదివినాడు. అందునుగూర్చి కొన్ని పుస్తకాలు స్వయంగాకూడ వ్రాశాడు. భగవంతుని గూర్చే నిరంతరం తీవ్రచర్చ చేస్తుండేవాడు. అతడు చదివిన గ్రంథాలెన్నో లెక్కలేవు. ఇక నీవిషయాన్ని గూర్చి తాను వ్రాసినదిచూస్తే అంతులేని వ్రాత వ్రాశాడు. ఇట్లా చదివిచదివి, వ్రాసివ్రాసి, చివరకు మతి చెడగొట్టుకున్నాడు. మొదలూ తుదీ కనిపించని పెద్ద గందరగోళంతో నిండిపోయింది మనస్సంతా. చివరకు భగవంతు డొకడున్నాడనే విశ్వాసంకూడ నశించిపోయింది. ఈసమాచారంవిని ఆదేశపు రాజు యితనిని దేశంనుంచి వెళ్ళగొట్టినాడు.

ఈ సృష్టికంతకూ ఆదికారణ మేదో తెలుసుకుందామని జీవితకాలమంతా ఆలోచించి, తర్కవితర్కాలు చేసి బహుకష్టపడ్డాడు పాపమీశాస్త్రజ్ఞుడు. చివరకు మతికూడ చెడగొట్టుకొని తెంపులేని మనోకలవరంలో బడ్డాడు. తన కిదివరకుండిన విచక్షణజ్ఞానం పూర్తిగా తన్ను విడిచిపోయిందని తెలుసుకోవలసిన దానికి బదులుగా, ఈమహావిశ్వాన్ని శాసించే ఉత్కృష్టవస్తువు, తన కతీతమైనది, మరేదీలేదని చెప్పే అహంకారంలో బడ్డాడు.

ఈ శాస్త్రజ్ఞునివద్ద ఆఫ్రికానుంచి తెచ్చిన బానిస ఒక డుండేవాడు. తాను పోయిన చోటికల్లా యీ బానిసను కూడ తనవెంటతీసుకొని పోతుండేవాడు యజమాని. ఆరోజున కాఫీహోటలుకు యిద్దరూ కలిసే వచ్చారు. శాస్త్రజ్ఞుడు కాఫీశాలలో ప్రవేశించాడు. బానిసమాత్రం బయటనున్న రాతిబండమీద, యెండలో, కూర్చున్నాడు. తత్వవేత్త లోపల కుర్చీపీటమీద కూర్చుని, ఒకగిన్నెడు నల్లమందు ద్రావకం తెప్పించుకొని తాగినాడు. నల్లమందు తాగుడు అతనికి చిరకాలాభ్యాసం. తాగీ తాగటంతోనే మైకం తలకెక్కింది. మనిషిలో ఒకవిధమైన ఉద్రేకం, చురుకుదనం పుట్టింది. ఆపైన వాగ్ధోరణికూడ యెక్కువయింది. బయట తలుపుపక్కను కూర్చున్న సేవకుని పలకరించి యిట్లన్నాడు:


'ఏమిరా, బానిసకొడకా! దేవుడున్నాడంటావా, లేడంటావా? ఏమిటి నీయభిప్రాయం?'

'ఆహా, ఉన్నాడండీ—దేవుడు! ఉన్నాడు, నిస్సందేహంగా.' అని జవాబుచెపుతూ బానిస తన పటకాకింద చేయిపెట్టి చిన్న కొయ్యబొమ్మ నొకదానిని బయటికి తీశాడు.


'అయ్యా, యిదిగో! ఇదేనాకు దేవుడు—నేను పుట్టిననాటినుండి నన్ను కాపాడి కనిపెట్టినదైవం. మా దేశంలో ప్రతివాడూ ఒకానొక చెట్టుకు పూజ చేస్తాడు. ఈ దేవుడూ ఆచెట్టుకొయ్యతోనే చేయబడ్డాడు.'

ఈ సంభాషణవిని అక్కడ చేరినవాళ్ళందరూ ఆశ్చర్యపడ్డారు. శాస్త్రజ్ఞుడు తన బానిసనడిగినప్రశ్నే వాళ్ళ కాశ్చర్యంకలిగించింది. బానిసచెప్పిన జవాబు మరింత విపరీతంగా కనబడ్డది.

అ సమావేశంలో ఒకానొక బ్రాహ్మణుడున్నాడు. బానిసచెప్పిన జవాబు వినగా కోపంవచ్చిం దాయనకు.



'కృషితో నాస్తి దుర్భిక్షమ్.'



ఆలయ ప్రాంగణమున

[శ్రీ వరదా వెంకటరత్నముగారు చిత్రించిన త్రివర్ణ చిత్రమునుండి]

తటాలునలేచి నిలబడి బానిసను సంబోధిస్తూ యిట్లన్నాడు: ‘ఓరి దౌర్భాగ్యుడా! ఇట్లాచూడు, దేవుణ్ణి యెవరైనా పటకాకింద బెట్టుకొని పోగలరటరా? ఏమిటింత మూర్ఖత! దేవుడొక్కడు. అతడే పరబ్రహ్మ. యీతత్ప్రపంచానికీ సృష్టికర్త అతడే. అతడే ఆదిశక్తి, సర్వశక్తుడుకూడ. ఆయనను పూజించటానికే మహోగంగ వొడ్డున గొప్పగొప్ప దేవాలయాలెన్నో ప్రతిష్ఠించబడ్డవి. ఆ మహాదేవుని నిజమైనభక్తులు బ్రాహ్మణులు. వారే అతని నా దేవాలయాలలో ఆరాధిస్తారు. భగవంతుని గురించి నిజంగా వాళ్ళకేతెలుసును;మరెవ్వరికీ తెలియదు వేలకువేలు సంవత్సరాలు గడిచిపోయినాయి, ఎన్నో విప్లవాలువచ్చి ఎన్నోసంఘాలు తారుమారైనాయి, కాని మా బ్రాహ్మణ పురోహితులుమాత్రం యెన్ని అవాంతరాలనైనా యెదుర్కొనినిలిచి, తమ ప్రతిభనూ, అధికారాన్నీ నిలుపుకోగలిగినారు చూచావా? అంత ప్రజ్ఞ వాళ్ళకెందుకున్నదో తెలుసునా! ఆ బ్రహ్మయే వాళ్ళను ఆదినుంచీ కాపాడుతున్నాడు కనుక.’

బ్రాహ్మణు డీవిధంగా బానిసయొక్క మతాన్ని ఖండిస్తూ, తాను చెప్పిన మాటలనువిని అక్కడనున్న వాళ్ళందరూ తన బ్రాహ్మణసిద్ధాంతాన్ని ఆమోదించారనే నిండుధైర్యంతో కూర్చున్నాడు. కాని బ్రాహ్మణుడు కూర్చున్నతక్షణం ‘యూదీ’వర్తకుడొకడు లేచి బ్రాహ్మణుని ఖండించటం మొదలుపెట్టినాడు.

‘కాదు, కాదు, నిజమైన భగవంతుని ఆలయం అసలు హిందూదేశంలోనే లేదు. భగవంతుడు బ్రాహ్మణులను కాదు కాపాడేది. నిజమైనదేవుడు బ్రాహ్మణుల దేవుడు కాదు. అబ్రహాము, ఐజాకు, జేకబుల దేవుడే దేవుడు. జాతులలోకల్లా ‘ఇజరాయీల’ జాతే భగవంతునిదృష్టిలో యెన్నికగన్న జాతి. ఆ వొక్కజాతినే అతడతిజాగ్రతతో, అభిమానంతో కనిపెడుతూవుంటాడు. మరేజాతినీ రక్షించడు. సృష్ట్యాదినుంచీ మా ఒక్కజాతే దేవునికి ప్రియతమమైనది. ఇప్పుడు మాజాతి ప్రపంచంమీద చెల్లాచెదరై వున్నదంటే, దాని యర్థమేమో తెలుసునా? భగవానుడు మమ్ము పరీక్షచేయడానికే యిట్లాచేశాడు. తనవాళ్ళందరినీ ఏదో ఒకనాడు తిరిగి తనవద్దను చేరదీసుకుంటాడు. మమ్ములనందరినీ తిరిగి జెరుసలేములోచేర్చి యేకజాతిగా,—సమిష్టికుటుంబంగా చేస్తానని వాగ్దానంచేసేవున్నాడు. జెరుసలేము దేవాలయాన్ని పూర్వకాలపు ప్రపంచానికంతకూ శిరోభూషణమని చెప్పవచ్చు. పూర్వం దానికుండే నిరుపమానమైన ప్రతిభ తిరిగి చేకూరబోతున్నది. అప్పుడు మా ‘యిజరాయిలు’ జాతి మిగతజాతులన్నిటిమీదనూ అధ్యక్షతవహించి పృథ్వినేలుతుంది—ఇదినిశ్చయం!’

అని చెపుతూ యూదుడు బొటబొట కన్నీరు కార్చినాడు. అంతటితో తన ఆవేశాన్ని ఆపుకోలేక యింకా యేదో చెప్పబోయినాడు. కాని యీలోగా ఇటలీదేశపు క్రైస్తవమత ప్రచారకుడొకడు అతనిమాట కడ్డువచ్చి తానిట్లా చెప్పటం ప్రారంభంచేశాడు:

‘నీవుచెప్పేదంతా అసత్యం. నీవు దేవునికే ద్రోహబుద్ధిని ఆరోపిస్తున్నావు. ఇతరజాతులన్నిటికంటె అధికంగా ఒక్కనీజాతినే అతడెట్లా ప్రేమిస్తాడు? ఏమయ్యా—నీ సాహసం! పూర్వమెప్పుడో ఒకప్పుడు మీ ‘యిజరీయీల’మీద ప్రత్యేక అభిమానముంచినా ఉంచివుండవచ్చు—ఉంచినాడే అనుకో, కాని మీ జాతియంతా యిప్పటికి పందొమ్మిదివందల సంవత్సరాల క్రిందట దేవుని ఆగ్రహానికి గురియైనారు. ఆయన ఆగ్రహమే మీ జాతినంతనూ ధ్వంసంచేసి, అక్కడకొందరినీ యిక్కడకొందరినీ విసరివేసింది. అందుచేతనే మీ మతం యితరుల నాకర్షించి చాలమందిని మీలో కలుపుకోలేకపోతున్నది. మీ మతమిప్పుడు యెక్కడనో, అక్కడక్కడ, నామమాత్రంగా పడివున్నదేగాని, ప్రపంచంనుంచి పూర్తిగా నిర్మూలమైపోయిందనే చెప్పవచ్చు. ఈశ్వరుడేయొక్కజాతియెడలనూ పక్షపాతం చూపడు. కాని ముక్తిని ఆశించే సమస్తమానవకోటిని విశ్వజనీనమైన ‘రోమన్ కేథలిక్ చర్చి’లోనికే ఆయన ఆహ్వానిస్తున్నాడు. ఈ రోమను చర్చియొక్క విశాల ఆవరణనుదాటి బయట మరెక్కడనూ మనుష్యుడు ముక్తిని పొందజాలడు.’

ఒకమూలనుండి ‘ప్రొటెస్టెంటు’ (సంస్కరణ) క్రైస్తవమత ప్రచారకుడొకడు ఈ యుపన్యాసం విని బహు కంటగించుకుంటూ వెలవెలబోయి చూడటం ప్రారంభించాడు. ఇటలీక్రైస్తవుడు తాను చెప్పడం

ముగించి సరిగా కూర్చోకమునుపే ప్రొటెస్టెంటు మత ప్రచారకుడు చటాలునలేచి అతనిని తీవ్రంగా ఖండించటం మొదలుపెట్టినాడు:

'మీమతంలో జీవులకు ముక్తివున్నదని నిశ్చయంగా నీవెట్లా చెప్పగలవు? ఇది చాలబాగున్నదే—ఏమీ నీ సాహసం! పవిత్రమైన 'బైబిల్' ధర్మశాస్త్ర ప్రకారం భగవంతుని సేవించేవాళ్ళకే ముక్తికలుగుతుంది. కృత్రిమరహితమైన ఆత్మద్వారానే భగవదారాధన చేయవలెనని జీసను శాసించే వున్నాడు. అదొక్కటే మార్గం, మరొకమార్గం లేనేలేదు!'

ఇదివిని తురుష్కుడొకడు లేచాడు. నూరతు దిగుమతిపన్నుల ఆఫీసులో ఉద్యోగస్థుడాయన. అంతవరకూ పొగగొట్టం నోటిలోపెట్టుకొని స్తిమితంగా కూర్చున్న వాడల్లా క్రైస్తవులిద్దరి యుపన్యాసాలూ విని సహించలేకపోయినాడు. వాళ్ళకంటేనూ, వాళ్ళ మతంకంటెనూ తనకూ తన మతానికీ చాల ఆధిక్యత వున్నదని రుజువుచేసి వాళ్ళను తిరిగి నోరెత్తకుండ చేయగలననే గర్వంతో లేచి యిట్లన్నాడు:

'మీ రోమనుచర్చినిగూర్చి మీకున్న అభిమానమంతా వట్టి దురభిమానమనీ, డంబాచారమనీ నేను చెప్పగలను. ఇప్పుడా?—పన్నెండువందల సంవత్సరాలయింది, దాని వూరూ పేరూ అంతరించిపోయి. దానిని బయటకు సాగనంపేకాదూ, మహమ్మదువారి ఉత్తమ సాంప్రదాయం విఖ్యాతిజెందింది! ఐరోపా ఖండంలోను, ఆసియాలో యెంతో నాగరికతా, విజ్ఞానమూ సంపాదించిన చైనా దేశంలో కూడ మహమ్మదీయ మతమెట్లా వ్యాపించి పోతున్నదో మనం చూడటంలేదా? భగవంతుడు యూదులను వదలిపెట్టివేశాడని మీయంతట మీరే అంటున్నారుకదా! దానికి తార్కాణంగా ప్రపంచంలో యెక్కడబడితే అక్కడనే యూదులు వంచింపబడుతున్నారిప్పుడు. వాళ్ళమత మెక్కడా వ్యాపించడమేలేదు. కాని మహమ్మదీయమత మెట్లావున్నదో చూడండి! ఆమతంలోవున్న సత్యాన్ని, దాని అమోఘత్వాన్ని, మీరొప్పుకొని తీరవలె. ఎందు కొప్పుకోరు? ఈమత మెంతెంత దూరానికి యిప్పటికింకా వ్యాపిస్తూ ఖ్యాతిపొందుతున్నదో ప్రత్యక్షంగా మీరే చూస్తున్నారు. అట్లా చూస్తూకూడ మీరు దానిని నిర్లక్ష్యం చేయటంకంటె విపరీతం మరేదీ వుండబోదు. మహమ్మదుయొక్క అనుచరుడైతేనే తప్ప మనుష్యునికి వేరు ముక్తిలేదు. ఇప్పటి కవతరించిన ప్రవక్తలలో కడపటి ప్రవక్త ఆయనే.—అయితే జాగ్రతతో గమనించవలసిన ముఖ్యవిషయం మరొకటున్నది: ఊరక మహమ్మదీయుడైతేనే చాలదు. అందులో 'ఓమార్' యొక్క అనుచరులు మాత్రమే ముక్తికి పాత్రులు. 'అలీ' యొక్క శిష్యులు వట్టి దుర్మార్గులు, మతభ్రష్టులు, స్వామిద్రోహులు!'

మొదట మాట్లాడిన పారసీక తత్వవేత్త 'అలీ' అనుచరులలో వొకడు. అలీని, అతని సాంప్రదాయాన్ని నిందించగానే అతనికి కోపంవచ్చింది. దిగుమతి సుంకాల వుద్యోగికి గట్టిగా జవాబుచెపుదామని లేచాడు. కాని అప్పటికే అక్కడచేరిన వివిధమతస్థులలో పరస్పర కలహాలు పుట్టి, తీవ్రమైన వాదోపవాదాలలోబడి రొదచేయడం మొదలుపెట్టినారు. అబిసీనియా క్రైస్తవులు కొందరు, తిబెతుదేశపు బౌద్ధస్వాములు (లామాలు) కొందరు, ఇస్మాయిల్ శిష్యులు, అగ్నివుపాసకులు—యింకా యెందరెందరో చేరి కూర్చున్నారక్కడ. పరమాత్మస్వరూపం, ఆయనను పూజించే విధానం—యీ మొదలైన విషయాలను గురించి అంతులేని వివాద బయలుదేరింది. జాతులలో కల్లా తమజాతి ఒక్కటికి మాత్రమే భగవంతుని పూర్తిగా తెలుసుకొని, నిజమైన పూజచేస్తున్నదని యెవరికి వారే చెప్పకొనటం ప్రారంభించారు.

అక్కడున్న ప్రతివ్యక్తీ తనంతటతాను కల్పించుకొని చర్చలో దిగినవాడే. ప్రతివాడూ నోరున్నంతవరకు పెద్దపెట్టునఅరుస్తూ, మండుతున్నమంటకు మరి నాలుగుచితుకులు తగిలించేవాడే. కోలాహల మంతకంతకు ప్రబలి పెద్దదయింది. ఒకరిమాట వొకరికి నచ్చకుండ, ఒకరనేది ఒకరికి వినబడకుండ తగవులాట పెరిగిపోయింది. ఈ వాగ్యుద్ధంలో యేమాత్రపు జోక్యమూ కలిగించుకొనకుండా ఒక్క వ్యక్తిమాత్రం నిశ్శబ్దంగా ఒకమూలకూచుని చూస్తున్నాడు. తేనీరుతాగుతూ, మౌనంవహించి, యితరుల వాదప్రతివాదాలు శ్రద్ధగా

వింటూ కూర్చున్నాడు. ఈ యువకుడు చైనాదేశ స్థుడు. 'కన్‌ఫ్యూషియస్' తత్వజ్ఞుని శిష్యుడు.

చైనాయువకుడు మాట్లాడక కూర్చుండటం తురుష్కుడుకనిపెట్టి, నెమ్మదిగా అతనిపక్కకుచేరి ప్రార్థేయపూర్వకంగా యిట్లన్నాడు:

'ఏమినాయనా! నీవుచెప్పు న్యాయం! నీవు తప్పక నా అభిప్రాయంతో యేకీభవిస్తావనుకుంటాను. నీవు మాట్లాడటంలేదు గాని, నీ యభిప్రాయం చెప్పవలసి వస్తేమాత్రం నా సిద్ధాంతాన్నే ముమ్మాటికీ సమర్థిస్తావని నా దృఢనమ్మకం. మాదేశంనుంచి యిక్కడకు వచ్చే వర్తకులందరూ నా సహాయాన్నపేక్షించి తరుచు నావద్దకే వస్తూవుంటారు. బయటనుంచి యెన్నెన్ని మత విశ్వాసాలువచ్చి చైనాలో కాలుబెట్టినా, విదేశీయులు మతాలలోకల్లా మహమ్మదీయమతమే శ్రేష్టమైనదని చెప్పి దానినే స్వీకరిస్తారని మాదేశపు వర్తకులెందరో చెపుతూవుంటారు. ఇది నీకుమాత్రం తెలియకుండావుంటుందా? నీవుతప్పక నా అభిప్రాయాన్నే ఆమోదిస్తావనిన్నీ, భగవంతునిగురించీ ఆయన ప్రవక్త మహమ్మదునుగురించీ వీరందరికీ తెలియజెపుతావనిన్నీ నిన్ను కోరుతున్నాను.'

'అవునవును—అయ్యా, చెప్పు, చెప్పు! ఈ విషయంలో నీ యభిప్రాయమేమో చెప్పు, వింటాము. నీ వింతసేపూ కొంచెమైనామాట్లాడలేదే!'అంటూ మరి కొందరుకూడా అతనినే బలవంతంగా అడగటం మొదలుపెట్టినారు.

చైనాయువకు డొక్కక్షణం కండ్లుమూసుకొని ఆత్మావలోకనం చేసుకున్నాడు. తిరిగి కండ్లుతెరచి చొక్కాచేతులు కొంచెంపైకి మణుచుకున్నాడు. తరువాత చేతులురెండూ కట్టుకొని నెమ్మదిగా మాట్లాడటం మొదలుపెట్టినాడు:

'అయ్యా, మతవిషయాలనుగురించి, ఈశ్వర విశ్వాసాన్నిగురించి మనలో మనకు సఖ్యతలేకపోవటానికి మనలో ప్రబలివున్న అహంకారమే ముఖ్యకారణం. మీకొక కథ చెపుతానువినండి. తద్వారా మనకీవిషయం చక్కగా బోధపడగలదు.

'నేనీ దినమే యిక్కడ ఓడదిగినాను. మధ్యదారిలో మంచినీరు తీసుకొనడానికి మా 'స్టీమరు' సుమిత్రదీవికి తూర్పుతీరాన్ని లంగరు వేయబడ్డది. చాలమందిమి ఓడదిగి గట్టుకువచ్చాము. అది మిట్టమధ్యాహ్నసమయం. ఎండతీక్షణానికి నిలువలేక కొందరముపోయి ఒడ్డు పక్కనున్న కొబ్బరితోటలో నీడకు జేరి కూర్చున్నాము. అక్కడికి సమీపాన్నే కనిపిస్తున్నదొక పల్లెగ్రామం. అక్కడ చేరినవాళ్ళందర మొకజాతివాళ్ళము గాని, ఒకదేశంవాళ్ళము గాని కాము. నానాదేశస్థుల మొక చోటకలియటం తటస్థించింది.

'మే మక్కడకూర్చుండగా గుడ్డివాడొకడు మా వద్దకువచ్చాడు. సూర్యబింబంవంక విడువకుండా చాల సేపు చూస్తుండేవాడట. అతని కండ్లుపోవడానికదేకారణమని తరువాత మాకు తెలిసింది. సూర్యుడంటే యేమో తెలుసుకొని, సూర్యుని వెలుతురునుపట్టుకొని పోగుచేదామనేయుద్దేశంతో మొదట బయలుదేరినాడు.

'ఈ సమస్యనెట్లాగో సాధించవలెనను పట్టుదలతో దినందినం అదేపనిగా గంటలతరబడి సూర్యునివంక దృష్టిని నిలిపి చూడటమే సాధనగాపెట్టుకున్నాడు. అట్లా చూడగాచూడగా కండ్లురెండూపోయి అంధుడైనాడు.

'సూర్యునివంక తదేక దీక్షతో చూస్తూ తనలో తానిట్లనుకునేవాడు : 'సూర్యునివెలుతు రొక ద్రవపదార్థం కానేరదు. ద్రవపదార్థమే అయితే నీటివలె ఒక పాత్ర నుండి మరొక పాత్రలోనికి పోయడానికి వీలుండవలె కదా! గాలివీచినప్పుడు నీరు కదిలినట్లు అదీ కదలవలసినదే. దానిని అగ్నివంటి వస్తువుగా భావించటం కూడ సరికాదని తోస్తుంది. నిప్పైతే, నీళ్ళుపోయగానే ఆరిపోవద్దామరి? పోని అది అదృశ్యమైన ఆత్మవంటి వస్తువనికూడ చెప్పలేము. కంటికి స్పష్టంగా కనబడే వస్తువును ఆత్మవస్తువనడ మెట్లా? పోనీ స్థూలపదార్థమందామంటే అదీకాదు. స్థూలవస్తువులన్నీ ఒకస్థలం నుంచి మరొకస్థలానికి కదల్పబడేటట్లు యిది కదల్పబడగలదా—లేదు అందుచేత ఈయద్భుత వస్తువు అసలేమిటో తెలియటంలేదు. ఘనపదార్థంగాదు, ద్రవ పదార్థంగాదు. అగ్నిగాని, అదృశ్యభూతంగాని కాదు. కనుక సూర్యుడనబడే యీవింతవస్తువు యేదీకాదనే

చెప్పవలసివస్తున్నది!'

'ఈవిధంగా తనలోతానే తర్కవాదం చేసు కుంటూ, దినమంతా సూర్యునివంకనే చూస్తూ, సూర్యుని గూర్చి యెడతెగని ఆలోచనచేస్తూ కాలంగడపి కండ్లేగాకుండా చివరకు మతికూడ చెడగొట్టుకున్నాడు. పూర్తిగా గుడ్డితనం రావడంచేత, యిక సూర్యుడేలేడని నిశ్చయించుకొని నాస్తికుడైనాడు.

'ఈ యంధునివెంట సేవకుడొకడున్నాడు. యజమానిని నడిపించుకొనివచ్చి కొబ్బరిచెట్ల నీడను కూర్చుండబెట్టినాడు. కిందరాలిన యెండు కొబ్బరికాయ ఒకటి తెచ్చాడు. కొబ్బరిపీచుతో ఒక వత్తి చేసి, లోపలి కురిడీ నలగగొట్టి నూనెతీశాడు. తైలం కొబ్బరిచిప్పలో పోసి, వత్తితడిపి, దీపం వెలిగించాడు. సేవకు డీపనిలోవుండగా యజమాని నిట్టూర్పువిడిచి సేవకునితో యిట్లన్నాడు.

'ఏమిరా, సూర్యుడనేవస్తువు లేదని నీతోచెప్పినాను కాదా? ఉన్నదంటావా నీవు? ఇప్పుడెంత చీకటిగా వున్నదోచూడు! కాని మనుష్యులందరూ ఉన్నాడు వున్నాడంటారు. అదేమో నాకర్థం కావటం లేదు...ఉన్నట్లయితే అదేమో, దాని ఆకార మెట్లా వుంటుందో స్పష్టంగా చెప్పగలిగినవాడేడి?'

'సేవకుడు జవాబిచ్చాడు: 'అయ్యా సూర్యుడెటువంటివాడో నేను చెప్పలేను. వెలుతురంటే మాత్రం నాకు తెలుసుననుకుంటాను. ఇదిగో, యిక్కడొక దీపం వెలిగించాను. దీనితో మనకెన్నెన్ని పనులు నెరవేరుతాయో చూడండి! చీకటిలో కనబడని వస్తువులన్నిటినీ దీపపువెలుతురులో చూచి గుర్తుపట్టగలము కదా! మీకు నాచేతనైన సేవంతా చేయగలగటానికీ దీపమే ఆధారం.'

'అనిచెపుతూ సేవకుడు దీపపుచిప్పను పైకెత్తి పట్టుకొని 'ఇదే, నాసూర్యుడ'న్నాడు.

'ఆసమయాని కక్కడనే కూర్చున్న కుంటివాడొకడు యీమాటలువిని, నవ్వి, గుడ్డివానితో యిట్లన్నాడు:'

'ఏమయ్యా, నీ జీవితమంతా గుడ్డితనంలోనే గడిచి పట్లున్నదే! సూర్యుడంటేనే తెలియకుండాపోయేటంత పుట్టుగుడ్డివా అయ్యా నీవు? అయితే నేను చెపుతానువిను! సూర్యుడొకపెద్ద నిప్పుముద్ద. ప్రతిదినమూ ఉదయాన సముద్రంలోపుట్టి, మా దీవిలోనున్న కొండల చాటుకు సాయంకాలం దిగిపోతాడు. దినందినం మేమందరమూ చూస్తూన్నదృశ్యమేయిది. నీకు కండ్లుంటే నీవూ మావలెనే చూడగలిగివుందువు?'

'ఈ సంభాషణవిని అక్కడిగుంపులోవున్న జాలరివాడొకడులేచి యిట్లన్నాడు: 'అయ్యా, మీరెవరో నాకు తెలియదు. మీరెప్పుడూ మీ ద్వీపాన్ని దాటి బయటికి పోయినట్లు తోచదే! పాపం, మీకా కుంటితనమే లేకుండావుండి, మీచిన్న యావరణ దాటి నావలె నావనెక్కి కొంచెం పెద్దప్రయాణాలుచేసి వుంటే యిట్లా అనిఉండరు. సూర్యుడస్తమించేది మీ ద్వీపంలోవుండే కొండలలోనేగాదు. ఉదయం సముద్రంలోనుంచి యెట్లా బయటికివస్తాడో, సాయంకాలం కూడ అట్లాగే తిరిగి సముద్రంలోనే కుంగిపోతాడు. ఇంతమట్టుకు నిశ్చయం. ప్రత్యక్షంగా సముద్రంమీద నా కండ్లతో నేను చూచే సత్యమిది—'

'మరొకడులేచి జాలరిమాట కడ్డువచ్చి యిట్లన్నాడు. 'ఓహో! ఇది మరీబాగున్నది, వింతలలోకల్లా వింత! అంత వివేకంగల మనిషి యింత అర్థంలేకుండా మాట్లాడడానికి సాహసించడమే నాకాశ్చర్యంగావున్నది. నిప్పుముద్దయేమిటి-సముద్రంలోపడి మునగటమేమిటి-ఆరిపోకుండా తిరిగి లేచిరావడమేమిటి? ఏమిటీ అసందర్భపుకబుర్లు! అసలుసూర్యుడు నిప్పుముద్దనిచెప్పటమే సరికాదు. సూర్యుడొకదేవత. తన దివ్యరథాన్నెక్కి 'మేరు'వనే బంగారుకొండ చుట్టూ విసుగు విరామం లేకుండా అనుక్షణమూ తిరుగుతూవుండే భగవానుడే సూర్యుడంటే. ఒక్కొకసమయంలో 'రాహు, కేతు' అనే రెండుదుష్టసర్పాలు సూర్యభగవానునెదుర్కొని అతణ్ణి మింగివేస్తుంటాయి. అప్పుడే భూమియంతా కొంతసేపటివరకూ చీకటిమయమైపోతుంది. రాహుకేతుల నోటినుండి అతడు విడువబడుగాక యని మా పురోహితులెప్పుడు ప్రార్థనచేస్తారో అప్పుడు సూర్యుడీ ఆపదనుంచి విముక్తుడౌతాడు. వారివారి చిన్నచిన్న ద్వీపాలుదాటి యెన్నడూ బయట కాలుపెట్టియెరుగని

నీవంటి మూర్ఖులుతప్ప, తమ ఒక్కదేశంలో మాత్రమే సూర్యుడు ప్రకాశిస్తున్నాడనే వాళ్ళెవ్వరూ, యెప్పుడు వుండరు?

'ఈజిప్టుదేశంనుంచి వచ్చిన ఓడయజమానొకడు కూడ ఆ సమావేశంలోవున్నాడు. అతనూ యీ సంభాషణలో పాల్గొని యిట్లాఅనటం ప్రారంభించాడు :

'కాదయ్యా, అట్లాకాదు. నీవుచెప్పేదిమాత్రంయేమి సమంజసంగా వున్నది? సూర్యుడు దేవుడనటంలో బొత్తిగా అర్థమేలేదు. పైగా హిందూదేశంచుట్టూ, లేక మేరుపర్వతం చుట్టూ తిరుగుతూ ఉంటాడనటం సత్యానికి చాలదూరం. నల్లసముద్రంలోనూ, అరేబియా సముద్రానికి చుట్టుపట్లనూ నేనెన్నోసార్లు పెద్దపెద్ద ప్రయాణాలుచేశాను. 'మెడగాస్కర్' ద్వీపానికీ, 'ఫిలిపైన్' దీవులకూకూడ పోయివచ్చాను. హిందూదేశమొక్కటేగాదు సూర్యుని వెలుతురుతో నింపబడేది—సూర్యుడు ప్రపంచాన్నంతనూ వెలిగిస్తున్నాడు ఏదో ఒక్కదేశంచుట్టూగాని, ఒక పర్వతంచుట్టూగాని తిరుగుతూ కూర్చోడు. బాగా తూర్పున, అనగా జపాన్ దీవుల కవతలవైపున ఉదయించి, పశ్చిమదిశలు బహుదూరంగా బ్రిటిషుదీవులుదాటి ఆవలెక్కడనో అస్తమిస్తాడు. జపాన్ దేశస్థులు తమదేశానికి 'నిప్పాన్' (అనగా సూర్యుడుదయించేచోటు) అని పేరుపెట్టుకోలేదా? దానికిదేకారణం. ఈ విషయంమట్టుకు నాకు బాగాతెలుసునని నిస్సంశయంగా చెప్పగలను. ఎందుకంటే నామట్టుకు నేను చాలాదూరం తిరిగిన మనిషిని. ఇదిగాక అనేకదూరపు ప్రయాణాలుచేసి సముద్రముయొక్క అంతుకనుక్కున్న మాతాతగారిద్వారా నేను తెలుసుకున్న విషయాలింకా యెన్నోవున్నవి.'

'ఇంకా యిట్లాచెప్పనిస్తే చాలసేపు చెప్పుతుంటూ పోయేవాడే ఈజిప్టునావికుడు. కాని యీలోగా ఆంగ్లేయనావికుడొకడు లేచి మాటందుకున్నాడు:

'సూర్యుని నడకనుగూర్చి ఇంగ్లాండు దేశస్థులకు తెలిసినంత సమాచారం ప్రపంచంలో మరేజాతివాళ్ళకూ తెలియదని నమ్మండి. సూర్యుడసలు యెక్కడావుదయించడు, ఎక్కడా అస్తమించడు. ఇది ప్రతిఆంగ్లేయునికీ తెలుసును. మరెవ్వరికీ తెలియనివిషయం, సూర్యు డెప్పుడూ భూమిచుట్టూ తిరుగుతూనేవుంటాడు. ఇంతవరకు నిర్వివాదం. దీనికి తిరుగులేదు.ఎందుచేతనంటే మేము భూమిచుట్టూ తిరిగివచ్చాము. అయితే మేమెక్కడా సూర్యుని తాకలేదు. మేమెక్కడకుపోయినా సూర్యుడు అక్కడే, యిప్పుడిక్కడ కనబడుతున్నట్లే, ఉదయమయ్యేసరికి కనబడుతూండటం, సాయంకాలాని కెక్కడనో దాగుతూండటం—అంతే. మరేమీ విశేషం లేదు.'

'ఇట్లా చెపుతూచెపుతూ ఆంగ్లేయుడొకకఱ్ఱ చేతబట్టుకొని, నేలమీద గుండ్రనిసున్నలు చుట్టడం మొదలుపెట్టినాడు. సూర్యుడాకాశంలో తిరుగుతూ, భూమిచుట్టూ యెట్లా ప్రదక్షిణంచేస్తూవుంటాడో తాను గీచే గీతలద్వారా అందరికీతెలియజెప్పి, ఒక్కసారిగా అందరిసందేహాలూ నివృత్తిచేదామని యెంతో ప్రయత్నించాడు. కాని నోరునొప్పిపుట్టేటట్లు చెప్పిచెప్పి ఒక్కరి సందేహంకూడా తీర్చలేకపోయినాడు. చివరకు తామెక్కివచ్చిన ఓడనడిపేవానిని చూపిస్తూ ఆంగ్లేయుడిట్లన్నాడు: 'అదుగో, అతనినడగండి! దీనిని గురించి నాకంటె అతనికి బాగాతెలుసును. అతడు మీకంతా సరిగా చెప్పగలడు.'

'ఆంగ్లేయుడు చూపిన ఓడనాయకుడు చాల తెలిసినవాడు. కాని తనను చెప్పమని అడిగేవరకూ మౌనం వహించి కూర్చున్నాడు. మిగతవాళ్ళుచేసే కోలాహలమంతా శ్రద్ధగాగమనిస్తూ తాను మాత్రమందుతో జోక్యం కలిగించుకోకుండా కూర్చున్నాడు. ఆంగ్లేయుడు అతనిని చూపడంతోనే, అందరూకలిసి అతనిచుట్టూమూగికూర్చుని, అతని యభిప్రాయమేమో చెప్పమన్నారు అప్పు డోడనాయకు డిట్లన్నాడు:

'అయ్యా, మీరందరూ ఒకరినొకరు తప్పుత్రోవ కీడ్చుకుంటున్నారు. పైగా యెవరిని వారే మోసపుచ్చుకుంటున్నారు. సూర్యుడు భూమిచుట్టూ యెన్నడూ తిరగడు. తనంతట తాను తిరుగుతూ, భూమే సూర్యుని చుట్టూ ప్రయాణంచేస్తున్నది. భూమి తనకుతాను బొంగరంలాగున గిరగిరతిరుగుతూ, ప్రతి యిరవై నాలుగు గంటలకాలంలో జపాను, ఫిలిపైనుదీవులు, మనమిప్పుడున్న యీ 'సుమిత్ర' దీవి, యివిమాత్రమేకాకుండా,

ఆఫ్రికాను, యిరోపాను, అమెరికాను, యిట్లాగే ప్రతి చోటును ఒకసారి సూర్యునికెదురుగా తిప్పి చూపుతూ వుంటుంది. ఇట్లా దినదినమూ ప్రతిచోటూ సూర్యుని వెలుతురునూ వేడిమినీ పొందుతూవుంటుంది. ఏదో ఒక పర్వతంకొరకు, లేక ఒక ద్వీపంకొరకు, లేక ఒక సముద్రంకొరకూ కాదు సూర్యుడుప్రకాశించేది. లేక ఒక్క మనలోకానికి (అనగా యీభూమికి) మాత్రమే సూర్యుడు ప్రకాశిస్తున్నాడనుకొనటంకూడా తప్పే. మన ప్రపంచంతోపాటు యింకను యిటువంటి అనేక ప్రపంచాలకు సూర్యుడు వేడిమనీ వెలుతురునూయిస్తున్నాడు. మీరు మీ చుట్టూకట్టుకొన్న చిన్నచిన్న గూళ్ళను మాత్రం చూచుకొని ఉహింపంగుతున్నారు. అక్కడున్నదిమోసమంతా. ఈ కొద్దిచూపుమాని అనంతమైన ఆకాశంవంక చూస్తే యీవిషయం మీకు బాగా బోధపడుతుంది. మీఒక్కరికోసంగాని, లేక మీఒక్క దేశంకొరకుగాని సూర్యుడు వెలుగుతున్నాడనే భ్రాంతి అప్పుడుగాని మీనుంచి తొలగిపోదు.'

'ఈ రోడనాయకుడు పెద్దపెద్ద ప్రయాణాలు చేసినవాడు ఆకాశంలోతిరిగే గ్రహమండలాల నడకలనుగూర్చి బాగా తెలుసుకున్నవాడు. వివేకంతో, విచక్షణతోకూడుకున్న అనుభవజ్ఞానం సంపాదించాడు. కనుకనే సత్యమేదో తెలుసుకోగలిగినాడు. తనకు తెలిసిన సత్యాన్ని యితరుల కందజేసి నిజమైన సంతృప్తినీ ఆనందాన్నీ యియ్యగలిగినాడు.'

ఇట్లా తనకథను ముగించి చైనాయువకుడు కాఫీ హొటలులో కూర్చున్నవాళ్ళతో యిట్లన్నాడు :

'భగవద్విశ్వాసానికి సంబంధించిన విషయాలుకూడ యిట్టివే అహంకారమే మనుష్యులను తప్పుడుమార్గాల కీడ్చుకొనిపోయి, తుదకేమీ కనుపించని అంధకారంలో ముంచుతుంది. అదికల్పించే భేదాభిప్రాయాలనూ, పరస్పర కలహాలకూ అంతుండదు. సూర్యుడెట్లాగో భగవంతుడూ అట్లాగే, ప్రతివాడూ తనమట్టుకు తనకొక భగవంతు డుండాలని కోరుకుంటాడు. అధమపక్షం తన జాతికైనా ప్రత్యేకంగా ఒక భగవంతు డుండితీరవలెననుకుంటాడు. ఇంతేకాదు. తన దేవుణ్ణి వెంటదీసుకొని మిగత జాతులపై సవాలుచేస్తూ వుంటాడు. ఏ విశ్వేశ్వరుని, యేసర్వవ్యాపిని యీప్రపంచమంతా కలిసియైనా తనలో కట్టిపెట్టుకొనజాలదో, ఆ విశ్వమయుని యేజాతి కాజాతే తాను కట్టుకున్న చిన్నచిన్న యిరుకు గూళ్ళలో పట్టి బంధింప జూస్తుంది. మానవజాతి నంతనూ ఒక్క విశ్వాసంలో, ఒక్కమతంలో, ఒక్క ఆత్మదృష్టిలో కలిపి బంధించే వుద్దేశంతో భగవంతుడే స్వయంగా నిర్మించిన యీ విశ్వమందిరంతో పోల్చదగిన దేవాలయం మరెక్కడున్నది?

'భగవన్నిర్మితమైన ఈ మహావిశ్వమే నిజమైన దేవాలయం. మనుష్యుడుకట్టే గుడిగోపురాలన్నీ యీ పెద్దఆలయాన్ని అనుసరించే, యీఫక్కీనే కట్టబడవలె. అట్లా కట్టబడినప్పుడే అవి మనుష్యుని కుపయోగపడతవి. ప్రతిగుడిలోనూ పవిత్రజలకలశా లుంటవి. దీపాలు, చిత్తరువులు, శిల్పాలు, శిలాశాసనాలు, ధర్మగ్రంథాలు, నైవేద్యాలు, గర్భాలయాలు, అర్చకులు, పురోహితులు—యీ కలాపమంతా ప్రతిగుడిలోనూ వుంటుంది. కాని భగవంతుడిచ్చిన యీ విశాలమహాసముద్రాన్ని మించిన జలకలశం, అనంతాకాశాన్ని మించిన గుడికప్పు, సూర్యచంద్రులను నక్షత్రాలనుమించిన అఖండజ్యోతులు, పరస్పరప్రేమతో, పరోపకారబుద్ధితో ప్రకాశించు మానవులతో పోల్చదగిన చిత్తరువులు యే గుళ్ళలోకి తే మనకు కనిపిస్తాయి? మానవకోటి క్షేమంకొరకూ, సుఖంకొరకూ ప్రపంచమంతటనూ వెదజల్లబడ్డ పరమేశ్వరుని ప్రత్యక్షఆశీస్సులకంటె మనకు సులభంగా అవగాహనయ్యే ధర్మశాసనాలు మరెక్కడుంటవి? ప్రతిమనిషి హృదయంలోనూ స్పష్టంగాను, సులభగ్రహ్యంగాను వ్రాయబడ్డ శాసనాన్నిమించిన ధర్మశాస్త్రంకొరకు యెక్కడ వెదకబోవలె! పవిత్రప్రేమతోనిండిన హృదయాలతో మానవశ్రేణిచేయు స్వార్థత్యాగంకంటె అధికమైనకానుక, ఉత్కృష్టమైన బలిదానము భగవంతునికి మరేమికావలె? సదాచారియైనమానవుని హృదయపీఠంతో పోల్చదగిన గర్భాలయం భౌతికప్రపంచంలో యెక్కడ కనబడుతుంది? అటువంటి హృదయగర్భాలయాలలోమాత్రమే భగవంతుడు ప్రత్యక్షదర్శనమిచ్చి మన కానుకల నందుకుంటాడు.

'మనుష్యుడు భగవంతుని తనలో తానెంతఉన్న

తంగా భావించుకోగలడో అంతబాగా ఆయనను తెలుసుకున్నవాడౌతాడు. మనభావ మెంతవిశాలమో, మన భగవంతుడుగూడ అంత ఉన్నతుడు. మనబుద్ధి యెంత కొద్దిపాటిదో, మనం కల్పించుకునే భగవంతుడు కూడ అంత సంకుచితుడే. ఆయనను తెలుసుకున్నకొద్దీ ఆయన మంచితనాన్ని, దాక్షిణ్యాన్ని, అతడు చూపే అపారప్రేమను అనుకరిస్తూ మనుష్యుడతనికి దగ్గరగా చేరుతూవుంటాడు. ఆయన అడుగుజాడలను యెంత స్పష్టంగాగుర్తించి అడుగులో అడుగుపెట్టి నడుస్తామో అంతదగ్గరకు చేరుకుంటాము.

'అందుచేత సూర్యునిజ్యోతి ప్రపంచాన్నంతనూ వెలిగిస్తున్నదనే సంపూర్ణసత్యాన్ని తెలుసుకున్న జ్ఞాని, ఆ సూర్యుని అంశను, ఒక్క కిరణాన్నిమాత్రమే తాను వెలిగించుకున్న చిన్నదివ్వెలో చూచుకునే కించిజ్ఞుని చూచి పరిహసించటంగాని వంచనచేయడంగాని సరి కాదు. తనఅంధత్వంచేత సూర్యుని అసలేచూడలేక సూర్యుడే లేడనిచెప్పే నాస్తికునిచూచికూడ దూషించ టానికెవ్వరికీ హక్కులేదు.'

కన్ఫ్యూషియస్ యొక్క శిష్యుడైన చైనాయువకు డిట్లా చెపుతున్నంతసేపూ కాఫీక్లబ్బంతా నిశ్శబ్ద మయింది. యువకుడుచెప్పిన సమాధానానికి అందరూ ఆశ్చర్యపడి ఆనందభరితులైనారు. తమలోతాము పెంచుకున్న అహంకారాలను తలచుకొని యెవరికివారే సిగ్గుపడ్డారు. సంశయాత్ములకు సందేహనివృత్తి అయింది. యువకుని వివేకాన్నీ, జ్ఞానసంపత్తినీ, అన్నిటి కంటెనూ యెక్కువగా అతని నమ్రతనూ కృతజ్ఞతతో అభినందిస్తూ అందరూ సెలవుపుచ్చుకున్నారు.

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు ఎం.ఏ.

# "విరక్తుడు"

మ. వలపుల్ గుల్కగ నేలొకో యిటుల నన్ వాల్చూపులన్ జూచి నీ
వెలమిన్ సల్పెదు మందహాసములు; తన్వీ! నాదు డెందంబునన్
జలజాతాక్షులతోడి వేడ్కల కికన్ స్థానంబు లే దింక, ని
ష్ఫలముల్ నీదగు యత్నముల్, తలగుమీ, బాలా శిరోరత్నమా!

చ. చలువలు జల్లు వెన్నెలలు, సౌరభముల్ ప్రసరించు క్రొవ్విరుల్,
చెలువగు రమ్యసౌధములు, శ్రీలజెలంగెడి పుష్పవాటికల్,
విలువ దొలంగె నేడు రమణీమణి, యేల వృథాప్రయాసముల్,
దలపకు మింక నన్ను, ముదితా! మది తాపమునొందకుండుమీ!

మ. వనితా! చాలును జాలునిల్వు మిక నాపై మోహదృగ్బాణముల్
జెనకన్ బోకుము; సంసృతిన్ గడచి శాంతింజెంద గాంక్షించు న
న్నెనయన్ జూడగ న్యాయమానె సుదతీ యీవింత యోచించి నా
వినతిన్ గైకొని వీడగాదగును న న్వేచంద్రబింబాననా!

మ. అరయం నీ కనుదమ్ములందొలయు దివ్యజ్యోతి జ్యోత్స్నావళిన్
దిరమై నిల్చి యసంగసూక్తులను బుద్ధిన్ జొన్పి తీండ్రించు న
బ్బురమా రేలుస్మరింపనేల ముకుదా! పుష్పాస్త్రి దౌర్జన్య ము
ద్ధురతన్ నన్నిక లేపజాలదు సఖీ! దూరంబు నీకయ్యెదన్.

—గోదావరి సత్యనారాయణ, బి.ఏ.

# 3. గ్రంథాలయ నిర్మాణము—నిర్వహణము

భారతదేశమున గ్రంథాలయముల యుత్పత్తిని పరిణామము నింతవరకును వర్ణించియుంటిమి. ఇప్పుడు గ్రంథాలయము లెచ్చట స్థాపింపబడుచుండినవి? వాని నెట్లు నిర్వహించుచుండిరి? యను ప్రశ్నలు బయల్వెడలుచున్నవి. ఈ దేశమున నీ సంస్థకుగల ప్రాముఖ్యతను బట్టియు, విదేశీయులకు వీనియందుగల యాసక్తిని బట్టియు, నీ సంస్థలు దేశమునందసంఖ్యాకములుగ నుండెడివని స్పష్టమగుచున్నది. అయినను విద్యాపీఠములందును, దేవాలయములలోను, బౌద్ధవిహారములందును, జైనుల ఉపశ్రయములలోను, మఠములలోను, రాజాస్థానములందును భాండాగారములు సామాన్యముగ నుండెడివి.

## విద్యాపీఠములు

ప్రాచీన మధ్య యుగములలో మనదేశమున విశ్వవిద్యాలయములు ముఖ్యవిద్యాపీఠములుగ నుండినవి. ఆకాలమునాటి పండితశ్రేష్ఠులందరు నట నివసించుచు వేనవేలుగనుండు విద్యార్థులకు విద్యను నేర్పుచుండిరి. ఈ యధ్యాపకుల వైదుష్యప్రతిభ వలనను, నిరంతరాయముగ విద్యావ్యాసంగము జరగుటకై యీ విద్యాలయములలో జేయబడిన యేర్పాట్లమూలముననను, ముఖ్యముగ నీస్థలముల కేంద్రీకరింపబడిన గ్రంథాలయముల మూలముననను దెశీయులును విదెశీయులు నెందరో యీ స్థలముల కాకర్షింపబడుచుండిరి. నాటి విద్యాప్రణాళిక బహువిషయకమై యుండెడిది. బౌద్ధయుగమున అందునను మహాయానమత ముద్భవించిన పిమ్మట బోధ్యవిషయముల సంఖ్య హెచ్చినది. అదిగాక వాదప్రతివాదముల సౌకర్యమునకై బౌద్ధవిద్యాపీఠములలో నితరమతముల సిద్ధాంతములును, వాఙ్మయములునుగూడ బోధింపబడుచుండెడివి. బహుముఖమగు నిట్టి విద్యాప్రణాళిక నాచరణలోనికి దెచ్చుటకు, వివిధశాస్త్రములకు సంబంధించిన గ్రంథములెన్నియో యవసరములైనవి. చదువుకొను విద్యార్థుల సంఖ్యగూడ నెక్కువయగుటచే నొకే గ్రంథమున కెన్నియో ప్రతులు కావలసివచ్చినవి. ఇంతియగాక నీ విద్యాపీఠములలో ముఖ్యములగు మతవాదములును, చర్చలును జరుగుచుండెడివి. ఈ కారణములనుబట్టి నాయందు, విక్రమశిలా, ఒదంతపురి మున్నగు విశ్వవిద్యాలయములలో గొప్పగొప్ప గ్రంథాలయము లేర్పరుపబడినవి. మహమ్మదీయచరిత్రకారుల వ్రాతలు (1) క్రీ.శ.12,13. శతాబ్దములవరకునుగూడ నిట్టి గ్రంథాలయములీ విద్యాపీఠములలో నుండెడివనియు, నటుపై వానిని ఢిల్లీసుల్తానులు నాశమొనర్చిరనియు నిరూపించుచున్నవి.

## పరిషత్తులు

బౌద్ధయుగమునకు బూర్వముగూడ మనదెశమున నెన్నియో విద్యాసంస్థ లుండెడివి పరిషత్తులు వీనిలో ముఖ్యములు. వసిష్ఠ, గౌతమ, బోధాయనాది ధర్మశాస్త్రకర్తలు వీనినిగూర్చి ప్రశంసించియున్నారు. ఈ పరిషత్తులు అనేకశాస్త్రములం దారితేరిన పండితుల సమావేశములు. అవసరమునుబట్టి వేర్వేరు సమయములలో నీసమావేశములు జరగుచుండెడివి. ధర్మశాస్త్ర విషయములగు సందేహములనుదీర్చి, వివాదములను బరిష్కరించుటయే వీని కర్తవ్యములు. ప్రాయకముగ నీ పరిషత్తులు నగరములలో సమావేశమగుటను బట్టియు, నిట వాద ప్రతివాదములు జరగుటను బట్టియు నీ పరిషత్తులకు గ్రంథాలయముల యావసర ముండెడిదని తోచుచున్నది. వాదములలో నుభయపక్షములవారును తమతమ వాదములను స్థిరపరచుకొనుటకై ప్రమాణములను జూపవలసి

1. Tayul-Ma'asir by Nixami in Elliot 2, pp. 222-223 Tabaquati - Nasiri by siraj p. 552.

యుండును. ఇందులకు ప్రమాణగ్రంథము లావశ్యకములు. వివిధ గ్రామములనుండి పరిషత్సమావేశమునకేతెంచిన పండితు లీ ప్రమాణ గ్రంథములను తమతో తెచ్చుచుండిరనుట కంటె, నా యీ సమావేశములకు నందు చర్చింపబడు విషయములకు నుపయోగించు గ్రంథములు దొరకెడి స్థలములలోనే యీ సమావేశములు జరగెడివనుట సమంజసముగ నుండును. ఈ సమావేశములు నగరములలో జరుగుచుండినటుల ధర్మశాస్త్రములు దెల్పుచున్నవి. దీనినుండి రెండు విషయములు దెలియనగును అప్పటి నగరములలో శాశ్వత గ్రంథాలయములు గొన్ని యుండియుండవలెను, లేదా యచట పరిషత్తులే స్వయముగ నొక గ్రంథాలయము నేర్పరచికొని యుండి యవసరమగునపు డందు సమావేశమగుచుండి యుండవలెను. పరిషత్తులకు ప్రత్యేక గ్రంథాలయము లుండెడివనుటకు మరికొన్ని ప్రమాణములు గలవు రాజులును శ్రీమంతులును వీనికి దానములను చేయుచుండిరి పరిషత్సభ్యులకు ప్రతిఫల మేమియు నొసంగు టాచారమై యుండినటుల గన్పింపదు. అవసరమును బట్టి యాపుడపుడు సమావేశమగునవి గాన నీపరిషత్తులకు స్థిరవ్యయ మేమియు లేకుండినది. ఇట్లు గనవ్యయమున కేవిధమగు నవకాశమును లేకుండినచో, నీ పరిషత్తులు దమకు జేయబడిన ద్రవ్యాదిదానముల నే విధముగ నుపయోగించెడివి? అను ప్రశ్న బయల్వెడలును. ఈ సంస్థలకు గ్రంథము లత్యవసరములని యిదివరలో జెప్పియుంటిమి. ఈ గ్రంథాలయములకొరకే పైదానములు వినియోగింపబడుచుండెడివని యూహించుట కభ్యంతర మేమియు లేదు. దీనినుండి పూర్వకాలమున మన దేశమునందెన్నియో పరిషద్గ్రంథాలయము లుండెడివని నిశ్చితమగుచున్నది. (2)

## ఘటికలు

క్రీస్తుశకారంభమున ఘటికలు సుప్రసిద్ధ విద్యాస్థానములుగ నుండినవి. ఇందు ప్రత్యేకముగ విద్యావిషయములకే ప్రాముఖ్యత యొసగబడుచుండెడిది. ఇట్టి ఘటికలనుగూర్చి ప్రశంసించు శాసనాద్యాధారము లెన్నియో గలవు. కదంబరాజవంశస్థాపకుడగు మయూరశర్మ తర్కశాస్త్రమునందద్వితీయమగు పాండిత్యమును సంపాదింపనిచ్ఛతో నెన్నియో ఘటికలకు పోయెనట.(3) ఒక వేంగిచాళుక్యతామ్రశాసనమునం దాంధ్రదేశములోని అసనపుర ఘటికాస్థానము పేర్కొనబడినది (4) పల్లవరాజగు రెండవనరసింహావర్మ కాంచీపురమున నొక ఘటికను స్థాపించెను (5). ఇట్టి ప్రమాణములనేకములు గలవు. ఈ ఘటికలలో సభ్యులుగ నుండెడివారికి 'ఘటికాసామాన్య' లనియు, నిచట వాదములలో జయమునందినవారికి 'ఘటికాసాహసు'లనియు బిరుదములుండెడివి (6). దీనినిబట్టి పరిషత్తులలోవలెనే ఘటికలలో గూడ విద్యావిషయకములగు వాదోపవాదములు జరుగుచుండెడివని స్పష్టమగుచున్నది. ఇట్టి సందర్భముల ప్రమాణగ్రంథములుగల గ్రంథాలయము లత్యవసరములని వేరుగ జెప్పనక్కరలేదు. ఈ ఘటికలకును, ఇందలి సభ్యులకును రాజులు మున్నగువారు దానధర్మములు చేయుచుండిరి. అయినచో ఘటికలకు జేయబడిన ద్రవ్యాదిదానము లెట్లుపయోగింపబడెడివను ప్రశ్న తిరిగి బయల్వెడలుచున్నది. పరిషత్తులవలెనే యీ ఘటికలుగూడ ప్రత్యేక గ్రంథాలయములను నెలకొల్పి వాదప్రతివాదములనుజేయు పండితులయు, విద్యార్థులయు సౌకర్యమునకై వానిని నిర్వహించుచుండెడివని చెప్పవలసియున్నది. ఈయూహ నిటీవల నైజాం రాష్ట్రములోని వాడేకి సమీపముననున్న నాగై గ్రామమున బయల్వెడలింపబడిన శిథిలములును, శాసనములును బలపరచుచున్నవి (7). నాగైనిలో క్రీ. శ. 11వ శతాబ్ది నాటి రెండుచాళుక్యశాసనము లీప్రదేశమున ఘటికాశాలయను విద్యాసంస్థయొకటి స్థాపింపబడెనని తెలుపు

---

2. పరిషత్తులనుగూర్చి విశేషాంశములు తెలియవారు నా 'భారతీయవిద్యాచరిత్రము' 20 21 పుటలు చూడవచ్చును.

3. ,,

4. ,,

5. ,,

6. ,, పే. 32.

7. Hyd. Arch. Ser. No 8. p. 7.

చున్నవి. ఈ విద్యాసంస్థలో నార్గురు భాండారికులచే (లైబ్రేరియన్సు) నిర్వహింపబడుచుండిన గ్రంథాలయమొకటి యుండెడిది. ఈ భాండాగారముండిన కట్టడముగూడ గన్గొనబడినది.

## సంగము

ఘటికలు సామాన్యముగ సన్నివిద్యలను వ్యాపింపజేయుచుండ ద్రవిడదేశమున సంగములను సంస్థలు వాఙ్మయాభివృద్ధికి మిగుల దోడ్పడినవి. ఈసంస్థలు నిర్వహించుచుండిన కార్యక్రమమునుబట్టి వీనియందు గూడ ప్రత్యేక గ్రంథ సముదాయము లుండెడివని యూహింపనగుచున్నవి. ఇవి పండితసమ్మేళనములు. రాజులు వీనిని పోషించుచుండిరి. దేశమునందలి కవులందరును తమతమ గ్రంథముల నీ సంగములకు బంపుచుండిరి. పిమ్మట నాకాలపు పండితాగ్రణులుగల సంగ మా కావ్యములను విమర్శించి యోగ్యములగువాని నామోదించుచుండెడివి (8). ఒకప్పుడు 400 గ్రంథములకు పైగా నిట్లు బంపబడినవట. ఇట్లు పంపబడిన గ్రంథములన్నియుంజేరి సంగములకు చక్కని గ్రంథాలయము లేర్పడియుండవలెను. రాజాదరణముగల యీ వాఙ్మయదోహదమువలన నెన్నియో గ్రంథములు రచింపబడి సంగములకు బంపబడుచుండెడివి. వాని యామోదమునందిన వానికి దేశమున విశేషమగువ్యాప్తి గల్గుచువచ్చెను. ఇందుమూలమున వాఙ్మయమునందభిరుచి గలవారందరును పై ప్రమాణగ్రంథములకు బ్రతులను వ్రాయించికొని సేకరింపుచువచ్చిరి. ఈవిధమున సంగములయొక్క వాఙ్మయవిమర్శనాపోషణములమూలమున గ్రంథముల సంఖ్యయు, దన్మూలమున గ్రంథాలయములు నభివృద్ధి నందినవి. ఇట్టి భాండాగారములలో సంగ గ్రంథాలయ మగ్రగణ్యములుగ నుండెడివి.

## బౌద్ధవిహారములు

బౌద్ధుల సంఘారామములును, విహారములును భారతీయ గ్రంథాలయాభివృద్ధి కెక్కుడుగ దోడ్పడినవి. నగరములకు దూరముగనుండి సుప్రశాంతములగు స్థలములలో నెందరో రాజులును శ్రీమంతులును బౌద్ధ భిక్షువులు నివసించుటకై విహారములను, సంఘారామములను నిర్మించుచుండిరి. వీనిలో నివసించుచు నీ భిక్షువులు పరిసరప్రాంతములందలి జనులకు మతబోధను జేయుచుండిరి. ఆకాలమున లేఖనమును, గ్రంథపఠనమును సర్వ సామాన్యములుగ నుండినవి. బౌద్ధభిక్షువులు మత ప్రచారముకై గ్రంథములనుపయోగించుచుండిరనుట కెన్నియో ప్రమాణములు గలవు. పశ్చిమ భారతదేశము నేలిన వల్లభిరాజొకడు క్రీ.శ. 6-వ శతాబ్దమున దుడ్డయను గ్రామములోని భిక్షువులు దమ కవసరమగు గ్రంథములను కొనుక్కొనుటకై 'పుస్తకోపక్రయ' మను పేర నొక ధర్మమును జేసెను (9). దీనినుండి భిక్షువుల నివాసస్థానము లన్నిటియందును గ్రంథాలయము లుండెడివనియు, వానిలోని పుస్తకములు గొన్ని మూల్యమిచ్చి కొనబడినవనియు దెలియుచున్నది. ఈగ్రంథాలయములు మరియొకవిధమున గూడ నభివృద్ధినందినవి. భిక్షువులకు బౌద్ధధర్మమునకు జెందిన సద్గ్రంథములకు బ్రతులను వ్రాయుటొక ముఖ్య కర్తవ్యముగ నుండెడిది. అరుదుగ దొరకెడి గ్రంథములకు బ్రతులను వ్రాసికొనియు, సులభసాధ్యములగు వానిని మూల్యమిచ్చి సంపాదించియు, భిక్షువులు తమ నివాసస్థానములలో చక్కని పుస్తకాలయములను నిర్మించుకొనుచుండిరి. బౌద్ధయుగమున మనదేశములో విహారములును, సంఘారామములును వేనవేలుగ నుండెడివి ప్రతి భిక్షుని వాసస్థానమునను గ్రంథసముదాయము లుండినవని యిదివరలో నిరూపించి యుంటిమి.

—మారేమండ రామారావు, ఎం. ఏ., బి. ఇడి.

8. Venkateswara - Indian culture through the ages. p. 40.
9. Buhler-Ind Paleography. p. 99.

# రాధిక

నాకు విచిత్రమనిపించేది: రోజూ సాయంత్రం మూడుగంటలప్పుడు నేను కోయంబత్తూరు లాడ్జిలో కాఫీ త్రాగుతూంటే ఆ అమ్మాయి కూడా ఒకగ్లాసుపట్టుకుని అక్కడ సాక్షాత్కరించేది ఏడుగంటలనుంచి రాత్రి తొమ్మిది గంటలదాకా నాకు ప్రూఫులుదిద్దేపని వుంది ముద్రణాలయంలో. అందుచేత భోజనానికి ఆలస్యమౌతుందని ఆ యకాలంలో కాస్త కాఫీపోసి మరి వెళ్ళుతుంటా. ఆ అమ్మాయీ అదే సమయానికి ఎవరికో కాఫీ పోయించుకుని పోతూండేది.

ఆపిల్ల అక్కడవున్నంతసేపూ నాకు కన్నుల పండువుగా వుండేది. అయ్యరు కూర్చుండే కుర్చీ ముందున్న బల్లమీద గ్లాసు పెట్టి, ప్రక్కనున్న వాకిలి తలు పానుకుని, ఓరగా నుల్చుండేది. ఆ దిక్కునుండి నాచూపు మరలించుకోలేకపొయ్యేవాణ్ణి నేను తన్ను చూస్తున్నానని ఆపిల్ల కనిపెట్టి తానూ నాకేసి చూస్తూ, అప్పుడప్పుడు తన దృక్కులు మరలించుకుంటూ, నాచూపులు మరీ తీక్ష్ణంగా వుంటే సిగ్గుపడుతూ—ఇలా తమాషాగా గడిచేవి ఆ నాలుగైదు నిముషాలూ ప్రతి రోజూ. కొన్నాళ్ళకు మేమెప్పుడూ పరస్పరము మాట్లాడుకుని వుండకపోయినా స్నేహితులమైపోయామని చెప్పచ్చు. చూపులతోనే నే నామెకూ, ఆమె నాకూ, పరిచితులమైపోయినాం.

ఆ బాలిక ఎవరో నేనూహించలేను; కాని ఒక అందమైన వస్తువ. ఆ నవ్వు పెదవులూ, చంచల నేత్రాలూ, సొబగైన ఆకారం, అందరకూ వుండవు. ఆమాటలో తీపి, నడకలో అందం, పెద్దయింటి పోకడ. తలముడిచిన తీరూ, తొడిగికొన్న జాకెట్టు 'కట్టింగూ', ప్రస్తుత నాగరకతా సూచన. పదకొండు, పన్నెండేళ్ళ లేతవయస్సు.

ఆనాడు మామూలుకు మల్లే ఆరుగంటలకు ఆ అమ్మాయి రాకపోవడం నామనస్సుకు కొంచెం కష్టమనిపించింది. తొందరగా కాఫీత్రాగేసి ఆ ప్రక్కనవున్న ఖిల్లీ దుకాణందగ్గర తమలపాకులు నములుతూ ఒక స్నేహితుడితో ఏదోమాట్లాడి వెళ్ళిపోతున్నా. ఇంతలో ఆ పిల్ల కనుపించింది హోటలులోనుంచి వెళ్తూ. కాని వుత్తగ్లాసే మళ్ళీ తీసికుపోతున్నది. పనసపిక్కల్లాంటి తొడలు కనబడేటట్లు పరికిణీ ఎత్తుకుని కన్నులు తుడుచుకుంటున్నది. ఎందుకో ఒకటి రెండు కన్నీటిబొట్లు బుగ్గలమీద జారటం చూచాను.

"ఎందుకుచెప్మా ఏడుస్తుంది పాపం" అనుకుని, అయినా కనుక్కుందాం సంగతని దగ్గరకుపోయి అడిగాను. "కాఫీతెమ్మని మా అక్కయ్య బేడాకాసిచ్చింది; అది దారిలో ఎక్కడో జారిపోయింది; ఇక్కడకు వచ్చి చూచుకుంటే లేదు ఇంటికి పోతే మా అక్క కోపంజేస్తుందేమో" అని గద్గదిక కంఠంతో ప్రత్యుత్తరం వచ్చింది స్వతహా నాది చాల జాలిగుండె.

'అయితే రోజూ మీ అక్కయ్యకోసరమేనా కాఫీ తీసికెళ్తుంటావు?"

'ఔను.'

'ఈ అమ్మాయికే ఒకఅక్క వున్నట్లయితే ఆవిడ సౌందర్యం త్రిలోకమోహనమై

వుండాలి.' అనుకుంటూ ఆబాలిక చేయి పట్టుకుని, 'పిచ్చిపిల్లా! ఇంతమాత్రానికే కన్నీళ్లు పెట్టుకోవలెనా? పరవాలేదు; ఇది తీసుకపోయి కాఫీపోయించుకుని వెళ్లు'' అని ఒకబేడాకాసు ఆమెచేతిలో పెట్టేను. అది ఆమె గ్రహించి కృతజ్ఞతా సూచకమైన చిరునవ్వు నవ్వుతూ, నాముఖం చూస్తూ, మళ్ళీ హోటల్లోకి పోయింది. నేను ముద్రణాలయానికి వెళ్ళేను.

మర్నాడు అదేసమయానికి తిరిగీ కలుసుకున్నాం. ఆపిల్ల మెల్లగా నాదగ్గరకు వచ్చి, మల్లెపువ్వుల్లాంటి దంతాలువిప్పి, 'ఒకసారి మీరు మాయింటికి రారూ?' అంది.

'ఎందుకూ?' అని అడిగేను.

'మా అక్కయ్య మిమ్మల్ని ఒకసారి పిల్చుకరమ్మంది' అన్నది.

ఆ మాటతో నాగుండెలోకి ఒక విద్యుచ్ఛక్తి ప్రాకినట్లైంది, కొంచెంసేపు మౌనంగావుండి చివరకు 'ఇప్పుడుకాదు; మరోసారి ఎప్పుడైనా వస్తాలే' అని సమాధానం చెప్పి ఆ పసిదాన్ని పంపించేశాను.

రోజూ నన్నామె ఆహ్వానిస్తూనే వుంది. ఎప్పటికప్పుడు 'రేపు రేపం'టూ గడుపుకొస్తున్నా. ఎందుకబ్బా! నన్నామె పిలువనంపటం!

ఆనాడు ఆదివారం. ముద్రణాలయం మూశేస్తారు. నాకు పనివుండదు. కాని అలవాటైన కాఫీ ఎలా మానేస్తాను. మామూలుగా టైముకు కోయంబత్తూరు లాడ్జిలో హాజరయ్యాను. ఆ అమ్మాయీ వచ్చింది.

'మీరివ్వాళ మాయింటికి రావాలి; తప్పదు.' అన్నదామె నాదగ్గరకు వచ్చి.

'రాకపోతే ఏంజేస్తావు?'

'చెయి పట్టుకుని తీసికెళ్తా.' అన్నదా చిన్నారి అంతమాత్రం అధికారం తనకు నామీద వున్నదన్న దీమాకాగా.

ఆ పడుచు వెనకాలే వెళ్లుతున్నా. ఒక అనన్యలావణ్యవతియైన అప్సరఃకన్య నన్ను వెంటబెట్టుక రమ్మని ఒక దూతనంపినట్లూ, అమృతంచిందే ఆమె సాన్నిధ్యానికి నేను ఉవ్విళ్ళూరుతూ వెళ్లుతున్నట్లూ—ఇల్లాంటి మధురభావాలు నామనస్సులో నిండిపోయి, దారిలో ఆ పిల్లతో ఎక్కువగా మాట్లాడలేదు నేను. అప్పుడే ఒక్కసారిగా వెలిగిన మ్యునిసిపాలిటీ వారి విద్యుద్దీపాలు నాదృష్టి నాకర్షించినవి. మేము భోగమువాళ్లవీధిలో నడచిపోతూన్నామని తెలిసికొన్నాను.

'అయితే మీరీ వీధిలో నేనా వుండటమూ!' ఆ అమ్మాయి వీపుమీద ప్రాకులాడుతూన్న జడమీద తడువుతూ అడిగేను.

'మీకు తెలీదూ?'

'నా కెల్లాగు తెలుస్తుంది?'

'తెలుసుననుకున్నాను. మా అక్కయ్యను మీరెప్పుడూ చూడలేదూ' అంటూ ఒక గుమ్మమెక్కి లోపలప్రవేశించింది పిల్ల. నేనూ ఆమె ననుసరించా 'చివరకు భోగకాంత యింట్లోకి దూరుతూన్నట్లున్నానే' అనుకుంటూ.

అదొక సుందరమైన హాలు. అక్కడ ప్రతివస్తువూ పరిశుభ్రముగా యథాస్థానాల అమర్చబడి వున్నవి. దక్షిణపువైపు కిటికీ ప్రక్కన ఒకపందిరిమంచం, దానిమీద పాలనురుగు గ్రక్కుతూన్న పరుపు, ఆప్రక్క గోడకు ఒకపెద్ద అద్దం. 'రాసక్రీడా,' 'గోపికావస్త్రాపహరణం', 'తారా చంద్రులు' మొదలైన పటాలుకొన్నీ, సినీమానట్టువల ఛాయా చిత్రాలుకొన్నీ చుట్టూ గోడలకు

ప్రేలాడుతున్నై. అక్కడ టేబిల్ మీద వున్న ఒకలాంతరు వెలుగులో ఇవన్నీ చూడ గలిగేను.

ఇంతలో అక్కాచెల్లెళ్ళిద్దరూ లోపల నుంచి వచ్చారు. 'అదుగో బావగార్ని ఇవ్వాళ పట్టుకొచ్చా' అంటూ చిన్నది నా చేయిపట్టుకుని అక్కడి 'ఈజీచైర్'లో కూర్చో బెట్టింది.

పెద్దదికూడా 'రండి, దయచేయండి' అంటూ మర్యాదవాక్యాలు వుచ్చరించి, తమలపాకులూ వగైరా వున్న ఒక వెండి పళ్లెరం తెచ్చి నాముందు పెట్టింది. ఆమె నా దగ్గరకు వచ్చినప్పుడు ఏదో సువాసన గుప్పుమని నసాళాని కంటుకుపోయింది. ఆమె సౌందర్యం పురుషుల కయస్కాంతంవంటిది. ఆమె చక్కదనంలో కొంతభాగమైనా ఎరువు తీసికొనిపోయివుంటే, వరూధిని అవలీలగా తన బాహులతల్లో బంధించివేయగలిగేది ప్రవరాఖ్యుణ్ణి.

ఒక తెల్లని అహమ్మదాబాదు చీర మాత్రమే కట్టుకుంది. రవికమాత్రంపట్టుది; దీపకాంతిలో మెరుస్తున్నది. మెడలో ఒక బంగారు గొలుసు ఉరోజముల ఔన్నత్యం కొలుస్తున్నట్లుగా వ్రేలాడుతున్నది. క్రాపింగు వలె ముందుకు కనుపించేలాగు జుట్టు ఎగదువ్వి బర్నాచుట్ట వేసింది. దానిచుట్టూ అర్ధచంద్రాకారంగా చేమంతిపూల చెండువుంది ఆ చెండుమధ్య ఒక గులాబిపూవు తొగరు చిలుకుతున్నది. పౌడరుపూసిన మొగాన చాదుబొట్టుకూడా వశీకరణమంత్రం చదువుతున్నదా అనుపిస్తుంది. మొత్తంమీద సుమారైదడుగుల యెత్తున, అంత లావుకాకుండా, యౌవనగర్వం ఉట్టిపడుతూన్న శరీరం.

వేశ్యల ఆచారాను సరణంగా నాముందుంచబడిన పళ్లెరంలోనుంచి ఒక వక్కముక్క నోట్లో వేసుకున్నా. ఆమె పందిరి మంచంకోడు కానుకుని నిల్చుని, ఎడపతడప ఒడలు విరుస్తూ, కనుబొమ లాడిస్తూ, కులుకుతూ ప్రసంగమెత్తింది.

'మిమ్మల్ని గురించి మారాధిక రోజూ చెప్పుతూంటుంది, చాలా మంచివారనీ, తన్ను రోజూ పల్కరిస్తుంటారనీ,'

అందుకు ప్రత్యుత్తరంగా నేను చిరునవ్వే చిత్రించాను. రాధిక మంచంమీద వెల్లకిలా పడుకుని తన రాగజ్ఞానం నాకూ చూపించాలని కాబోలు ఏదోపాట ఆలాపించుతున్నది.

'ఐతే రాధిక నీకు చెల్లెలా?' అని అడిగేను ఆసుందరాంగిని.

'అవును - కాని ఏకోదరులంకాదు. మమ్మల్నిద్దరినీ వెంకుబాయి పెంచింది.'

'వెంకుబాయా? అద్వితీయమైన నాట్యకౌశలానికీ, మనోహరమైన పాటకూ పేరుబడ్డ వేశ్యాస్త్రీ.'

'అవును. నాతల్లిదండ్రు లెవరో నాకు తెలియదు. వాళ్లునన్ను పోషింపలేనంత కటికి బీదవారై వుండాలి; లేకపోతే కన్నబిడ్డను ధనమాసించి ఒక వేశ్యకు అమ్మివుండరు. కాని వెంకుబాయి నన్ను చాల ప్రేమతో ఏలోటూ లేకుండా పెంచింది. ఆమెకు ఎప్పుడూ కృతజ్ఞురాలను.'

'రాధికను కూడా వెంకుబాయి ఎక్కడో కొనితెచ్చిం దనుకుంటా.'

'కాదు. ఎవరో ఒక బ్రాహ్మణ వితంతువు గర్భముదాల్చి, ఈయింట రహస్యముగా ప్రసవించి ఈపిల్లను మాపోషణకు వదలేసి పోయింది. నాటనుంచీ ఇక్కడే పెరుగుతున్న దా చిన్నారి.'

'వెంకుబాయి చనిపోయిందికదా! మరి మీకు జీవనం?'

'మాకులవృత్తి' అని సిగ్గుపడుతూ రెండు పక్కచూపులేసింది సూటిగా నాహృదయంలోకి.

'బాగుంది. అందుచేతే మీకు నిరుద్యోగసమస్య లేకుండా పోయింది.'

'కాని మేము సంఘానికి వేరుపురుగులమని దూషిస్తున్నారుగా మీరంతా'

'ఎవరన్నారు? మీరు సంఘానికి సౌందర్యవంతములైన ఆభరణాలు. భోగంవీధి పురానికి రత్నహారంవంటిది,'

ఆమె గ్రహించి మందహాసంచేసింది. ఊరికే కూర్చుని మూగవాడి ననిపించుకోవడ మెందుకనుకుని ఒకచిన్న వుపన్యాసం కొట్టడానికి గొంతు సవిరించుకున్నా.

'దేశంలో సత్కళాభివృద్ధికికూడా మీతోడ్పాటు వుంది కళలకు ఆధారభూతమైన భావోద్రేకం కలిగించేవి మీసౌందర్యం, మీశృంగారపుచెయ్యులు. 'ఆంధ్రకవిధూర్జటి పలుకుల కంత మాధుర్యమేల కలిగిందో తెలుసా' అంటే, 'వారవనితాజనతాఘన తాపహర సంతత మధురాధరోదిత సుధారస ధారల గ్రోలుటంజుమీ' అన్నారు. శ్రీకృష్ణదేవరాయలుకూడా తన ప్రబంధంలో వేశ్యలనుగూర్చి రత్నాల్లాంటి పద్యాలు వ్రాసేడు. ఒకచోట అన్నాడు కదా: విలుబుత్తూరులో వారస్త్రీలు తెలవారు ఝామున మేడలమీద జేరి జడలను చన్నులమీదుగా తీసుకుని విప్పుకుంటూ పూవులు గోటచిమ్మేస్తుంటే వీనెమీద వ్రేళ్లు మీటుతున్నారా అన్నట్లుండేదిట. చూడూ! ఎంతహృదయాకర్షకమైన వర్ణనకు కారణమయ్యారో మీరు! చూడగా వారస్త్రీ పేరెత్తని ప్రబంధమే లేదనవచ్చు. పింగళి సూరన్న కళాపూర్ణోదయం ఎత్తుకోవడమే వేశ్యతో.'

'తెలిసినవారు కనుక అలాగంటారు'

'నేనేకాదు. ఎవరైనా ఒప్పుకుతీరాలిసిందే. మర్త్యలోకంలోనే కాదు వారకాంతలువున్నది. మనకు పూజార్హులైన ఇంద్రాదిదేవతలకుకూడా ఊర్వశీ, మేనక మొదలైన వేశ్యలువున్నారు లెక్కలేనంతమంది. యజ్ఞయాగాదిక్రతువులు చేసినందుకు ఫలం వాళ్ళ కవుగిళ్ళ సుఖంచేటందుకే. పరకాంతాసక్తి పాపమైతే కావచ్చు; వేశ్యాపరిష్వంగము ఆశింపవలసిన సౌఖ్యం.'

'మరి గవర్నమెంటులో ఏదో 'బిల్లు' ప్యాసైందిటగా. భోగంవాళ్ళను వూళ్లోనుంచి వెళ్ళగొట్టేస్తున్నారే.'

'అవును. అది శోచనీయమైన విషయం. ఈమధ్య రాజకీయవేత్తలకు శరీరమూ, తదింద్రియవ్యాపారాలూ, మొద్దుబారినవి.'

'పోలీసులు జబర్దస్తీగా కొందరు వేశ్యల గృహాల్లోదూరి అక్కడవున్న స్త్రీలనూ పురుషులనూ స్టేషనుకు లాక్కెళ్ళేరు.'

'పాపం! మనలోవున్న దుర్బలత్వమే అది. పేరుప్రతిష్టలకోసం అనేక సంఘసంస్కర్తలు లేస్తున్నారేగాని వాళ్ళవల్ల దేశానికి ప్రయోజనం సున్నా. కాలపరంపరలో సంఘం తనంతటతానే మంచిత్రోవకు వస్తుంది. లేదా మనలోమనం సమరసపడి ఒకమార్గం త్రొక్కాలి. అంతేగాని మన పరిస్థితులూ అవీ పూర్తిగా తెలిని ప్రభుత్వానికి అధికారంవప్పజెప్పితే 'లాఠీచార్జి'లతో వాళ్ళత్రోవకు రమ్మంటారు.'

'ఔను. లాఠీలతోకొట్టేరుట కూడా రత్నాబాయినీ మరికొందర్నీ.'

'మరి ఆ బిల్లుమూలంగా మీకూనష్టమే అనుకుంటానే.'

'మేమూ అవస్థపడేవాళ్లమే. కాని కొన్నాళ్లనుంచీ నేను ఒక ధనవంతుని పోషణలో వుంటున్నాను. ఆయన నైజాందేశంలో ఒక జాగీరుదారు. నన్నుకూడా కొద్దిరోజుల్లో తనవూరు తీసికెళ్తారట. ఆయనకు భార్యలేదు.'

'అయితే ఈవూరు వదలేస్తున్నారన్నమాట'

'ఔను. ఆయన కీప్రాంతాల కొన్నిపను లున్నవిట. అవి చక్కబెట్టుకొని వెళ్లిపోతాము. కాని రాధికనుగురించి నాకు దిగులుగావుంది.'

'ఏమి?'

'ఆమె నావంటిదానివద్ద వుండటము నేది ఆమెకు ఒకకళంకమన్నమాట. ఆమె అభివృద్ధి కది చాల ఆటంకమౌతుంది. అదీకాక బ్రాహ్మణ సంతానమేమో మాంసాహారం తినదు. అది అమెకు అలవాటుచేయలేకపోయాము.'

'మరేమిచేస్తా వాపిల్లను.'

'రాధికను ఒక వేశ్యనుగాచేయుటము నాకిష్టముగానిపని. నావలె అందుకామె తగింది కాదు మీలాంటి వారెవరైనా పెంచుకునేటట్లయితే ఇచ్చిపోతాను.'

నేను రాధికకేసి తలత్రిప్పిచూచాను. మంచంమీద అప్పుడే పడుకొని నిద్రబోతూన్నది. 'ఈ చిన్నపూవును అసంఖ్యాకులగు విటులచేత నలిమివేయబడుటకు ముందే కాపాడుట పుణ్యంగాదా!' అనుకున్నా. అక్కడనుంచి నేను ఇంటికిబోయేటప్పటికి చాలా ప్రొద్దుపోయింది.

*       *       *

ఇప్పుడు రాధిక నాదగ్గరే వుంటున్నది. ఆమె నాయింటికివచ్చిన రెండుసంవత్సరములకు ఒక 'మెటర్నిటీహౌస్' కట్టించాను. అక్కడ ఎవరైనాసరే రహస్యముగా ప్రసవింపదలచినవారు వచ్చివుండవచ్చును. అట్లా కనబడిన పిల్లలనుపెంచుటకు తగిన యేర్పాట్లునూ చేయుబడును,

మరొకసంగతి రాధిక కిప్పుడు పదిహేను సంవత్సరాలు. సంగీతం అదీ బాగాచెప్పించాను. ఇంగ్లీషు రాదుగాని తెలుగులో సాధారణజ్ఞానంవుంది. ఆమెకు వరుడు కావాలి. అందగాడై వుండాలి, తప్పదు. స్వతంత్రంగా జీవితం గడుపుకోగలవాడై వుండాలి. బాగా చదువుకున్నవాడు కూడా ఐవుండాలి

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి ఏ.

## రహస్యవేదన

ఈ దినాంత దురంత విషాదవేళ ;
నేటి, ముని మాపుంగో, రజనీ కుమారి
రక్తవదనంబు జూపె ; నా ప్రాణసమితి
క్రుంగిపోయెను లోలోన కుమిలిపోయె.
చెప్పరాని యెదోచింత చిత్తమందు
లేత పొగమంచువలె నావరించుకొనెడు.
అంధకారము నిండె, నీ యఖిల జగతి,
ఓసి విశ్వాసహీనమై యున్న జగము ?
ఈ కవర్గ పాసకుని నన్ను సాకవీవు
కాని దుఃఖాలు కష్టాలు కొన్కలిడెదు
నీకు మాత్రము అమృతధునీప్రవాహ
మొలయగాజేసి రత్నాలు మూటగట్టి
విలువలేనట్టి హారాలగళమునందు
తాల్పజేసెద, నే, బోవ, తలతువేమి ?

—పెమ్మరాజు రాజగోపాలము, బి. ఏ.

# ఆంధ్రము - హిందీ

ఈ రెంటినీ గురించిన తగాదా చాలా వృద్ధి అయింది.

అంటే ఇరువాగులవారు పరస్పరంగా వ్యక్తిపరంగా మాటలనుకుండే వరకూ వచ్చింది అని అర్థము.

శ్రీపాదవారి దృష్టిలో హిందీకి అనుకూలంగా మాట్లాడేవారంతా ఆంధ్రదేశద్రోహులు అందువల్లనే శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు ఒక్క కృతిలో "ఆంధ్రాభిమానము తగ్గిన వారిలో మొదటివారు" అయినారు. కారణము ఆంధ్రపత్రికలో వారు వ్రాసిన వ్యాసమే.

ఈ అన్నవారిలోనూ, అనిపించుకున్న వారిలోనూ ఎవరు ఎక్కువ ఆంధ్రాభిమానం గలవారు అనేది తర్కించవలసిన విషయంగాదు కానీ శ్రీ ఉన్నవ పంతులుగారి ఆంధ్రాభిమానంగూడా ప్రశ్నించ తగ్గది గాదు. తెలుగుభాషలో కావ్యు గ్రహించి వ్యావహారిక భాషలో నవరసాలూ చిప్పిలే ఒక వచనప్రబంధాన్ని వ్రాసింది వారు. అన్నివిధాలా ఆంధ్రుల ఉన్నతికోసం ప్రయత్నించినవారిలో వారూ ఒకరు.

ఇంతవరకూ జరిగిన ఈ వివాదమువల్ల కలిగిన ఫలిత మేమిటి? "బ్రాహ్మణానాం అనేకత్వం" అనడానికి బదులు "ఆంధ్రాణాం అనేకత్వం" అంటే ఆసామెత మరీ సార్థకమవుతుంది. ఈ వివాదంవలన ఆంధ్రుల ఈ అనేకత్వానికి మరొక పట్టుగొమ్మ చిక్కింది. వాక్కుల హానికీ, పత్రికలు నిండడానికీ సావకాశం కలిగింది. ఫలితంమాత్రం శూన్యం.

అయినదానికీ, కానిదానికీ ఖిజ్జాలు పెంచుకుని అసలు విషయాలు మరిచిపోయేస్థితికి రావడమే ఆంధ్రులలో ఉండే లోపమని గ్రహించిన పెద్దలుగూడా ఆంధ్రులలో ఉన్న ఆలోపమే వృద్ధిగావడానికి దోహదం చెయ్యడం ఆంధ్రాభిమానంలోనే చేరుతుందా?

హిందీ చదివినందువల్ల గలిగే లాభాలు ఏకరువు పెట్ట నవసరముతేను ప్రత్యర్థులు వాటినిదివరకే త్రోసి రాజన్నారు గనుక. వ్యవహారం ఎంతదాకా వెళ్ళిం దంటే హిందీ ఎప్పటికీ అవసరంలేదనీ, హిందీ సామాన్యభాష కావడానికి అవకాశంలేదనీ, సామాన్య భాష హిందీకావలెనా ఉర్దూకావలెనా అనే ప్రశ్న ఇంకా తేలలేదనీ, హిందీకి ఎక్కువ ఓట్లు సంపాదించడానికి కాంగ్రెసు దక్షిణదేశస్థులను హిందీ చదవమని దుష్ప్రచారం సాగించిందనీ, ఆదుష్ప్రచారానికి గాంధి చేయూత ఇచ్చాడనీ, తిరిగి ఇంతా వృథాఅయితే అప్పుడు అందరూ ఉర్దూ విధిగా చదవవలసిందే ననీ అనేదాకా తేలింది.

కాంగ్రెసు దేశాన్ని నాశనంచేసిందనీ, గాంధి యువకుల జీవితాలమీద ప్రళయతాండవం చేశాడనీ, ఆంధ్రరాష్ట్రం రాకపోవడానికి కాంగ్రెసే కారణమనీ నమ్మేవారు గాంధిమీద ఏమి ఆరోపించినా ఆరోపించవచ్చు. కాదూ గాంధి తెలివితక్కువవాడయినా కావచ్చు, స్వార్థపరాయణుడైనా కావచ్చు. అందువల్ల ఎవరికీ నష్టంలేదు. ఆయనగానీ, ఆయన నాయకత్వ మంగీకరించిన ఆంధ్రులుగానీ దేశద్రోహులయితే చరిత్ర "దేశద్రోహులు" అనే ఒక అధ్యాయానికి నోచుకుంటుంది. అంతే.

ఉర్దూ ఒకవేళ సామాన్యభాష అయితేగియితే తిరిగీ అప్పుడు ఇంత అవస్థపడి ఉర్దూ నేర్చుకోవలసి ఉంటుందీ అనేమాటమాత్రం అర్థంకావడంలేదు. కారణమేమంటే - మనకు ఉర్దూ నేర్చుకోవడం కన్న హిందీ నేర్చుకోవడం సులభం. ఇందులో సంస్కృత పదాలు హెచ్చు. మన తెలుగూ ఆనోమే నోచుకున్నందువల్ల హిందీ నేర్చుకోవడం సులభమౌతున్నది. హిందీ నేర్చుకుంటే ఉర్దూకూడా అట్టే కష్టంలేకుండా అర్థంచేసుకోవచ్చు. ఆ పరిస్థితులలో తిరిగీ ఉర్దూ

నేర్చుకోవలసిన అవసరం ఉండకూడదు.

ఈ విషయంలో కాల్యాణకాపూరులో వినయాశ్రమ వార్షికోత్సవ సందర్భమున కలేల్కర్ పండితుణ్ణి కొందరుపెద్దలు ఇదేప్రశ్న వేశారు. 'జాతీయభాష కావడం విషయంలో ఉర్దూ, హిందీలకు తగాదా ఉన్నదా?' అనిప్రశ్న. దానికి ఆయన 'ఉర్దూ హిందీలకు ఏమాత్రం తగాదాఉండడానికి అవకాశం లేదు. హిందీలో సమపాళంగా పరిషియనుమాటలు, సంస్కృతపుమాటలు కలిసిఉంటవి. ఆభాష హిందువులు, మహమ్మదీయులు సమానంగానే అర్థంచేసుకుంటారు. మేమయినా పరిషియను, అరబ్బీమాటలనే ఎక్కువగా వాడుతాము. ఇక్కడికి వచ్చినప్పుడు మేం మాట్లాడే భాషలో సంస్కృతంపాలెక్కువగా ఉండేటట్లు ప్రయత్నంచేసి మాట్లాడుతాము. ఉత్తరదేశంలో ఉన్న ఉర్దూహిందీలకు ఎక్కువభేదం లేనేలేదు. స్వల్పంగా భేదాలున్నా పాటించతగ్గవి కావు. ఒకవ్యాసంగాని, కథగాని దేవనాగర లిపిలో ఉంటే హిందువులు సులభంగాచదివి అర్థం ఏలాచేసుకుంటారో అదే ఉర్దూ లిపిలోఉంటె అంతసులభంగానే మహమ్మదీయులు అర్థంచేసుకుంటారు. కనుక ఆ తగాదాకు అవకాశం లేదు. పోతే లిపిదగ్గర ఈ తగాదా రావచ్చు కాని ఆ తగాదావల్ల ఆట్టే పేచీలేదు. అవసరంఉన్నవారు రెండు లిపులూ నేర్చుకోవచ్చు. నేర్చుకుంటారు. ఏదో ఒకలిపి నేర్చిఉంటే పని గడిచిపోతుంది. దక్షిణదేశంలో దేవనాగరలిపి మేం అవలంబిస్తున్నామంటే అది సంస్కృత గ్రంథాలు చదవడంకోసం చాలామంది ఏలాగూ నేర్చుకుంటారు గనుకనూ, ఇది నేర్చుకున్నవాళ్ళు సంస్కృతంకూడా నేర్చుకోవడానికి ఎక్కువగా వీలుంటుంది గనుకనూ.' అనిచెప్పారు.

అయితే కొందరు హిందీప్రచారంకోసం వచ్చిన ఒక పెద్దమనిషి చెప్పినమాటలు మనము సిద్ధాంతాలా అని సందేహించవచ్చు తమ వాదనానుకూలంగా. కాని నమ్మతగనివారిని, నమ్మతగ్గవారిని సులభంగానే కనుక్కోవచ్చు. మసిబూసి నేరేడుకాయ చెయ్యడానికి ఈ విషయాన్ని గురించిన వివరాలు అనేక ఇతర తరహాలుగా కనుక్కోడానికి సాధనాలు లేకపోలేదు. కనుక అప్రయత్నాలు ఎవరూచెయ్యరు. ప్రపంచకంలో మరి ఏ ఇతరులలోనూ నమ్మకంలేనివారికి చెప్పగలిగిందే ఉండదు మనలో హిందీ కొద్దిగా నేర్చుకున్నవారు సికింద్రాబాదువెళ్ళి వాళ్ళతో మాట్లాడి వాళ్ళు మాట్లాడిన దానిని సులభంగా తెలుసుకుంటున్న దాన్నిబట్టే ఈ మాటల సత్యం సులభంగా బోధపడుతుంది.

మరోవిషయం కాంగ్రెసులో కొందరు హిందీకి ఓట్లు సంపాదించడానికి హిందీని దక్షిణదేశంమీద బలవంతంగా పడేస్తే మిగతా ఉర్దూ వాదులు ఈదుష్ప్రచారం ముందుముందు తమకు అడ్డంవస్తుందని గ్రహించలేనివారా? వారెందుకు దీన్ని తీవ్రంగా ఎదిరించడం లేదూ? వ్యతిరేక ప్రచారం సాగించడం లేదూ? ఆ వేవైనా ఉన్నప్పటికీ జనసామాన్యానికి తెలియడం లేదా?

సామాన్య భాషే కావలనంటే, కృతకభాష ఒకటి తయారుచేసి దాన్నే అందరూ చదివితే విషయం సులభంగా తేలిపోతుంది అన్నారు కొందరు. భేష్ అంతకన్న మంచిదేముంది? అయితే మరొకరిభాష సామాన్య భాష ఎందుకుకావాలి, మనం మరొకరిభాష ఎందుకు చదవాలి అనే అభిప్రాయాలతో బయలుదేరిందా ఏమిటి ఈ వితండవాదం అంటారా? ఎక్కువమందికి వచ్చిన దాన్ని మిగిలినవాళ్ళను చదవమనడం న్యాయమా, అందర్నీ మరోకృతకభాష చదవమనడం న్యాయమా అనేవిషయం న్యాయాన్యాయవేత్తలు గ్రహించలేరా?

దివ్యమైన కథలు చిలికే ఒక కలం ఈ ప్రచారంలో ఊపిరాడక తన సహజవ్యాపారం మానిందంటేనూ, ప్రతిభావంతమైన వాఙ్మయాన్ని ప్రసాదించగల ఒక పత్రిక ఈ వివాదంలోమునిగి వాఙ్మయసేవ మరిచిందంటేనూ ఆంధ్రభాషకు నష్టంకాదూ? అదిమాత్రం ఆంధ్రభాషాద్రోహం ఎందుకుకాదు? అంటే ఈ ప్రచారంకంటే అవే నిజంగా ఆచరణీయములనీ, ఆవశ్యకములనీ నామనవి.

ఈ ప్రచారంలో పీసపాటి సుబ్బారావుగారి మాటలని ఆంధ్రపత్రికలోనుంచి తీసిన కొన్నిమాటలు ఎక్కువగా ఉపయోగించబడ్డవి. ఆంధ్రపత్రికలో వారిమాటలు 'హిందీని వ్యావహారికంగా నేర్చుకోవాలె' అని. దానికి శ్రీపాదవారు 'హిందీని మీరు వ్యవహారంలో మాట్లాడడానికిగూడా, అనగా అన్నలతోనూ, తమ్ములతోనూ, ఇంటాబయటా, అన్నిచోట్ల హిందీనే మాట్లాడడానికి ఉపయోగించండి అని పీసపాటివారంటున్నారు విన్నారా? ఇంతకన్నవేరే ఏంనిదర్శనంకావాలె హిందీ ప్రచారకులు తెలుగును సాంతంగా త్రోసిరాజని దానిస్థానే హిందీని స్థాపించాలెనని ప్రయత్నముచేస్తున్నారని చెప్పడానికి?' అన్నారు. అప్పట్లో ఆ వ్యాఖ్యానం సరియైనది కాదని నాకుతోచింది. ఆమాట అనడానికి వాస్తవంగా జంకాను, వ్యాఖ్యానం సరిగాకపోతే ఆ మాటలు ఎవర్నిఉద్దేశించి వ్రాయబడినవో వారే సమాధానం చెప్పుకుంటారులే అని. వారూ చాలారోజులవరకూ మాట్లాడకపోతే నాఊహే తప్పు అనుకున్నాను. కాని పీసపాటి సుబ్బారావుగారు 15-12 34 తేదీన ఆంధ్రపత్రికలో వెలువిచ్చిన వ్యాసంచూస్తే నా మొదటి ఊహ నిజమేనని తెలిసింది. వ్యవహారికంగా హిందీని నేర్చుకోమంటే వ్యవహారికాంధ్రంలాంటి వ్యవహారిక హిందీ ఒకటిఉంది. వ్యాకరణంపేచీలకు భయపడక ఆలాంటిభాషను నేర్చుకోమని. పీసపాటివారికి మాత్రం ఆమాత్రం ఆంధ్రాభిమానం ఉండదని అనుకోవడం వారిని నిష్కారణంగా అగౌరవపరచడం గాదూ?

ఈ ప్రచారంలో మరొకమాట వినబడుతున్నది. ఆంధ్రభూమి, భారతి, చిత్రగుప్త, గృహలక్ష్మి ఇత్యాది పత్రికలన్నీ 'హిందీ తెనుక్కు అపకారంచేస్తున్నది అనేప్రచారాన్ని పూర్తిగా అంగీకరించినవట. నిజమే. ఇంతప్రచారం జరిగినపిమ్మటగూడా అస్మదాదులకు కొందరికి హిందీవల్ల తెనుక్కు అపకారంజరుగుతున్నదనే నమ్మకం గలగడంలేదు. కారణం మాలోనే ఉన్నది అనండి. కాని ఇన్నిపత్రికలవారు ఈ వాదానికి అంగీకారంఇచ్చారూ అంటే మా అభిప్రాయంమాత్రం వారందరికీ ఎక్కడ 'ఆంధ్రాభిమానం తగ్గినవారిలో మొదటివారు' అని అనిపించుకోవలసివస్తుందో అనే భయమేనని. ఒకరు ఏదంటే అందరూ అదేఅనడం ఆంధ్రులలో మామూలే నాయను కొన్నాళ్ళపాటయినా.

అసలు నామనవి మొదటినుంచీ ఈ ప్రచారమంతా నిష్ప్రయోజనమేనని. కారణమేమిటంటే, 1. ఎవరూ ఆంధ్రంస్థానే హిందీని ప్రతిష్ఠించాలెననే ప్రయత్నాలు చేయడంలేదు. ఆలా జరుగుతున్నదని సకారణంగా ఋజువుకాలేదు 2. ఒకవేళ ఆలాంటిప్రయత్నాలు జరుగుతున్నవని వాదనకోసం అనుకున్నా అలాంటి ప్రయత్నాలు వాటంతటఅవే నాశనం కాగలవు. జీవభాషలను నిర్మూలంచెయ్యడం అసాధ్యంగనుక. 3. ఆంధ్రభాష ఆలాంటి యత్నాలవల్ల సమూలంగా నాశనమయ్యేటంత ఒంటికాలిర భాషకాదు. 4. హిందీప్రచారకులలో ఎక్కువమంది ఆంధ్రులే. ఆంధ్రాన్నిసమూలంగా నాశనముచేయడమనే అభిప్రాయాన్ని వారికి ఆరోపించడం హిందీప్రచారకులను అగౌరవించడమూ, వారి ఆంధ్రత్వాన్ని శంకించడమూనూ.

హిందీని కొద్దిగా అక్కడక్కడ కొందరు నేర్చుకుంటున్నారు. దానిమీద దాడివెడలితే ఫలం శూన్యం. ఆంధ్రానికి ఉపకారం జరగవలెనంటే దాన్ని నలుగురూ నేర్చుకోవడానికి ఉత్సాహంకలిగేటట్లు చెయ్యాలి. దాంట్లో అందరికీ రుచికలిగించాలె. ఈ సందర్భంలో 18-12-34 తేదీ ఆంధ్రపత్రికలో శ్రీ గావిలాల గోపాలకృష్ణయ్యగారు వ్రాసిన విషయం గమనించతగ్గది. ఆంధ్రంలోగూడా గృహవిద్యాపరీక్షలుపెట్టి అందులో డిగ్రీలు, డిప్లొమాలు, బిరుదులు, బహుమతులు ఏర్పరచడం ఆంధ్రంఅందరూ విరివిగా నేర్చుకొని ఆదరించడానికి మంచిపద్ధతే. ఇదివరలో ఈ సందర్భంలోజరిగిన కొందరి ప్రయత్నాలు నిష్ఫలాలు కావడానికి తగిన ప్రోత్సాహం లేకపోవడమే కారణం. ఈ ప్రచారాలన్నీ మాని నిర్మాణకార్యక్రమాన్ని ఒకదాన్ని అనుసరిస్తే పదిరెట్లు లాభం కలుగుతుంది. దానికి నాకు తోచిన కొన్ని సలహాలు ఇస్తున్నాను.

ఒక పాఠ్యక్రమం ఏర్పరిచి పరీక్షలస్కీము ఒకటి ఏర్పాటుచేయాలె.

ఆ పరీక్షలు ప్రతి గ్రామంలో గాని, ప్రతి తాలూకా పట్టణంలో గాని జరిగేటట్లు చూడాలె.

జనాన్ని ఆకర్షించడానికి ఆ పరీక్షలకు రుసుము ఏమీ ఉండకూడదు.

విరివిగా బహుమతులు, డిగ్రీలు, డిప్లొమాలు వగైరాలు ఇవ్వడానికి ఏర్పాటు ఉండాలె.

బహుమతులకూ, మిగిలిన ఖర్చులకూ చాలా ధనం కావాలె. రుసుములులేకుండా పరీక్షలు జరుపవలెనంటే మరీకష్టం. అందుకుగాను ఈ ధనంకోసం విశ్వదాత నాగేశ్వరరావు గారిలాంటి దాతల సహాయాన ప్రయత్నాలు జరగాలె. కొందరు అహర్నిశాలు ఇదేపనిగా కష్టపడాలె.

పరీక్షాపత్రాలు కొంత కాలము వరకుగాని, సర్వదా గాని, ప్రతిఫలాపేక్ష లేకుండా సరిచూచుటకు కొందరు తయారుకావాలె. అలాంటివారికోసం ఎక్కువ శ్రమ పడవలసిన అవసరంఉండదు. ఈ ఆశయాలు తెలిసిన వారు దొరుకుతారు. దొరక్కపోతే ప్రయత్నంచేసి ప్రార్థించి స్వచ్ఛందసేవకులను సేకరించాలె.

పరీక్షలసలహా సంఘానికి విద్యావంతులగు పెద్దల సాయాన్ని కోరాలె.

కొన్ని దశాబ్దాలబాటు జరిగేటట్లు పునాదులువేసి ఈ కార్యారంభము చేయాలి.

ఈలాంటిది ఏదో ఒక నిర్మాణకార్యంవల్ల కొంత ఫలితంఉంటుంది గనుక ఆంధ్రభాషాభిమానులు యావన్మంది వృథా వాగ్వివాదాలకు తావీయక ఈలాంటి కార్యంలో తమశక్తులను కేంద్రీకరింతురుగాక అని సవినయంగా ప్రార్థిస్తున్నాను.

—'కాశ్యపి'

# ఓ పరమేశ్వరా!

ఎవ్వడెరుంగు నీవు రచియించెడు విశ్వనవీన కావ్యమున్
ద్రష్ట తదాంతరస్థరసంబుల మూల్యము నేర్పరింప ; నీ
వెవ్వరికై రచించెదవు ; ఈకృతి నేమియొనర్ప నెంచితో
యవ్వల ; నీదు భావము లనంతములైనవి లోకనాయకా!

కరము మనోహరమ్ములగు జగమ్ములు తావకచిత్రశాల ల
బ్బురములు నీదు చిత్రము లమోఘము, లెన్నడు మాసిపోవు సుం
దరతరశిల్పకారుడ వనారతమున్ సృజియించుచుందు ; వో
నిరుపమ సత్యరూప! యెటనేర్చితి శిల్పకళారహస్యముల్ ;

ఏ నొకచిత్రమౌదు భవదీయసశిల్పకళాపణమ్ములో,
నో నలినాక్ష ! యేల నట నుంచి తలంకరణమ్ముగా సనున్,
నీ నవనీతకోమలవినిర్మలప్రేమకు పాత్రనైన నా
ధ్యాన సమాధికిన్ ఫలిత మబ్బినటుల్ దలపోతు, నీశ్వరా!

—ములుమూడి ఆదిశేషాద్రి రెడ్డి.

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొను పత్రికాముఖమున జిజ్ఞాస నలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.



### ౪౧. సంశయము.

శ్లో॥ కాచిన్మృగాక్షీ ప్రియవిప్రయోగే
నిశీథనీ పారమపారయంతీ
ఆగాతు మాదాయ కరేణ వీణా
ముద్గ్రీవమాలోక్య (శ) నైరహాసీత్.

రాత్రియందు ప్రియుని వియోగమును పొందినదై గానముచేయుట కుద్యోగించి వీణను గ్రహించిన యిందలి స్త్రీ ఏ కారణముచేత పైకిచూచి వీణను విడిచిపెట్టెను?

—నేతి కామేశ్వరశాస్త్రి.

### ౪౨. రాముడుకూల్చిన వృక్షములు.

కిష్కింధలో వాలివధకుపూర్వము సుగ్రీవుని సంతుష్టికొరకు శ్రీరాముడు తన బలప్రదర్శనము నిమిత్తము కూల్చినవృక్షములు యేమి? వాటికి యేయే రామాయణములో యేయే పదప్రయోగములు చేయబడినవి? వాటివాటి వివరములేమి?

—బి. సింహాచలము.

### ౪౩. విషము.

పాము, తేలు మున్నగు విషజంతువుల విషము లాయాజంతువులకేల హానికల్గింపవు? ఇతరులకేల కీడుచేయును?

—బుర్రా నరసింహమూర్తి.

### ౪౪. ఇనాందారుల బిల్లు

ప్రస్తుతము మదరాసు గవర్నమెంటువారిచే ఉద్దేశింపబడిన 'ఇనాందారుల బిల్లు' వలన రైతులకు లాభమా? నష్టమా?

— మొదలి వెంకటరామయ్య.

### ౩౪. పుట్టినరోజు

లీపుసంవత్సరములో ఫిబ్రవరి నెలకు 29 రోజులని ఎల్లరకు తెలిసినవిషయమే. సదరుసంవత్సరమున శిశువు ఫిబ్రవరి 29-వ తేదీని జన్మించిన ఆంగ్లేయులు సదరునెల చివరరోజున జన్మించినట్లుగా లెక్కవేసుకొందురు. మరుసటిసంవత్సరముల ఫిబ్రవరి నెలకు 28 రోజులు మాత్రమే కనక సదరుసంవత్సరము ఫిబ్రవరి చివరదినమందు జన్మదినోత్సవము వచ్చును.

—ఎ. సత్యనారాయణ.

ఈ ప్రశ్నపై బినవారు, హైందవులకు తిథులుకూడ కలవుగాన అంత ఇబ్బందియుండదని వ్రాసినారు. హైందవులకును ఇబ్బందికలదని మనవి. ఒకసంవత్సరములో అధికమాసమున పుట్టినచో వారి కామాసము తిరిగి ఎట్లువచ్చును? ఫిబ్రవరి 29-వ తేదీ 4 ఏండ్లకైనను ఒకమారు వచ్చుచుండును. కాని ఒకయేడువచ్చిన అధికమాసము ఇంకొకమారు పలుసంవత్సరములకుగాని రాదు. అప్పుడు అధికమాసమునకు బదులుగా నిజమాసమున చేసికొందురు. ఇట్లె పశ్చిమదేశస్థులును.

—పండితారాధ్యుల వీరేశలింగము.

### ౩౫. మంత్రములు

ప్రతి మానవునియందును కొంత విద్యుచ్ఛక్తిగలదు. దీనికే తేజస్సు అనిపేరు. ఇంగ్లండులో ఒకస్త్రీకలదు. ఆమె యే గడియారముకెదురుగా నిలబడినను, ఆ గడియారము ఆగిపోవుచుండును. దీనికి కారణమేమని డాక్టర్లు పరీక్షచేసి, చెప్పినదేమనగా, ఆమెయందు విద్యుచ్ఛక్తి ఎక్కువగానుండుటచే ఆ విద్యుచ్ఛక్తి గడియారములోని ఉక్కుమరలను ఆకర్షించివైచుటచే నిలిచిపోయినవి అనిచెప్పిరి. కాన ప్రతివానియందును ఏనొకొంత విద్యుచ్ఛక్తియుండుట నిజము. ఈశక్తి సాధారణముగా మనముచేయు చెడుపనులవలన

న్యూట్రలైజ్ అయిపోవుచున్నది. ఇట్లు న్యూట్రలైజ్ కాకుండ చేసికొని విద్యుచ్ఛక్తి తమయందు నిలబెట్టుకొనుట యెట్టివారికేని దుస్సాధ్యము. మునీశ్వరుల కిందు చేతనే ప్రభావశక్తి కలిగియుండును. తేలు, పాము మంత్రములు నేర్చుకొనువారు ఆ మంత్రములను నిత్యము యథావిధిగా పట్టుదలతో నిశ్చలమనస్సు కలిగి ప్రాతస్స్నానానంతరము పఠించుకొనుచుందురు. గ్రహణముపట్టిన సమయములందు ఈ మంత్రములు తదేకదీక్షతో ధ్యానము సేయుదురు. దీనివలన మనోబలశక్తి యభివృద్ధిచెంది అందుమూలమున మంత్రముపట్టిచ్చును. నిత్యము త్రికాలములందును సూర్యుని బాగుగావిచ్చిన కన్నులతో ఏకైకదీక్షతో చూచుచుండిన సూర్యునిలోని తేజస్సు మనకండ్లలో కొంత ప్రవేశించును. అట్టి కన్నులతో ఏదిచూచినను మనకు వశ్యమైపోవును. దీనినే ఆకర్షణశక్తి అందురు. ఈ ఆకర్షణశక్తివలననే తేలు, పాము, విషములు దిగిపోవును. దీనికెల్ల తదేకదీక్ష, పట్టుదలయే ముఖ్యములు. ఇందులోని రహస్యమింతే కాని యింకొకటిలేదు. అట్టి మనశ్శక్తి లేనివారి మంత్రములు పనిచేయవు......

—పండితారాధ్యుల వీరేశలింగము.

### ౩౦. కాకరపాదుకు వేడినీళ్ళపోత

వంగపాదులు, బీరపాదులు, మొదలగు వానివలె కాకరపాదు ప్రత్యేకముగ పొలములందు పైరుచేయుట తెలుసుకాదు. శ్రద్ధగలరైతు తన పాకముకామకడ ఒకటిరెండు ఈ కాకరపాదులు పెట్టుటగలదు. కూరకాయలలో కాకరకాయలు నాయకములని పేరుపడినను, బజారులలో సాధారణముగ అన్ని కూరకాయలకంటె కాకరకాయలు హెచ్చువెలకు పలుకుచుండినను కాకరపాదులు ప్రత్యేకముగ పొలములందు పైరుచేయకుండుటకు కారణము వానిని పెంచుటలో గలకష్టమే. మాదొడ్డిలో నీళ్ళుపొయ్యేకు కొంచముదూరమున కాకరపాదుగలదు. పందిరిమీద ఒకపాదు అగుసరికి మరియొకటి అందుకొనులాగున పాదులుపెట్టుచుందుము. మేము పోసుకొను వేన్నీళ్ళన్నియు ఆపాదు మొదటికిపోవును. ఇవి కాసినట్లు పొలములో పాదులు కాయకుండుట నా అనుభవములోని విషయము.

—ముత్యాల వీరాస్వామి.



# స్త్రీల కర్తవ్యము

స్త్రీలు తమ స్వతంత్ర, హక్కు, సత్త్వములను సంపాదించుకోడానికి, స్త్రీలుకూడా శాసనసభలలోను, స్థానికసంస్థలలోను పాలుగొనవలసినది అవశ్యకంగాన, రాబోవు కౌన్సిలు ఎన్నికలయందు స్త్రీలు కనీసం జిల్లా కొక్కరువంతున (ప్రత్యేకస్థానాలు గాక) నిలబడి విజయమందుటకు తగిన కృషిచేయాలి. కాంగ్రెసు పార్లమెంటుబోర్డువారు స్త్రీలకుకూడా తగినంత ప్రాతినిధ్యం యివ్వాలని కోరుతాను. ఇందుకు స్థానికనాయకులు ఉదారభావంతో సర్వవిధాల తోడ్పడాలి. ఇదిగాక స్త్రీలకర్తవ్యం ఇప్పుడత్యంతంగా ఉంది. విద్యావిషయంలో, సాంఘికంలో, రాజకీయంలో స్త్రీలు సర్వవిధాల ఉన్నతి పొందడానికి స్త్రీల ప్రచారం చాల అవసరం. సమాన ప్రాతినిధ్యం కావాలని అనేటప్పుడు స్త్రీ సంఘాలు ప్రత్యేకం అవసరమా అని ఒక ప్రశ్నయున్నది. నిజంగా స్త్రీ పురుషులకి సమానప్రాతినిధ్యంవుంటే ఇది అవసరంలేదు. కాని స్త్రీల సమాన ప్రాతినిధ్యమే కాదు. అధికమే కావాలి. అన్నిటిలోను అనేవారిలోనే, వారి స్త్రీలే ఏ కొద్దిమందో దక్క సభలకిగాని, మరే ఉద్యమానికిగాని రాకపోవడం సర్వసామాన్యం. ఈ స్థితితప్పి సర్వత్రా స్త్రీలు సమాన స్వాతంత్ర్య అధికార హక్కులు పొందగలిగేవరకు ప్రత్యేకం స్త్రీలలో అధికంగా ప్రచారం కావడానికి, వారు అవసరమైన అన్ని విషయాలలోను పాల్గొనేవరకు ప్రత్యేకస్త్రీసంఘాలు అవసరమే. స్వాతంత్ర్యసిద్ధికి, అవసరమైన విద్యావిధానమునకు, సంస్కరణకు స్త్రీలు పురుషులతో సమానంగా సేవజేయాలి. రైతు సంఘాలలో, గృహపరిశ్రమలో అన్నింట్లో స్త్రీ పురుషుల యుచ్ఛదశకు స్త్రీలే మాతృస్వరూపిణాలని వారి యున్నతికి కృషిచేసే సోదరులు కొందరున్నారు. వారికి మా కృతజ్ఞత.

[విశాఖపట్టణమున జరిగిన ఆంధ్రరాష్ట్ర జాతీయ మహిళాసభలో శ్రీమతి పోనకా కనకమ్మ గారి అధ్యక్షోపన్యాసమునుండి.]

# మణిమాల

## గ్రద్దకు వైద్యచికిత్స

కొద్దిరోజుల క్రిందట విశాఖపట్టణపు సముద్రపు టొడ్డున యూరోపియనులపిల్లలు వినోదార్థము ఒక గ్రద్దను తుపాకితో కాల్చిరి. గ్రద్ద దెబ్బతినిని క్రిందపడినది. చావసిద్ధముగానున్న దానిపై రాళ్లు రువ్వుచు యిసుకలో ఈడ్చుచు కొంతసేపు ఆడుకొని సాయంత్రమగుటచే దాని నచ్చటవిడిచి వారు వెళ్ళిపోయిరి. నేను మా పాఠశాలపిల్లలకు అప్పుడప్పుడు తగులుచున్న చిన్నచిన్న దెబ్బలకు మందులు వేయుట వాడుక. అగుటచే మాస్కూలు విద్యార్థులు ఆ గ్రద్దను నావద్దకు తీసికొనివచ్చిరి. అప్పటికి దానికి స్పృహ లేదు. శరీరమునిండ తగిలిన గాయములనుండి రక్తము వచ్చుచున్నది. నాలుక పైకి చాచియున్నది. కన్నులు మూసికొన్నది. కాని హృదయము తొందరగా కొట్టుకొనుచున్నది. ఈస్థితిచూచి కొన్నినిమిషములలో ప్రాణము పోవుననుకొంటిని. చల్లని గాలివచ్చుతావున నుంచితిమి. గాయములనుండి యింకను రక్తము స్రవించుటచే వెల్లికిలపరుండబెట్టితిమి. కొన్నిగంటలకు కండ్లు తెరచిచూచినది. ఇంక కొంతసేపటికి దాని శరీరమును తాకినవారిని ముక్కుతో పొడుచుటకు ప్రయత్నించుచున్నది. నాలుక పైకి చాచిఉండుటచే నీటినికూడ మ్రింగలేకపోయినది. దాని శరీరమంతయు పరీక్షచేయగా బోరవద్ద అనగా హృదయమునకుపైగా చాలలోతైన గుండుదెబ్బయున్నది. దానినిచూచి తుపాకిగుండు లోపల ఉన్నదనుకొంటిమి. కుడికాలు తొడయెముకయు, మోకాలుయెముకయు, సంధించుతావులో మరి ఒకగుండు తగిలినది ఆగుండు లోనచొచ్చుటచే కాలు మడతపడక చాచియేయున్నది. ఎడమరెక్క దండయెముకవిరిగి పైకివచ్చివేయుటచే రెక్క వాలిపోయియున్నది. ఇవన్నియుచూచి గ్రద్దకు చావు నిశ్చయమనుకొంటిమి. అయినను గాయములకు ప్రథమచికిత్స చేసి ఒక చిన్నగదిలోఉంచి తలుపులన్నియు మూసియుంచితిమి. మరునాటికికూడ బ్రతికియేయున్నది. ఆనాడు పదకొండుగంటలకు శస్త్రచికిత్స చేయుటకు వలయు పరికరములన్నియు సిద్ధముచేసి గ్రద్దను గోనెపై వెల్లికిలపరుండబెట్టి నా విద్యార్థులు కాళ్ళను, తలయు కదలకుండగా పట్టుకొనియుండగా కాలు వద్దనున్న గుండు తీయుటకై చిన్న కోతగుండుకున్న ప్రక్కను కోసి జాగ్రత్తగా గుండును తీసివేసితిని అప్పటికి గ్రద్ద వణికిపోవుచున్నది. తరువాత బోరలోనున్న గుండును తీయుటకు అచ్చట చిన్నకోతకోసి ఫోర్సిప్సుతో గుండుకొరకు లోనవెదకితిని. ఎంతలోతునదూర్చి వెదకినను కనబడలేదు. రక్తము విస్తారముగా పోవుచున్నది. గుండు, పైకి దూసికొనిపోయినదేమో అని చూచుసరికి వీపుపైకి అనగా రెక్కదండయెముకవిరిగిన స్థలమువద్ద ఒక గాయమున్నది. ఇదిచూచి బోరపైని తగిలినగుండు దూసుకొనిపోయి వీపుపైని గాయముచేసుకొని రెక్కదండయెముకను విరిచి పైకిపోయినదని గ్రహించి, అన్ని గాయములను కార్బోలిక్‌లోషనుతో శుభ్రముగా కడిగి బోరోయిడోఫారము గాయములపైవేసి దానిపై కాటన్‌ఉంచి అంటుకొనిఉండుటకు టించర్‌బెల్జోనా వేసి గదిలో బోరిగిల్లా పరుండపెట్టితిమి. మ్రింగలేకపోవుటచే ఆహారమిచ్చుటకు అవకాశము లేకపోయెను. మూడవరోజున ఆహారమేమి యిచ్చుటకును తోచక మేము శరీరాభివృద్ధికై వాడుచున్న బెంగాల్ కెమికల్ వర్క్సువారి కాడ్‌లీవర్ ఆయిల్, విత్, హైపోఫాస్ఫైట్సు అను చేపనూనెను అర టీస్పూను ఒకఔన్సు మంచినీళ్ళలోకలిపి స్పూనుతో కొంచెము కొంచెము గొంతుకలో పోయుచుండగా చాల కష్టముపై మ్రింగుచుండెడిది. ఈ విధముగా వారము రోజులు గడచినవి గాయములు కొంచెముకొంచెము మానుచున్నవి. దగ్గరకు వెళ్ళినవారిని పొడుచుచుండుట, చిన్నగంతులువేసి నడచుట ప్రారంభించెను. నాలుక యథాస్థానము లోనికిపోయినది. అప్పటినుండి చిన్న

చేపలను చిన్నచిన్న ముక్కలుగాతుంచి నోటినివిప్పి స్పూనుతో గొంతుకలో పడవేయుచుండెడి వారము. ఈవిధముగా మరి వారముదినములు గడచు సరికి చిన్న చేపలను తనంతతానే తినుచుండెను. గాయములు పూర్తిగా మానినవి. కాలుమాత్రము కొంచెము మెక్కుచుండెను. రెక్కయొక్క కాంపౌండు ఫ్రాక్చర్ అగుటచే దానిని సరిచేయుటకు అవకాశములు కలుగలేదు. ఈవిధముగా దినదినాభివృద్ధి నొందుచు బడి ఆవరణలో స్వేచ్ఛగా తిరుగుచు కనుపించెడి, పెట్టిన చేపలన్నియు తినుచుండెను. ఎన్నిరోజులున్నను రెక్కయొక్క అతుకుకొను అవకాశము కనబడకుండుటచే గ్రద్దను ఒక దినమున పట్టణసమీపమునందున్న రాస్ హిల్ పైకి గొనిపోయి నిర్మానుష్యమై, చెట్లుదట్టముగా నున్న స్థలమున విడిచి ముందుకొన్ని చేపలనుంచి వచ్చితిమి. గ్రద్దశరీరమునుండి తీసిన గుండు ఒకటి నాల్గవవంతు అంగుళము పొడవుగానుండి ముందున సూదిగను వెనుకను లొత్తయు గలిగియున్నది. ఆ గుండును మాస్కూలు మ్యూజియములో నుంచితిమి.

—నార్నిండి రామారావు.

* * *

## దయ్యములు

మనము ఎవరితోనైనను ఒకమాట చెప్పుదుము. తర్వాత కొన్నాళ్ళకు ఆమాట మరచిపోయి తిరిగి కొంతసేపటికి జ్ఞప్తికి తెచ్చుకొందుము. ఈ మధ్యకాలమునందు మనము మరచినమాట తిరిగి ఎట్లు జ్ఞాపకమువచ్చినది? ఎచ్చటనుండివచ్చినది? ఇంత కాలము ఎచ్చట మరుగుపడియున్నది? గాలి (ఎట్మాస్ఫియర్)లో ఈథర్ అనునొక పదార్థముగలదు. అందు ఈ మరచిపోయినమాట దాగియున్నది. అట్టి ఈథర్ నందే దయ్యమను వస్తువును నివసించియుండును. మనుష్యులు చనిపోవునప్పుడు కొన్ని కోరికలు మనస్సునపెట్టుకొని అవి నెరవేరనిబెంగచే చనిపోవుదురు. అట్టి మనుష్యులజీవనములే ఐహికవాంఛలు గలవగుటచే చులకనగా ఊర్ధ్వలోకమునకుపోలేక గాలిలోని ఈథర్ నందు వాయువుగామారి నివసించుచుండును దానికే దయ్యమని పేరు. అయ్యది తనకోరిక నీడేర్చుకొనుటకే మనుజుల నావహించును. (గాలిద్వారా) కాని విద్యుచ్ఛక్తిబలము ఎక్కువగానుండి మనోధైర్యముగలిగిన మనుష్యులలోనికి దయ్యములు దొరలేవు. ఏలయన ఆ మనుష్యునిలోని విద్యుచ్ఛక్తికి ఈ చెడుగాలి మాడిపోవును. కనుక దయ్యము విద్యుచ్ఛక్తి తక్కువగా గలిగిన అనగా సైకికల్ పవరు ఎక్కువగానున్న స్త్రీలయందును శిశువులందును సులభముగా ప్రవేశించును. మనోధైర్యము గలిగినయెడల వీరియందును ప్రవేశింపజాలదు. అనారోగ్యతగలిగిన వారియందేగాని దృఢవంతులయందు కలరాపురుగు వృద్ధిపొందగలదా? దీనికి నిదర్శనమేమనగా: ఒకస్త్రీకి దయ్యముపట్టినప్పుడు, మనము, 'నీవెవరు?' అని అడిగినప్పుడు 'ఫలానా వెంకమ్మను,' అనియు, 'నీవు ఎందులకువచ్చితివి?' అనిన, 'నాకు గారెలు కావలెను.' 'నీవు ప్రాణముపోయినప్పుడు నీ కొడుకు ఏమి పెట్టినాడు?' అనగా 'ఉల్లిపాయిపకోడీలు' అని యథార్థమయిన సమాధానములు చెప్పుటయే యెట్లు తటస్థించుచున్నది? వెంకమ్మ చనిపోయినప్పుడు పకోడీలుతినినది వాస్తవమే. తాను దయ్యమైనప్పుడును పకోడీలనే చెప్పుచున్నది. పంచదారయని యేల చెప్పకూడదు. అయితే మీకు ఈ దయ్యముపట్టినమనిషి వెంకమ్మనుగూర్చి తాను ఇదివరకే ఎరిగియున్నదేమో అని సందేహము కలుగవచ్చును. నేను ప్రత్యక్షముగా నొక సందర్భములో పరిశీలించితిని. ఒకయూరిలో వెంకమ్మ చనిపోవుటయు, ఆకాలమున కింకను ముందే దయ్యముపట్టినమనిషి రోగియై ఇంకొకయూరిలో నుండుచుండుటయు నాయనుభవము ఇదిగాక యింకొక నిదర్శనము. ఒకరిని దయ్యముపట్టినప్పుడు సాధారణముగా మనము గిల్లుదుము, జువ్వతో కొట్టుదుము. ఈగిల్లులు, దెబ్బలు దయ్యము ఆవరించియున్నంత కాలము ఆ మనిషికి నొప్పికలుగక, కొంతసేపటికి (అనగా దయ్యము వదలివేసినప్పుడు) తర్వాత ఆ గిల్లిన వ్రేలు, ఆ వాతలు బాధపెట్టుచున్నవని చెప్పుచున్నది. ఇది సాక్షిగా చూచుచుంటిమే. భూతవైద్యులు అని

బయలుదేరి బూటకపు కబుర్లుచెప్పువారు పట్టినటులతే కాని నిజముగా చేయగలవారు కారు. అది నిజమే. దయ్యముపట్టినప్పుడు ఇట్టి భూతవైద్యులను తీసికొని వచ్చుట గొప్ప పొరపాటు. వారి పొట్టపోసికొనుటకు, పేరుప్రతిష్టలకు అట్టి పనులుచేయుదురు. అదివట్టి ఆడంబరము. దయ్యముపట్టినవారికి ప్రథమచికిత్స ఏమనగా సాంబ్రాణిపొగ వేయవలెను. దయ్యము పట్టుట అనగా ఒకవిధమైన చెడుగాలి మనిషినావరించుట అనిగదా అనుకొంటిమి. అట్టిసమయమున ఆ చెడ్డగాలిని పైకి తోమివేయవలెను. సాంబ్రాణిపొగ ఆపనిచేయును. ఇండ్లకే ధూపమువేయుట, ఈ సాంబ్రాణిపొగ శరీరమునకు చాల ఆరోగ్యమునిచ్చును. ఈ గాలి దయ్యపు గాలిని తరిమివేయుటకు ప్రయత్నించునపుడు రెంటికిని సంధికలుగును. ఆ సమయమందే ఒళ్ళువిరిచి ప్రేలాపన బయలుదేరును. కొంతవడికి క్రమముగా తగ్గును. ఆ మనిషికి ధైర్యముకలుగునట్లు మాట్లాడవలెను. మఱియు దుర్బలులకు ఆరోగ్యమునిచ్చు మందులిప్పించి మంచి పుష్టిచేయు యాహారము ఇవ్వవలయును. అట్లు చేసిన యెడల చెడుగాలులు దరికి రాలేవు.

—పండితారాధ్యుల వీరేశలింగము.

* * *

## జ్యోతిష్కులు చెప్పిన ఫలములు తప్పిపోవుటకు కారణములు.

జననకాలము సరిగా తెలియనియెడల చెప్పిన ఫలములు సరిగా జరగవు. సరియయిన జననకాలమే జాతకమునకు ఆధారము. కొందఱు జలోదయకాలమును జననకాలముగా వేయుదురు. ఇది శిశుజననమునకు ప్రథమావస్థయగునుగాని జననకాలముగా గణింపఁదగినది గాదు. కొందరు శీర్షోదయ కాలమును గ్రహింతురు. కొందురు భూపతనకాలమును గ్రహింతురు ఇవియును సరియయిన జననకాలములు గావు. తల్లిగర్భములోనుండి మాంసాస్థిమయమయిన శరీరము వెలువడుటతో మన శాస్త్రమునకుఁ బనిలేదు. తల్లిప్రాణమునుండి వేఱయి శిశువు స్వయముగా తనకొరకు ప్రాణికార్యములు నెఱవేర్ప నారంభించుట మనకు కావలశినది. గుండె కొట్టుకొనుటయు, ఊపిరి వచ్చుటయు ప్రాణలక్షణములు గనుక సాధారణముగా నేడ్పుతో నారంభమగు ప్రథమశ్వాసమే జీవనారంభము అందువలన యేడ్పు ఆరంభించిన నిమిషము జననకాలముగా భావింపవలయును. ఈ విధముగా కాల నిర్ణయము చేయుట తత్త్వశాస్త్రసమ్మతము. 'ఎక్కడ' అను నర్థమిచ్చు 'క్వా' అను ఆర్పు ఆత్మది. శిశువు జన్మించువఱకును ఆత్మ పరబ్రహ్మమును చూచుచుండును. జన్మింపగానే బ్రహ్మదర్శనము చటుక్కున తప్పును. కనుక ఆత్మ నరలోకమునఁబడి మాయావృతమగును. కనుక ఆయాత్మ 'క్వా, క్వా' (ఎక్కడ పరబ్రహ్మము—ఎక్కడ పరబ్రహ్మము) అని యార్చును. సరియయిన కాలమువలన సరియయిన ఫలములు తెలియును. జ్యోతిష్కునకు సంపూర్ణ శాస్త్రజ్ఞానమున్ననే తప్ప అతఁడు చెప్పిన ఫలములు సరిగానుండవు. అర్ధార్ధజ్ఞానము ఎందులోనయినను హానికరమే. జ్యోతిశ్శాస్త్రమున మరింత. జ్యోతిష్కుఁడు ఫలములు చెప్పునపుడు గ్రహములకూటములును, దృష్టులును, పరిహారశక్తులును జాగరూకతతోఁ బరిశీలింపవలయును, అట్లు చేయనిచో చెప్పిన ఫలములు తప్పును. ఫలములు చెప్పునపుడు జ్యోతిష్కుని మనస్సు ప్రసన్నమై, అవ్యాకులమయి యుండవలయును. చింతాక్రాంతమై యుండరాదు. తాను చెప్పవలసిన ఫలములయందే యేకాగ్రదృష్టిగలిగి యుండవలయును. జ్యోతిష్కుఁడు ఫలములు చెప్పునప్పుడు బహుమతి దొరకదన్న భయముచేత అడిగిన వారి కనిష్టములయిన ఫలములు దాఁపరాదు. ఉన్న దున్నట్టు స్పష్టముగఁ జెప్పవలయును. ఈపైని చెప్పిన నాల్గులక్షణములే కాక జ్యోతిష్కుఁడు ధార్మికుడు, దైవభీతి కలవాడును, సత్యవాదియును, అమాయికుడును, అయి యుండవలయును. జ్యోతిష్కునకు ఉండవలసిన లక్షణములన్నియుఁ గలవాడు జననకాలము సరిగాఁ దెలిసినయెడల ఫలములు సరిగాఁ జెప్పఁగలడు. శాస్త్రసత్యాసత్యములు పయినజెప్పిన సంగతులనుబట్టి యుండును.

—చాగంటి అప్పన్న శాస్త్రి.

# ఇన్స్యూరెన్సువిషయములు

## క్రొత్త భీమాకంపెనీలు: కొన్ని సమస్యలు

[ 'క్రొత్త భీమాకంపెనీలు: కొన్నిసమస్యలు' అను శీర్షికతో 'కమర్షియల్ గెజెట్' అను పత్రికయందు యస్. సి. బెనర్జీ అనువారు ఒక చక్కనివ్యాసమును వ్రాసియున్నారు. తెనుగు మాగాణికి నడిబొడ్డు అయిన బెజవాడయందు స్థాపింపబడి వ్యవహరించుచున్న డెక్కన్ ఇన్సూరెన్సుకంపెనీ అధ్యక్షులగు శ్రీయుత శీలంశెట్టి గోవర్థనరావుగారు తాము ఆంగ్లమున ప్రచురించుచున్న 'ది ఇండియన్ పోలసీహోల్డర్సు రెవ్యూ' యందు సదరు వ్యాసమును ఎత్తి ముద్రించిరి. దానిని తెనుగు పాఠకులకు అందింపదలచి కొంతభాగమును 1934 డిసెంబరు సంచికలో ప్రచురించితిమి. ప్రస్తుత ప్రచురితభాగము దానికి తరువాయి.............

—సంపాదకుడు ]

ఆకర్షణీయముగనుండుటకు ప్రయత్నించుట అనునది నిజముగా కూడనితలంపుకాదు. కాని ఆకర్షణీయముగ నుండుట ఎట్లో ఎరుంగవలయును. పద్ధతి ఎఱుంగక ఆకర్షణీయముగనుండుట కష్టమును కొనితెచ్చు కొనుటయే. క్రొత్తగా ప్రారంభింపబడిన కొన్నికొన్ని భీమాకంపెనీల ప్రోస్పెక్టసులు, పోలసీపద్ధతులు పరికించితిమేని ఆ ప్రోస్పెక్టసులు, ఆ పోలసీపద్ధతులు అక్చ్యుయరి అనుమతినంద లేదనుట నిస్సంశయముగును. కంపెనీవారు ఆకర్షణీయముగనుండుటను కోరిరి వారు తమ కోరిక నెట్లు నెఱవేర్చుకొనిరి? వివిధములగు కంపెనీల ప్రోస్పెక్టస్‌ల నెత్తికొనిరి ఇందుండి కొన్నివిషయములు, అందుండి కొన్నివిషయములు గ్రహించి కలగాపులగ మొనర్చిరి. హెచ్చు ప్రీమియమురేట్లుగల ఒకానొక కంపెనీ 'డిజెబిలిటీ బెనిఫిట్' అనబడు సౌకర్యమును కలిగించును. తక్కువ ప్రీమియమురేట్లుకల మఱికొన్ని కంపెనీలు కూడ డిజెబిలిటీ బెనిఫిట్ సౌకర్యమును చూపబోవుచుండును. తమ తక్కువరేట్ల ప్రీమియములతో ఇది సాధ్యమా అను విషయమునుగూర్చి అవి ఒక్కసారియైన తలంపవు. కొందఱుపెద్దలు తలంచునట్లు ఒక క్రొత్త భీమాకంపెనీకి కలుగగల వ్యాధులకన్నిటికిని పెద్ద పెయిడ్ అప్ మూలధనము మందుకాకపోయినను చిన్నదిఅగు పెయిడ్ అప్ మూలధనమువలన ఉపేక్షింపరాని కష్టములునుగలవు. కొన్ని క్రొత్తకంపెనీలు చాలీచాలని మూలధనముతో గృహనిర్మాణపద్ధతుల నవలంబించుట చూడ చాలఆశ్చర్యము కొలుపకమానదు ఇట్లు అవలంబించుట శక్తికిమించి వర్తించుట అని ఆ కంపెనీలు ఏలగుర్తింపవో తెలియదు. ప్రజాలోకమున విశ్వాసము నిలుపుకొనవలయునుగదా? కాని ఆ కంపెనీలు ఎట్లు నిలుపుకొనగలుగును! ఇన్సూరు చేయువానిని ఆకర్షింపవలయునను ఉత్సాహముతో ప్రారంభించి ఈ కారణమున తుదిని ఆ కంపెనీలు నిర్మూలనమగును.

పెద్దపెద్ద బోనస్సులనుచూపుట నేటి యుగధర్మమై యున్నది. ఇట్లుచూపుట అజ్ఞానమును, తెలివితక్కువను సూచించును. మొదటి వాల్యుయేషనునందే అత్యా

శ్చర్యకరమగు ఫలితములను చూపనిదే సంతుష్టినందని క్రొత్తకంపెనీలు కొన్నిగలవు. అవి మంచి బోనస్సులను డివిడెండులను ప్రకటించును. చిరప్రతిష్ఠితములై స్థిరమగు ఆర్థికసంపత్తితో నొప్పు కంపెనీలు చూపు అభివృద్ధికి మించిన అభివృద్ధిని ఈ కంపెనీలు చూపును. ప్రాయకముగా ఈ కంపెనీలు అప్పుడు యిచ్చినరీ మంచితనమున అరు కొన్నదానికంటె వడ్డీరేటును హెచ్చించి హెచ్చు సర్‌ప్లస్‌ను చూపును. ప్రశంసింపరాని మరికొన్ని ఇతర పద్ధతులకూడ నవలంబించును.

జనప్రీతి సంపాదింపవలయునను తీవ్రకాంక్షయే ప్రీమియము రేట్లను బొత్తిగా తగ్గించివైచుటకు కారణమగుచున్నది. మునుపటికంటె ఇప్పుడు ఇన్సూరెన్సు వ్యాపారవిషయమున వ్యయములు మిక్కిలి ఎక్కువగా ఉన్నవి. అయినను 'మిక్కిలి తక్కువప్రీమియములు' అని కొన్నికంపెనీలు ప్రకటించుచున్నవి. న్యాయమును, అవసరమును కాని హెచ్చు రేట్లను నేను ప్రోత్సహింపను. కాని రక్షణ అను హద్దుకుకూడ దిగబడిపోవునంతటి తక్కువగా ప్రీమియములు ఉండరాదు. ప్రీమియము రేట్లు తగ్గియుండినకొలదియు లాభములరేషియో అధికముగా నుండుచుండుట భీమాకంపెనీల సామాన్యానుభవమే. జనప్రీతి సంపాదింపవలయునను కాంక్ష పెక్కుదోషములు చేయబడుటకు కారణమైనది. క్రొత్తకంపెనీలు ఇట్టిదోషములనుండి దూరముగనుండుట దుస్సాధ్యమగుచున్నది. కాగా క్రొత్తకంపెనీలు పలు అపాయములకు గుఱియగుచున్నవి. అట్టికంపెనీలు ప్రపంచమునకు వ్యయాధిక్యమును తక్కువ ప్రీమియములతోను, పెద్ద బోనస్సులను తక్కువవడ్డీరాబడితోను జతచేసినట్లు చూపట్టును. నిజముగా అదియొక అద్భుతకృత్యము! ప్రొఫెసర్ మాధవఅంతటి మేధావికికూడ విడదీయరాని యక్షప్రశ్నముగా అది కానిపించును. ఆ మహాశయుడిట్లు చెప్పుచున్నాడు. 'తక్కువ ప్రీమియములు: వ్యయాధిక్యము—తక్కువరాబడి: విశేష లాభములు ఒకదానితోనొకటి సంగతముకానివి.'

సంగతము అగుగాక, కాకపోవుగాక క్రొత్తకంపెనీలు ఈ అద్భుతకృత్యమును కావించుటకే దొరకొనును. భావిఫలమునుగూర్చి విచారింపకయే అవి ఈపనికి కడంగును. ప్రస్తుతమునుగూర్చియు, ప్రజాకర్షణమును గూర్చియే ఆ కంపెనీల ఇప్పటి చింతయంతయును. స్పర్థతోకూడియున్న మార్కెట్టునందు వ్యాపారము సంపాదింపవలసియున్నదని ఆ కంపెనీలు వాకొనును. నిజమే. స్పర్థను తప్పించుకొనజాలవు. అయితే స్పర్థ కంపెనీలను ఇక్కుపలలోనికి దింపనక్కఱలేదు. బుద్ధిపూర్వకముగా పల్లములో దిగబడిపోయి పైకివచ్చుటకు అనుకూలించు ఏదోఒక అద్భుతసంఘటనము కలుగుననియు, పెద్దవాడువచ్చి కేలూతయిచ్చి ఉద్ధరించుననియు నమ్ముటకంటె తెలివితక్కువ ఉండబోదు. జీవితభీమా ప్రపంచమున క్రమాభివృద్ధికేగాని గారడీకి ఎంతమాత్రమును అవకాశములేదనుటను జ్ఞప్తియందుంచుకొనుట లెస్స.

ఉండగల అవపాతములలో కొన్నిటినిమాత్రమే ఇచ్చట దిఙ్మాత్రముగ పరామర్శించితిని. మఱియు పెక్కు అవపాతములుగలవు. క్రొత్తకంపెనీలకు వానికి ప్రత్యేకమైన సమస్యలుగలవు. చూడగాచూడగా అవి ఉగ్రమైనవికూడ. నిదర్శనముగా వ్యాపారమునుకూర్చుట అను సమస్యను ఎత్తికొనుడు. స్పర్థ తీక్ష్ణమైయున్న ఈ దినములలో క్రొత్త భీమాకంపెనీ వ్యాపారమును చేకూర్చుకొనుట ఎట్లు? ప్రజలదృష్టి ఏమాత్రమేని ఆకర్షించుట దానికెట్లు సాధ్యమగును? బహుశః ఆ క్రొత్తకంపెనీకి చెప్పదగు లైఫ్‌ఫండు ఏమియులేదు. చూపుటకు బోనస్సులేదు—ఉన్నను కొద్ది. ఎట్లయినను ప్రజాహృదయమున దాని స్థిరత్వమునుగూర్చి కలుగు సందేహములను నివారింపజాలు పెద్దతనము (వ్యాపారముచేత గాని, వయస్సుచేత గాని) దానికడ లేదు. కాగా దానికి వ్యాపారము వచ్చుటెట్లు? భీమా సంస్థకు వ్యాపారమే ప్రాణముకదా? ప్రాణాధారమగు ఈ వ్యాపారవిషయముననే పెక్కు క్రొత్తకంపెనీలు కూలిపోవుచున్నవి. వ్యాపారము ఏజెంట్లమూలమున సమకూడుచున్నది. 'క్రొత్త భీమాకంపెనీలు: ఏజెంట్లు' అనునది ఒక ప్రత్యేకసమస్య [ఈ విషయమై వైమాసపు సంచికలో ప్రస్తావింపబడును.]

# సంపాదకీయ సమాలోచన

## కీ. శే. మునిస్వామినాయుడుగారు:—

ఇంతకుపూర్వము మదరాసు ప్రభుత్వమున ప్రధానామాత్యులుగ నుండినవారును, జస్టిస్ డిమోక్రాటిక్ పక్షమునకు నాయకులును అగు శ్రీ దివాన్ బహదూర్ బొల్లిన మునిసామినాయుడుగారు గతమాసము ౧౩-వ తేదీని దివంగతులైరి. వీరి మరణము ముఖ్యముగా జస్టిస్ పక్షమునకు గొడ్డలిపెట్టు. ప్రస్తుత ప్రధానామాత్యులగు బొబ్బిలిరాజాగారు శ్రీ నాయుడుగారితో సంప్రదించి జస్టిస్, జస్టిస్ డెమోక్రాటిక్ పక్షములను మేళవించి జస్టిస్ పార్టీ పునర్నిర్మాణమునుగావింప తలపెట్టియుండిరి. ఆ తలపులు ఫలితము కాకుండగనే నాయుడుగారు దివంగతులగుట పైకార్యము ఇంచుమించుగా దుస్సాధ్యమైన దగుచున్నది. నూతనసంస్కరణములురానున్న యదనున నాయుడుగారిపరిణితబుద్ధి లేకుంట మదరాసు రాజకీయముల కొకగొప్పలోటు అని చెప్పక తీరదు. న్యాయవాదవృత్తియందు ధనము, యశోధనము ఆర్జించి స్థానికసంస్థల పరిపాలనమున ప్రవేశించి ప్రశంసనీయమగు ప్రజాసేవ గావించి నాయుడుగారు చరితార్థులయినారు. శ్రీ పానుగల్లు రాజావారికి కుడిభుజముగా పనిచేసి వారియనంతరము పార్టీ నాయకత్వమునుబడసి నాయుడుగా రాపార్టీని శుచిపథమున నడపిరి. చిత్తూరుజిల్లా బోర్డునకు వారు మూడుటరములు అధ్యక్షులుగానుండి ప్రియవాదితనము నెఱపిరి. రైతుక్షేమమునకై ఆయన చేసిన కృషి అనంతమైనది. జమీన్ రైతు ఉద్యమమునకు శ్రీవారు యథామతిని ప్రోత్సాహమొసంగిరి టోలుగేట్లు నిర్మూలించి శ్రీవారు దేశమునకుగావించిన ఉపకారము ఈ తరమున మఱువరానిది. ప్రజానాయకులు ఈ రాష్ట్రమున పొందగల పెద్ద గౌరవములలో నొకటియగు మంత్రిత్వము పొందినను నాయుడుగారు తమ నిరాడంబరతకు దూరముకాలేదు. పదవిపై వారు మితిమీరిన మక్కువనిలిపిన వారును కాదు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణముపట్ల వారు ఇటీవల వ్యతిరేకాభిప్రాయులై యున్నను ఒకప్పుడు వారు కాంగ్రెసుపక్షీయులై కూడ నుండిరి, మంత్రాంగమెఱుగని మంత్రిత్వము, రైతుక్షేమము మఱువని ఉద్యోగము, ప్రజాహితమును విస్మరింపని నాయకత్వము శ్రీ మునిస్వామినాయుడుగారి బహుజనామోదమునకు కారణములు. నాయుడుగారి కుటుంబమునకు మాహృదయపూర్వకమగు సానుభూతిని తెలుపుకొనుచున్నాము. శ్రీవారి పవిత్రాత్మకు శాంతికలుగు గాక!

## రాయలసీమ క్షామము:—

దత్తమండలములను రాయలసీమ యనుటకంటె క్షామసీమయనుట సముచితముగ నుండును. అచ్చట క్షామములు తఱుచు. ఈయేడు వర్షాభావముచే రాయలసీమలో పెక్కుభాగములందు పంటలు లేకపోయినవి. మనుష్యులకు తిండి, పశువులకు గడ్డి దొరుకుట దుస్తరమగుచున్నది. ప్రభుత్వపక్షమున కూడ కొంత కదలికపుట్టినది. 'త్రాగుటకు జలము సరిపోవును పంటకు

చాందు' అని ఆయా ప్రాంతములందలి ప్రభుత్వోద్యోగులు నివేదికలు పంపుచున్నారు. కఱువు ఏర్పడినదని వారును అంగీకరించినారు. పనులు కల్పించుటకై వారు రోడ్లకు కంకరకొట్టించుటకు ప్రారంభము చేసినారు. ఈ ప్రారంభము హ్రస్వదృష్టిని సూచించుచున్నది కాని దూరదృష్టిని సూచించుట లేదు. ఏమందురా? ఈ కంకరకొట్టుటము వలన కొందఱికి కొద్దిపాటికూలి లభింపగలదు. అది తత్కాలికోపయోగమే. అట్లుగాక ఈ కూలీలచేతనే పూడిపోయిన చెఱువులు త్రవ్వించుట, క్రొత్తవి ఏర్పఱుచుట మొదలగుపనులు చేయించినచో అసలైన క్షామనివారణ కాగలదు. ప్రజానాయకులును, ప్రభుత్వమువారును ఇది గుర్తించుట లెస్స. ఈ కష్టకమయమున రాయలసీమ ప్రజలకు సాహాయ్యము చేయవలసినదిగ ఇతర ఆంధ్రులను నాయకులు హెచ్చరించియున్నారు, పత్రికలును ప్రబోధించియున్నవి నాయకుల హెచ్చరికగాని, పత్రికల ప్రబోధముకాని సర్కారు ఆంధ్రులను కదల్చినట్లు లేదు. బీహారు భూకంపస్థితికి సహాయముచేయుటలో చూపిన ఉత్సాహములో శతాంశమైన ఇప్పుడిట్టి గానరాకుండుట శోచనీయము. ఇకనైనను త్వరపడి సర్కారు ఆంధ్రులు కష్టదశయందున్న సోదరులకు యథాశక్తిని తోడుపడి స్వధర్మమును నిర్వహింతురు గాక!

**తుంగభద్ర ప్రాజెక్టు:—**

రాయలసీమ క్షామసీమకానేల? అట నుండి క్షామదేవతను పారద్రోలుటకేమియు ఉపాయములేదా? అను ప్రశ్నలు ప్రస్తుతసమయమున కలుగుట సహజము. ఆ ప్రశ్నలకు ఉత్తరములై తుంగభద్ర ప్రాజెక్టు, వెలుగోడుప్రాజెక్టు మొదలగునవి నిలుచుచున్నవి. కాని వానినిర్మాణ మెప్పటికప్పుడే వెనుక వేయబడుచున్నది. ఈ సంవత్సరము జనవరి 23-వ తేదీని మదరాసు శాసనసభలో తుంగభద్ర ప్రాజెక్టును గూర్చి జరిగిన క్రింది ప్రశ్నోత్తరముల తిలకించుడు:

పి. వి. కృష్ణయ్యచౌదరిగారి ప్రశ్న:—(ఏ) తుంగభద్ర స్కీముగూర్చి సంప్రతింపులు యేస్థితిలో నున్నవి?

(బి) ప్రభుత్వమువారు దీని పరిష్కారముకొరకు ఇండియా ప్రభుత్వముయొక్క జోక్యము కోరినారా?

(సి) ఇండియా ప్రభుత్వమునెదుట తుంగభద్ర స్కీమునుమాత్రమే పెట్టెదరా లేక తమ విచారణలో నున్న స్కీములన్నిటిని వారియెదుట పెట్టెదరా?

జవాబు:—(ఏ) గత అక్టోబరులో బెంగుళూరు సమావేశముతరువాత ఇక నెట్టి సంప్రతింపులు జరుగలేదు. (బి-సి) ఇండియా ప్రభుత్వముయొక్క జోక్యమింకను కోరబడలేదు. ఆ విషయము విచారింపబడుచున్నది.

ఒక అనుబంధ ప్రశ్న:—రివిన్యూమెంబరు జవాబు చెప్పుచు, ఇండియా ప్రభుత్వముయొక్క జోక్యము అవసరములేకుండ యీ ప్రాజెక్టుకు సంబంధించిన సంస్థానములతో సమాధానము కుదురవచ్చునని ప్రభుత్వమువారు తలచుచున్నారని చెప్పిరి.

దీ॥ బ॥ ఎం. గోపాలస్వామి ముదలియారుగారి ప్రశ్న:—తుంగభద్ర ప్రాజెక్టునకు చాల ఆలస్యము జరుగుటచేత, యిది నిర్వహింపబడువరకును యితర స్కీముల నన్నిటిని నిలిపియుంచుట భావ్యముకాదా?

రివిన్యూమెంబరు:—భావ్యముకాదు. తుంగభద్ర ప్రాజెక్టు చాల పెద్దస్కీము, గనుక యితర అవసరమైన స్కీములను నిలిపియుంచుటకు వీలులేదు.

ప్రభుత్వమువారు ఈ ప్రాజెక్టు విషయమై ఇంతటి ఉదాసీనభావమును చూపుటకు కారణము తెలుగువారు తగు ఆందోళనము జరిపి ఒత్తిడి కల్గింపకుండుటయే.

ప్రస్తుతమైనను వారిని కార్యతత్పరు లనుగా చేయునుగాక !

## ఆంధ్రోత్కళ సమస్య:—

ఈ విషయమై ఆంధ్రులు విశాఖపట్టణములో అవసరముగా సమావేశమై లండనుకు రాయబారమంపుటకును అందుకొఱకు ఈ నెలలోపుగా ఆంధ్రనిధిని కూర్చుటకును తీర్మానించిరి. తరిమిలాను ఇందునుగూర్చి ఏమి కార్యకలాపము నడచినదో తెలియరాదు తరుణము మించినచో ఆంధ్రజాతికి మఱువరాని మహాపకారము జరుగగలదు. అలసత్వమునకిది అదనుకాదు. కార్యరంగమున దుమికి నడుములుకట్టి స్వక్షేత్రపు కొనలు ఇతరులు కోసుకొనిపోకుండ చూడవలసిన బాధ్యత ఆంధ్రులపై నిలిచియున్నది.

## కొబ్బరిపరిశ్రమకు రక్షణ:—


సింహళద్వీపమునుండి కొబ్బరికాయలు విశేషముగ దిగుమతియగుటవలన ఈ దేశమున కొబ్బరిధర బొత్తిగా మందమైనది. కొచ్చిన్, తిరువాన్కూరు, మలబారు, మన రాష్ట్రమున తూర్పుగోదావరి మండలము నందలి కోనసీమలయందీ పరిశ్రమ విశేషము. కొబ్బరి మందమైన ఈ నాలుగేండ్లనుండియు కోనసీమయందలి రైతులును, ఈనాందారులును పడెడు కష్టముల కంతులేకుండనున్నది. ఇపుడు ప్రభుత్వమువారు కొబ్బరి పరిశ్రమకు కొంతరక్షణ కల్పించుటకు నిశ్చయించిరి. కావున కొబ్బరిధర కొంతవఱకు పెరిగి అచటి రైతులకును, ఈనాందారులకును ఊపిరి తీసికొనుటకు అవకాశము కల్పింపగలదు. ధాన్యము విషయమునకూడ ఇట్టి రక్షణను ప్రభుత్వమువారు కల్పించుట కంపలబడ్డ రైతునకు మేలుచేయుటయగును.

## వావిళ్ళవారికి సన్మానము:—

ఆరువందలకు పైబడిన సంస్కృతాంధ్ర భాషాగ్రంథములకు సుందరతర ముద్రణ మిచ్చి పలువత్సరములుగ సముచితముగు సారస్వతసేవగావించుచున్న శ్రీ వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రిగారికి విద్యానగర మనదగిన విజయనగరమున సన్మానము జరుపుటకు నిశ్చయమైనదని తెలిసికొనుటకు సంతసించుచున్నాము, విజయనగరపురపాలక సంఘాధ్యక్షులును. వైశ్య ప్రముఖులును, సారస్వత సేవకులును అగు శ్రీ పనుమర్తి వీరభద్రస్వామిగారు ఈ సన్మానమునకు యాజమాన్యమువహించి భాషాప్రియులగు ఆంధ్రుల చిరకృతజ్ఞతకు పాత్రులగుచున్నారు.

## శ్రీ రామమూర్తి పంతులుగారి ఇంగ్లీషు : సవరనిఘంటువు:—

ముప్పదియైదేండ్లు తీవ్రపరిశోధన సలిపి రావుసాహేబ్ గిడుగు రామమూర్తి పంతులుగారు సవరభాషకు వ్యాకరణము, నిఘంటువు రచియించిరి. అన్యభాషకు వ్యాకరణము, నిఘంటువు ప్రసాదించి ఆభాషకు స్థిరరూపమిచ్చుటకు తోడుపడిన ఆంధ్ర పరిశోధకమహాశయులు శ్రీ పంతులుగారొక్కరే. ఈ వ్యాకరణమును, నిఘంటువును పంతులుగారి అసాధారణమైన మేధకు మానదండములై వెలయగలవు. వ్యాకరణ మీవఱకే వెలుగును చూచినది. ఉద్గ్రంథమగు నిఘంటువునకు ఇపుడు జయపురము మహారాజావారు కృతిభర్తలగుట ఎంతయు సముచితముగనున్నది. శ్రీ విక్రమదేవవర్మగారు సాటిలేని సారస్వత పోషకులను కీర్తి ఈ ఉద్గ్రంథమును కృతినందుటవలన ఇబ్బడి ముబ్బడి కాగలదు.



## జనవరి, ౧౯౩౫.

౧:—మైసూరు. విజయనగరవాస్తవ్యులును, నవీన కలియుగార్జున బిరుదాంకితులును అగు ముప్పిడి రామమూర్తిగారి అత్యద్భుతధనుర్విద్యానైపుణ్యమును తిలకించి మైసూరు యువరాజాగారును, కుమారరాజాగారును ప్రశంసించిరి.

:—వాల్తేరు: ఏ.వి.యన్. కళాశాలలో డాక్టర్ సర్ రాధాకృష్ణయ్యగారి అధ్యక్షతను శ్రీ రావుసాహేబ్ మహోపాధ్యాయ గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారు తాము రచించిన ఇంగ్లీషు—సవర నిఘంటువును సాహిత్య సామ్రాట్ డాక్టర్ జయపురమహారాజా విక్రమదేవవర్మగారికి కృతియిచ్చిరి.

:—కడపజిల్లాలోని ప్రొద్దుటూరునివాసి, గణిత శాస్త్ర ప్రజ్ఞానిధి ఎల్. సంజీవరాయుడుగారు చెన్నపురిచెంతనున్న తాంబరమున క్రిస్టియన్ కాలేజి భవనమునందు ఎక్స్‌గవర్నర్ ఉస్మాన్‌గారి అధ్యక్షతక్రింద అత్యద్భుత మేధాప్రదర్శనమును గావించిరి.

౨:—ఆంధ్రమహాసభ కార్యదర్శి శ్యామసుందరరావుగారు రంగూనుచేరిరి.

౩:—మద్రాసు. ఈనాములబిల్లునుగూర్చి దివాన్ బహదూరు మోచర్ల రామచంద్రరావు పంతులుగారి నాయకత్వమున గవర్నరుకడకు రాయబారము.

౫:—గుంటూరు. శ్రీ శారదానికేతనము దశమవార్షికోత్సవము.

౬:—చిత్తూరు. రాయలసీమ మహాసభ.

:—మదరాసు. ప్రఖ్యాతాంధ్రనటులగు దేవరకొండ వెంకటసుబ్బారావుగారికి హరిశ్చంద్ర నాటకప్రదర్శనసందర్భమున దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు స్వర్ణపతకము నొసగిరి.

౭:—వెంకటగిరి. నెల్లూరుజిల్లా నాల్గవజమీనురైతు మహాసభ. ఆంధ్రకేసరి ప్రకాశంపంతులుగారి అధ్యక్షత.

౮:—శ్రీ దేవరకొండ వెంకటసుబ్బారావుగారికి సర్ కూర్మా వెంకటరెడ్డిగారి అధ్యక్షతను చెన్నపురి ఆంధ్రులు సన్మానపత్రము నొసంగిరి.

౧౧:—బెజవాడ. ఆంధ్రరాష్ట్రపత్రికా రచయితల సమావేశము. శ్రీ దేశోద్ధారక విశ్వదాత కాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారి అధ్యక్షత.

౧౨:—కొవ్వూరు. తూర్పుగోదావరిజిల్లా ఆత్రేయపురము నివాసులు, అసాధారణవైదికలౌకిక ప్రజ్ఞాధురీణులును బ్రహ్మశ్రీ జటావల్లభుల కృష్ణసోమయాజిగారి మరణము.

౧౩:—చిత్తూరు. శ్రీ దివాన్‌బహదరు బాల్లిన మునిసామినాయుడుగారి మరణము.

౧౯:—కడపజిల్లా రాజంపేట తాలూకాయందు ఖండ్ల పరిశ్రమాభివృద్ధికై నొకఫ్యాక్టరీ ఏర్పాటుచేయ ప్రత్యేకఉద్యోగి నియమింపబడెను.

---

### పై మాసపు సంచికలో

శ్రీ కవికొండల వెంకటరావుగారు రచియించిన

### 'పైడయ్య దరిద్ర దేవత'

అను మనోహర కథావ్యాసము—

ప్రపంచమునందలి పత్రికా సంపాదకులలో అతి లోక ప్రసిద్ధిగాంచిన

### 'లార్డు నార్తుక్లిఫ్'

అనువాని మహనీయజీవితము - ప్రచురింపబడును.

---